డా॥ వై.ఎస్.ఆర్.

# రైతు భరోసా

వ్యవసాయ, ఉద్యాన, మరియు పట్టు పరిశ్రమ రైతుల సచిత్ర మాస పత్రిక

సంపుటి - 02 సంచిక - 08 ఫిబ్రవరి 2022 పేజీలు - 44




## అత్యున్నత సేవల నిలయాలు ..
## ఆర్.బి.కె.లకు ఐ.ఎస్.ఓ. గుర్తింపు



## గణతంత్ర సంబరం




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
సమగ్ర పోషక యాజమాన్యం
(INTEGRATED NUTRIENT MANAGEMENT)
శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారు
గౌరవ ముఖ్యమంత్రి వర్యులు
శ్రీ కె. కన్నబాబు గారు
అతి ఎప్పుడూ అనర్థమే... ఏదైనా...
మితిమీరిన రసాయనిక ఎరువుల వినియోగం కూడా
కార్బన్‌డైఆక్సైడ్
(కార్బన్+ఆక్సిజన్)
మొక్కకు కావలసిన 18 పోషకాలు
నీరు
ఆక్సిజన్+హైడ్రోజన్
ప్రధాన పోషకాలు
ఉప పోషకాలు
సూక్ష్మ పోషకాలు
న
భా
పొ
కాల్షియం
మెగ్నీషియం
గంధకం
ఇనుము
మాంగనీసు
జింకు
రాగి
మాలిబ్డినం
బోరాన్
క్లోరిన్
భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా రసాయనిక ఎరువులతో పాటు సేంద్రియ, జీవన ఎరువులను వాడి
నేల ఆరోగ్యాన్ని, భూసారాన్ని మరియు నాణ్యమైనఅధిక దిగుబడులను సాధించండి.
అజొల్లా
గ్లైరిసీడియా
అజోస్పైరిల్లం
వేపచెక్క
రసాయన ఎరువు
జిప్సం
చెరుకు మడ్డి
నేల ఆరోగ్యమే - పంట ఆరోగ్యం
వర్మీకంపోస్ట్
నాడెప్ కంపోస్ట్
పశువుల ఎరువు,
పంటల అవశేషాలు
మరింత సమగ్ర సమాచారం కొరకు
టోల్ ఫ్రీ
155251
సమగ్ర రైతు సమాచార కేంద్రం (ICC)
వ్యవసాయశాఖ
ఆంధ్రప్రదేశ్
మీ గ్రామంలోని
డా॥ వై.యస్.ఆర్. రైతు భరోసా కేంద్రాల్ని సందర్శించండి
నాణ్యతా ప్రమాణాలను ధృవీకరించిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను RBK ల ద్వారా ఆర్డర్ చేసి పొందగలరు







ప్రధాన సంపాదకులు
**శ్రీ హెచ్. అరుణ్‌కుమార్,** ఐ.ఏ.ఎస్.
వ్యవసాయ కమీషనర్



సంపాదకులు
**శ్రీమతి డి. ప్రమీల**
డైరెక్టర్, ఆత్మ

కార్యనిర్వాహక సంపాదకులు
**శ్రీ. వి. హరగోపాలరాజు**

సహాయ సంపాదకులు
**శ్రీ ఎన్.సి.హెచ్. బాలు నాయక్,** డిడిఎ
**డా॥ బి.ఎస్. శ్రీనివాసాచార్యులు,** డిడిఎ ఇన్‌చార్జ్
**శ్రీ జె. వెంకటరావు,** ఎడిఎ
**శ్రీ కె. ఆంజనేయ కుమార్,** ఎఒ



*రచనలు పంపాల్సిన చిరునామా :*
వ్యవసాయ కమీషనర్ వారి కార్యాలయం
చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు
E-mail : mediaproductionap@gmail.com



డా. వైఎస్ఆర్ రైతు భరోసా సంచిక డిజిటల్ ఎడిషన్
apagrisnet.gov.in అందుబాటులో ఉంది


## విషయసూచిక

ఫిబ్రవరి – 2022

సంపాదకీయం


| | | |
|---|---|---|
| 1. | రబీ సాగు జోరు | 5 |
| 2. | ఉద్యాన రైతుకు రక్షణ కవచం | 6 |
| 3. | నాణ్యతకు భరోసా @ అగ్రిల్యాబ్స్ | 7 |
| 4. | మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి, దేవనూరు మిర్చి @ 20,000 | 9 |
| 5. | ఆర్.బి.కె.లు నమ్మకానికి చిరునామాగా నిలవాలి | 10 |
| 6. | అపరాలు, చిరుధాన్యాలు, నూనెగింజల సాగుకు బృహత్ ప్రణాళిక | 11 |
| 7. | మరింత సులభంగా ఈ-క్రాప్ | 12 |
| 8. | అవగాహనతో ఎరువుల వాడకం.. అప్పుడే పంటకు సత్ఫలితం | 13 |
| 9. | ఆంధ్రప్రదేశ్‌లో ఆయిల్ పామ్ సాగు– ఆర్థికంగా బాగు | 15 |
| 10. | వేసవిలో కొర్రసాగుకు సూచనలు | 18 |
| 11. | చౌడు నేలల్లో రేగు సాగు.. ఆదాయం మెరుగు | 20 |
| 12. | చిత్రమాలిక | 22 |
| 13. | ప్రొద్దు తిరుగుడులో అధిక దిగుబడులకు సూచనలు | 24 |
| 14. | మేలైన సస్యరక్షణతో పుచ్చ, ఖర్బూజ సేద్యం | 26 |
| 15. | బత్తాయి, నిమ్మ పంటల్లో చీడ పీడల నివారణ చర్యలు | 28 |
| 16. | తక్కువ పెట్టుబడి... సపోట సాగుతో రాబడి | 30 |
| 17. | పంట ఉత్పత్తులలో అఫ్లటాక్సిన్లు తెలుసుకోవడం ఇలా..! | 32 |
| 18. | అల్ల నేరేడుతో అధిక లాభాలు | 34 |
| 19. | రైతుబిడ్డను వరించిన పద్మభూషణ్ | 36 |
| 20. | సమీకృత రైతు సమాచార కేంద్ర వాట్సప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు – సమాధానాలు | 37 |
| 21. | సందేహాలు – సమాధానాలు | 39 |
| 22. | సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు | 41 |
| 23. | సమీకృత రైతు సమాచార కేంద్రంపై రైతుల స్పందన | 42 |



డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా సచిత్ర మాసపత్రిక సంవత్సర చందా – రూ.300/–
యూనియన్ బ్యాంక్, గోరంట్ల శాఖ ఖాతా నెం. 069610100200430 కు నేరుగా గూగుల్ పే, ఫోన్ పే ద్వారా పంపవచ్చు. డి.డి.లు పంపాల్సిన చిరునామా : ది ఎడిటర్, డా. వై.ఎస్.ఆర్. రైతు భరోసా మాసపత్రిక, వ్యవసాయ కమీషనర్ కార్యాలయం చుట్టుగుంట, పాత మిర్చియార్డు, గుంటూరు




## సంపాదకీయం

# అత్యున్నత సేవల నిలయాలు

రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గాలి. ఆరోగ్యకరమైన పంట పండించాలి. మేలైన దిగుబడి రావాలి. కష్టానికి తగ్గ గిట్టుబాటు ధర రావాలి. అందుకు రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ యంత్రాంగం నిరంతరం వెన్నుదన్నుగా నిలవాలి. ఈ క్రతువులో రైతుకు, ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్నవే డా. వై.ఎస్.ఆర్. రైతు భరోసా కేంద్రాలు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మానసపుత్రికలుగా ఆవిర్భవించిన ఈ కేంద్రాలు నేడు రైతులకు విత్తు నుంచి విక్రయం వరకూ అత్యున్నత సేవలు అందించడంలో జాతీయ స్థాయిలో ఉన్నత నాణ్యతా ప్రమాణాలు నెలకొల్పాయి. గ్రామ స్థాయిలోనే రైతు కోరిన 48 గంటల్లోగా విత్తనం మొదలుకుని పురుగు మందులు, ఎరువులు, నాణ్యమైన ధ్రువీకరించినవి ఇస్తున్నాయి. అలాగే లక్ష మందికి పైబడిన రైతుల భాగస్వామ్యంతో ఏర్పడిన వ్యవసాయ సలహా మండళ్ల సూచనలతో పంటల ప్రణాళికలు అమలు చేస్తున్నాయి. విత్తు వేసింది మొదలు ఫలసాయం వచ్చే వరకూ ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలు, అధికారులు అండగా నిలిచి సలహాలు ఇచ్చేందుకు ఈ రైతు భరోసా కేంద్రాలు వేదికగా నిలుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకం అర్హులైన రైతులందరికీ వర్తించేలా సాంకేతికతను ఉపయోగించుకుని సీజన్ల వారీగా పంటల సాగు వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేస్తున్నాయి. దీనివల్ల వాస్తవ సాగుదాగులకు, కౌలు రైతులకు, దేవాదాయ, అటవీ భూములు సాగు చేసుకునే ఎస్సీ, ఎస్టీ రైతులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి కలుగుతోంది.

పంట దిగుబడి వచ్చాక దాన్ని అమ్ముకోవడానికి, దళారుల బెడద లేకుండా, రైతు ఎక్కువ శ్రమ పడనక్కర్లేకుండా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నాయి. ఈ-కేవైసీ ఆధారంగా నగదు చెల్లింపులు కూడా నిర్దిష్ట గడువులోగా సాఫీగా జరిగిపోతున్నాయి. అంతేకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 7 వేల మంది బ్యాంకింగ్ కరస్పాండెంట్ల ద్వారా బ్యాంకింగ్ సేవలు కూడా ఈ కేంద్రాల ద్వారా అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలైన సున్నా వడ్డీ పంట రుణాలు, పెట్టుబడి రాయితీ, రైతు భరోసా పీఎం కిసాన్ సాయం, పంటల బీమా పథకాల అమలుకు ఈ రైతు భరోసా కేంద్రాలు చిరునామా అయ్యాయి. ఈ పథకాల లబ్ధిదారుల జాబితాలను ఆయా కేంద్రాల్లో ప్రదర్శించడం ద్వారా సామాజిక తనిఖీ జరిగి సంక్షేమ పథకాల్లో పారదర్శకతకు వీలవుతోంది.

గ్రామస్థాయిలోని రైతుల అన్ని అవసరాలు తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం 18 నెలల క్రితం ఏర్పాటు చేసిన డా. వై.ఎస్.ఆర్. రైతు భరోసా కేంద్రాలకు అరుదైన గౌరవం లభించింది. దశల వారీగా ఆర్.బీ.కే.లు ఐ.ఎస్.ఓ. సర్టిఫికేషన్ సాధించాలన్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం ఫలించే దిశగా అడుగులు పడుతున్నాయి. 13 జిల్లాలలో 13 రైతు భరోసా కేంద్రాలకు ప్రతిష్ఠాత్మక భారత నాణ్యతా ప్రమాణాల సంస్థ (ఐ.ఎస్.ఓ.) సర్టిఫికేషన్ 9001-2015 లభించింది. చెన్నై నుంచి వచ్చిన ఈ బృందాలు ఈ కేంద్రాలకు ఈ మేరకు ధృవీకరణ ఇచ్చాయి.

డా. వై.ఎస్.ఆర్. రైతు భరోసా కేంద్రాల పనితీరును గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిరంతరం పర్యవేక్షించడం వల్ల ఇవి నేడు సేవలలో అత్యుత్తమంగా నిలుస్తున్నాయి. రైతులకు సేవలందించడంలో జాతీయ స్థాయిలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయి.

# రబీ సాగు జోరు

రబీ సాగు జోరందుకుంది. అకాల వర్షాలు, భారీ వరదలతో మొదలైన రబీ సీజన్ గడిచిన పదిహేను రోజులుగా ఊపందుకుంది. ఇప్పటికే మూడింట రెండొంతులు సాగులోకి వచ్చింది. అపరాలు కూడా రికార్డు స్థాయిలో సాగవుతున్నాయి. ఇప్పటికే సాధారణ విస్తీర్ణంలో 64 శాతం మేర పంటలు సాగులోకి వచ్చాయి. వరి సాధారణ విస్తీర్ణంలో 53 శాతం, నూనెగింజలు, 57 శాతం, అపరాలు 77 శాతం మేర ఇప్పటి వరకు సాగులోకి వచ్చాయి. ఈ జోరు కొనసాగితే గత ఏడాదికి మించి పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

రబీ సాధారణ సాగు విస్తీర్ణం 56.19 లక్షల ఎకరాలు కాగా గతేడాది రికార్డు స్థాయిలో 62 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. ఈ ఏడాది రబీలో 60 లక్షల ఎకరాలు లక్ష్యంగా నిర్దేశించారు. సీజన్ ఆరంభంలో కురిసిన అకాల వర్షాలు, వరదలకు విత్తుకున్న పంట కొట్టుకుపోవడంతో రెండోసారి విత్తుకోవాల్సి వచ్చింది. దీంతో సాగు ఆలస్యమైంది. అయినప్పటికీ గత 45 రోజుల్లోనే 36 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయి. గోదావరి జిల్లాలు మినహా మిగిలిన జిల్లాల్లో రెండో పంటకు నీరిచ్చే పరిస్థితి లేకపోవడంతో బోర్ల కింద వరికి బదులు అపరాలు, చిరుధాన్యాలు సాగు చేస్తున్నారు.

## వరి లక్ష్యం 21.50 లక్షల ఎకరాలు

రబీలో వరి సాధారణ విస్తీర్ణం 18.75 లక్షల ఎకరాలు. గతేడాది రెండో పంటకు పూర్తి స్థాయిలో నీరివ్వడంతో 23.49 లక్షల ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది 21.50 లక్షల ఎకరాల్లో సాగు చెయ్యాలని లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటి వరకు 10 లక్షల ఎకరాల్లో రైతులు వరి వేశారు.

## ఏపుగా ఎదుగుతున్న వేరుశనగ

సాధారణ విస్తీర్ణం 7.77 లక్షల ఎకరాలు కాగా, గతేడాది 7.35 లక్షల ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది లక్ష్యం 8.12 లక్షల ఎకరాలు. ఇప్పటి వరకు 3.77 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయి. వీటిలో ప్రధానంగా 2.5 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 1.20 లక్షల ఎకరాల్లో జొన్నలు వేశారు.

## 18.75 లక్షల ఎకరాల్లో అపరాలు

రబీలో ప్రధానమైన అపరాల సాగు మరింత వేగంగా ఉంది. అపరాల సాధారణ విస్తీర్ణం 24.22 లక్షల ఎకరాలుండగా గతేడాది 23.74 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. ఈ ఏడాది సాగు లక్ష్యం 24.15 లక్షల ఎకరాలుగా నిర్దేశించగా, ఇప్పటికే 18.75 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. ఇప్పటి వరకు 9.35 లక్షల ఎకరాల్లో కందులు, 7.37 లక్షల ఎకరాల్లో మినుములు, 1.42 లక్షల ఎకరాల్లో పెసలు వేశారు.

## 1.58 లక్షల ఎకరాల్లో వేరుశనగ

నూనె గింజల సాధారణ సాగు విస్తీర్ణం 3.29 లక్షల ఎకరాలుండగా గతేడాది 3.55 లక్షల ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది లక్ష్యం 3.67 లక్షల ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1.85 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయి. ప్రధానంగా వేరుశనగ 1.58 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చింది. పొగాకు సాధారణ విస్తీర్ణం 1.85 లక్షల ఎకరాలుండగా గతేడాది 1.42 లక్షల ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది లక్ష్యం 1.77 లక్షల ఎకరాల్లో పొగాకు వేశారు. మిరప సాధారణ సాగు విస్తీర్ణం 65 వేల ఎకరాలుండగా గతేడాది లక్ష ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది లక్ష్యం 75 వేల ఎకరాలు కాగా ఇప్పటి వరకు 45 వేల ఎకరాల్లో పంట వేశారు.

## లక్ష్యం దిశగా రబీ

గతేడాది రబీలో రికార్డు స్థాయిలో పంటలు పండాయి. ఈ ఏడాది కూడా అదే ఊపు కొనసాగుతుందని భావిస్తున్నాం. ప్రారంభంలో వర్షాలు, వరదలు ఇబ్బంది పెట్టాయి. దాంతో సాగు ఆలస్యమైంది. ప్రస్తుతం మూడింట రెండొంతులు విస్తీర్ణంలో పంటలు పడ్డాయి. ఇదే ఊపు కొనసాగితే గత రబీకి మించి సాగయ్యే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల వర్షాలు కొన్ని పంటలకు మేలు చేకూరుస్తాయి.

**–హెచ్. అరుణ్‌కుమార్,** వ్యవసాయ శాఖ కమీషనర్

"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# ఉద్యాన రైతుకు రక్షణ కవచం

## నర్సరీలకు అన్నింటికీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నాణ్యతలేని విత్తనం, నర్సరీల వల్ల నష్టపోతున్న రాష్ట్రంలోని ఉద్యాన రైతులకు రక్షణ కవచంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన చట్టాన్ని తీసుకొచ్చింది. ఇందుకోసం ఏపీ ఉద్యాన నర్సరీస్ రిజిస్ట్రేషన్ యాక్టు - 2010లో సవరణలు చేస్తూ తీసుకొచ్చిన ఉద్యాన నర్సరీల క్రమబద్ధీకరణ చట్టం అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం నర్సరీలు, షేడ్‌నెట్, పాలీ హౌస్‌లతో పాటు నర్సరీ రంగంలో వ్యాపారం చేసే ప్రతి ఒక్కరూ విధిగా లైసెన్సులు తీసుకోవాలి. వాస్తవానికి దరఖాస్తు చేసిన 90 రోజుల్లో అధికారులు లైసెన్సు మంజూరు చేయాలి. ప్రస్తుతం ఫిబ్రవరి నెలాఖరుకల్లా రాష్ట్రం లోని నర్సరీలన్నింటికీ లైసెన్సులు జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నూతన చట్టం ప్రకారం వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన పంటలకూ ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలు, మొక్కలు వైఎస్సార్ ఆర్బీకేల ద్వారా సరఫరా అవుతాయి. వీఏఏ, వీహెచ్ఏల సహకారంతో రైతులు రాష్ట్రంలో ఏ నర్సరీ నుంచైనా మొక్కలను బుక్ చేసుకొని నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేయవచ్చు.

రాష్ట్రంలోనే 44.60 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఏటా 312.34 లక్షల టన్నుల దిగుబడులొస్తున్నాయి. విత్తనాలు, మొక్కల కోసం మెజార్టీ రైతులు ప్రైవేటు నర్సరీలు, బడా పారిశ్రామికవేత్తల చేతుల్లో ఉన్న షేడ్‌నెట్‌లు, పాలీహౌస్‌లపై ఆధారపడుతున్నారు. రాష్ట్రంలోని 5.885 నర్సరీల ద్వారా ఏటా 422.5 కోట్ల మొక్కలు ఉత్పత్తి అవుతుంటే వీటిలో 95 శాతం మిరప, టమోటా, కూరగాయలు, అరటి (టిష్యూ కల్చర్) పంటలవే. ఏటా రూ.2,481.6 కోట్ల టర్నోవర్ సాధిస్తోన్న ఈ రంగం ద్వారా ప్రత్యక్షంగా 4.41 లక్షల మంది, పరోక్షంగా మరో లక్ష మంది ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం ఉన్న చట్టం పరిధిలో శాశ్వత పండ్ల మొక్కల నర్సరీలు మాత్రమే ఉన్నాయి. చట్టం పరిధిలో లేని షేడ్‌నెట్‌లు, పాలీ హౌస్‌లు, నర్సరీల్లో కొన్ని ఉత్పత్తి చేసే నాసిరకం విత్తనాల బారిన పడి రైతులు ఏటా వందల కోట్ల రూపాయలు నష్టపోతున్నారు. వీరి ఆగడాలకు చెక్ పెడుతూ రూపొందించిన నూతన చట్టం ఈ నెల 18 నుంచి అమలులోకి వచ్చింది. ఇటీవలే గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ అయింది.



## లైసెన్సులు ఇలా

- ఆర్బీకేల్లో ఉండే గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకుల వద్ద ఉండే దరఖాస్తు (ఫామ్-ఏ)తో పాటు రూ. 1,000 చలానా రసీదు పట్టాదార్ పాస్ పుస్తకం లేదా వన్ బి లేదా కనీసం మూడేళ్ళ లీజు డాక్యుమెంట్, నర్సరీ లే అవుట్, ఫీల్డ్ మ్యాప్, సాయిల్/వాటర్ అనాలసిస్ రిపోర్ట్, డిజిటల్ ఫోటోలు సమర్పించాలి.
- నర్సరీలైతే తల్లి మొక్కల దిగుమతి వివరాలివ్వాలి.
- షేడ్‌నెట్, పాలీహౌస్ నర్సరీలు ఏ కంపెనీ నుంచి ఎంత విత్తనం కొన్నారో వాటి బ్యాచ్ నెంబర్‌తో సహా దరఖాస్తుతో పాటు సమర్పించాలి.
- స్థానిక ఉద్యానాధికారి 30 రోజుల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేసి, తనిఖీ నివేదిక (ఫామ్-బీ)ని జిల్లా ఉద్యానాధికారికి సమర్పిస్తారు.
- 90 రోజుల్లో లైసెన్సు జారీ చేస్తారు.
- లైసెన్సు కాలపరిమితి 3 ఏళ్ళు. ఆ తర్వాత రూ. 500 చెల్లించి దరఖాస్తు (ఫామ్-డి) సమర్పిస్తే రెన్యూవల్ (ఫామ్-ఈ) చేస్తారు.
- ఉద్యానాధికారి నర్సరీలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తారు.
- ఎక్కడైనా నాణ్యతా లోపాలుంటే లైసెన్సు రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.
- లైసెన్సు పొందిన తర్వాత నర్సరీలు ఉత్పత్తి చేసే మొక్కలు, మొక్కలు, ఇతర ప్లాంట్ మెటీరియల్ వివరాలు, ధరలను ఆర్బీకేల్లో ప్రదర్శించాలి.
- ఒక్క మొక్క అమ్మినా రైతుకు బిల్లు ఇవ్వాలి.

**“సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి”**

# నాణ్యతకు భరోసా @ అగ్రిల్యాబ్స్



విత్తనం మంచిదైతే... పంట బాగుంటుంది. పంట కళకళలాడితే... దిగుబడి దిగులుండదు. దిగుబడి, ధరలూ బాగుంటే ఇక రైతన్నకు తిరుగుండదు... అంతా సవ్యంగా జరగాలంటే మేలి రకం విత్తనం కావాలి. అన్నదాతలు నకిలీ విత్తనాలతో మోసపోకుండా వై.ఎస్.ఆర్. అగ్రి ల్యాబ్స్ భరోసా కల్పిస్తున్నాయి. ఏటా రూ. వేల కోట్ల పెట్టుబడి మట్టి పాలు కాకుండా కాపాడుతున్నాయి. పైసా ఖర్చు లేకుండా ఇన్‌పుట్స్‌ను ముందుగానే పరీక్షించుకోవడం ద్వారా నాసిరకం బారిన పడకుండా ధైర్యంగా సాగు పనులు చేపడుతున్నామని రైతన్నలు ఆనందంగా చెబుతున్నారు. నాణ్యమైన ధృవీకరించిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇప్పటికే వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే రైతులకు అందుబాటులోకి వచ్చాయి. ఇక ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటవుతున్న వైఎస్సార్ సమగ్ర అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్ నాణ్యత పరీక్షకు భరోసా కల్పిస్తున్నాయి. 70 కేంద్రాలు ఇప్పటికే సేవలందిస్తుండగా కొద్ది నెలల్లోనే మిగతావి కూడా ప్రారంభం కానున్నాయి. ఆర్బీకేల ద్వారా సరఫరా చేసే ఇన్‌పుట్స్‌తో పాటు మార్కెట్‌లోకి వచ్చే ప్రతీ ఇన్‌పుట్ శాంపిల్‌ను ఇక్కడ పరీక్షించుకునే సదుపాయం ఉండటం వల్ల రైతుల్లో నమ్మకం పెరుగుతోంది. సొంతంగా తయారు చేసుకున్న విత్తనమైనా, మార్కెట్‌లో కొనుగోలు చేసినవైనా నేరుగా ఈ ల్యాబ్‌కు వెళ్ళి నాణ్యతను ఉచితంగా పరీక్షించుకోవచ్చు. విత్తనమే కాకుండా ఎరువులు, పురుగు మందుల నాణ్యతను కూడా పరీక్షించుకుని ధీమాగా సాగు పనులు చేపట్టవచ్చు.

## గతంలో 3 శాతం లోపే పరీక్ష...

రాష్ట్రంలో ఏటా వ్యవసాయ ఉద్యాన పంటల సాగు కోసం 1.25 లక్షల లాట్స్ విత్తనాలు, 2.80 లక్షల బ్యాచ్‌ల పురుగు మందులు, 20 వేల బ్యాచ్‌ల ఎరువులు మార్కెట్‌కు వస్తుంటాయి. గతంలో వీటి నాణ్యతను పరీక్షించేందుకు రాష్ట్రంలో 11 ప్రయోగశాలలు మాత్రమే అందుబాటులో ఉండేవి. పెస్టిసైడ్స్ కోసం 5, ఎరువులు, విత్తన పరీక్షల కోసం మూడు చొప్పున మాత్రమే ప్రయోగశాలలున్నాయి. మార్కెట్‌లోకి వచ్చే ఎరువుల్లో 30 శాతం, విత్తనాల్లో 3-4 శాతం, పురుగు మందుల్లో ఒక శాతానికి మించి శాంపిళ్ళను పరీక్షించే సామర్థ్యం వీటికి లేదు. దీంతో మార్కెట్‌లో నకిలీలు రాజ్యమేలేవి. ఏటా వీటి బారిన పడి రైతన్నలు ఆర్థికంగా చితికిపోయేవారు. ఇప్పుడు ఆ దుస్థితి తొలగిపోయింది.

## నాసిరకం తయారీదారుల ప్రాసిక్యూషన్

నాసిరకం ఉత్పాదకాల బారిన పడకుండా ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన 70 ల్యాబ్స్ ద్వారా 2021-22లో విత్తనాలు, ఎరువులు 10 వేల నమూనాల చొప్పున, పురుగు మందుల శాంపిళ్ళు 5,500 పరీక్షించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటివరకు 8,238 విత్తన, 6,490 ఎరువులు, 3,618 పురుగుల మందుల శాంపిల్స్ పరీక్షించారు. వీటిలో 10-20 శాతం రైతులు తెచ్చిన శాంపిల్స్ కాగా మిగిలినవి డీలర్లు అందచేసిన నమూనాలు ఉన్నాయి. 112 విత్తన, 240 ఎరువులు, 41 పురుగుల మందుల నమూనాలు నాసిరకంగా ఉన్నట్లు గుర్తించి తయారీ కంపెనీలను చట్టపరంగా ప్రాసిక్యూట్ చేసేందుకు నోటీసులు జారీ చేశారు.

## ఖరీఫ్ కల్లా మిగిలిన ల్యాబ్స్

ఇప్పటిదాకా తమిళనాడులో అత్యధికంగా 33 అగ్రిల్యాబ్స్ ఉండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి ఫలితంగా 70 ఇంటిగ్రేటెడ్ ల్యాబ్స్‌తో ఏపీ ప్రథమంగా నిలిచింది. ఒక్కొక్కటి రూ. 6.25 కోట్లతో జిల్లా స్థాయిలో 13 ల్యాబ్స్ ఏర్పాటవుతున్నాయి. రూ. 81 లక్షలతో నియోజకవర్గ స్థాయిలో 147 చోట్ల గ్రామీణ ప్రాంతంలో ల్యాబ్స్ సేవలందిస్తాయి. రూ. 75 లక్షలతో నాలుగు (విశాఖ, తిరుపతి, అమరావతి, తాడేపల్లిగూడెం) రీజనల్ కోడింగ్

"చీడపీడలపై మీ సందేహాలను 8331056028 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

సెంటర్స్ ఏర్పాటు కానున్నాయి. వీటన్నిటి కోసం ప్రభుత్వం రూ.213.27 కోట్లు వ్యయం చేస్తోంది. ఇక సీడ్ జన్యు పరీక్ష కోసం డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ టెక్నాలజీతో మరో రూ8.50 కోట్ల అంచనా వ్యయంతో గుంటూరులో ల్యాబ్ అందుబాటులోకి వస్తోంది. ఇప్పటికే అత్యాధునిక సౌకర్యాలతో నెలకొల్పిన 70 అగ్రి ల్యాబ్స్‌ను రైతు దినోత్సవమైన డాక్టర్ వైఎస్సార్ జయంతి రోజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించడం తెలిసిందే. మిగిలిన వాటిలో 50 ల్యాబ్‌లను మార్చిలో, మిగతా ల్యాబ్‌లతో పాటు జిల్లా ల్యాబ్‌లు, కోడింగ్ సెంటర్లను ఖరీఫ్ సీజన్ కల్లా సిద్ధం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## వేగంగా పరీక్ష నివేదికలు..

నియోజకవర్గ స్థాయి ల్యాబ్‌లన్నీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాగానే నెలకు 50 శాంపిల్స్‌ను విత్తనాలు, ఎరువులు ఏటా 88.200 చొప్పున నమూనాలు పరీక్షిస్తారు. ప్రతి జిల్లా ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువుల నమూనాలు 39 వేల చొప్పున, 2 వేల చొప్పున పురుగు మందుల శాంపిల్స్‌ను పరీక్షిస్తారు. ఆ విధంగా ఏటా 1,27,200 శాంపిళ్ళ చొప్పున విత్తనాలు, ఎరువులతో పాటు 26 వేల పురుగు మందుల నమూనాలను పరీక్షించి నిర్ధారిస్తారు. విత్తన పరీక్ష నివేదికను వారం నుంచి పది రోజులలోపు పొందవచ్చు. పురుగు మందులు, ఎరువుల నాణ్యత నిర్ధారణ నివేదికను రెండు మూడు రోజుల్లోనే అందజేస్తారు. రైతులు కాకుండా వ్యాపారులు, డీలర్లు, తయారీదారులు, ఇతరులు





నాణ్యత ప్రమాణాల పరీక్ష నివేదిక కోసం ఎరువుల రకాన్ని బట్టి రూ. వెయ్యి నుంచి రూ.3 వేల వరకు చెల్లించాలి. పురుగు మందులకు సంబంధించి రూ.3,500 చెల్లించాలి. విత్తనాల నివేదిక కోసం రూ.200 చొప్పున చెల్లించాలి. రైతులకు మాత్రం పూర్తి ఉచితం. ప్రభుత్వమే ఈ వ్యయాన్ని భరించి రైతన్నకు తోడుగా నిలుస్తుంది.

## ప్రతి ల్యాబ్‌లో ఆటోమేషన్

నమూనాల పరీక్ష కోసం ప్రత్యేకంగా ఆటోమేటెడ్ క్వాలిటీ కంట్రోల్ యాప్ (ఇన్‌స్టెంట్) అభివృద్ధి చేశారు. ఫలితాలను తారుమారు చేసేందుకు వీల్లేని రీతిలో ప్రతి లేబరేటరీలో ఆటోమేషన్ ఏర్పాటు చేశారు. టెస్టింగ్ చేసిన ప్రతి ఒక్కటి రికార్డు కావడంతోపాటు ఫలితాలు వాటంతటవే సిస్టమ్‌లో నమోదవుతాయి. ఏ ల్యాబ్‌లో ఏ బ్యాచ్ శాంపిల్‌ను ఏ సమయంలో పరీక్షించారో నిర్ధారిస్తూ ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా ఈ టెక్నాలజీ నమోదు చేస్తుంది. రైతు షాపు కెళ్లినప్పుడు బ్యాచ్ నెంబర్ చెక్ చేసుకుంటే చాలు నాణ్యతా సర్టిఫికెట్ ఉందో లేదో తెలిసిపోతుంది. శాంపిల్స్‌కు టెస్టింగ్ జరిగిందో లేదో కూడా ట్రాక్ చేసుకోవచ్చు. జిల్లా ల్యాబ్‌లో గ్రో అవుట్ టెస్టింగ్ ఫెసిలిటీ కూడా కల్పిస్తున్నారు. ఇక్కడ మొక్కల జనటిక్ ప్యూరిటీ టెస్టింగ్ కూడా చేస్తారు. నాలుగు కేటగిరీల్లో సేకరించిన నమూనాలను పరీక్షిస్తారు. రైతులు తెచ్చే నమూనాలకు ఎలాంటి రుసుము వసూలు చేయరు. ల్యాబ్‌లో విధులు నిర్వహించే ఏవోలు, ఎంఏఓ, ఏడీలకు జాతీయ జాతీయ శిక్షణా సంస్థల ద్వారా అత్యాధునిక శిక్షణ ఇచ్చారు. ఇంటిగ్రేటెడ్ ల్యాబ్స్‌ను సమీప ఆర్బీకేలతో అనుసంధానిస్తున్నారు. ఇన్‌పుట్స్ పరీక్షించుకునేలా రైతులను ప్రోత్సహించేలా ఆర్బీకే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి

## 15న రైతుల ఖాతాల్లో రూ. 542.06 కోట్ల పెట్టుబడి రాయితీ సాయం






ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి తన మాట నిలబెట్టు కున్నారు. అధికారంలోకి వచ్చింది మొదలు తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికే కట్టుబడి ఉందని రుజువు చేస్తున్నారు. డా. వై.ఎస్.ఆర్. రైతు భరోసా-పీఎం కిసాన్ సాయం, సున్నా వడ్డీ పంట రుణాలు, ఉచిత పంటల బీమా, యంత్ర సేవా పథకం, అగ్రి ల్యాబ్స్ వంటి పథకాలు రైతులకు ఎంతగానో అండగా నిలుస్తున్నాయి. వీటన్నిటిని మించి ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు ఆ పంట సీజన్ ముగిసేలోగానే మళ్ళీ తర్వాతి పంటకాలానికి పెట్టుబడి అందేలా పెట్టుబడి రాయితీ అందించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే ఒరవడిని కొనసాగిస్తూ 2021నవంబరులో భారీవర్షాలు, వరదలకు, ఇసుక మేటలు కప్పేసిన భూములతో నష్టపోయిన రైతులకు ఫిబ్రవరి 15న ముఖ్యమంత్రి వర్యులు పెట్టుబడి రాయితీ సాయం అందిస్తున్నారు.

గత ఏడాది నవంబరులో భారీ వర్షాలు, వరదలకు పంటలు నష్టపోయిన రైతులకు 5,97,311 మంది రైతు ఖాతాలకు నేరుగా రూ. 542.06 కోట్ల పెట్టుబడి రాయితీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జమ చేస్తున్నారు. నాటి వరదలు, భారీ వర్షాలకు నష్టపోయిన పంటలు, ఉద్యాన పంటలపై వ్యవసాయ శాఖ యంత్రాంగం తక్షణం రంగంలోకి దిగి నష్టం అంచనాలు వేసింది. ఈ నష్టం అంచనాల జాబితాలను డిసెంబరులోనే ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించారు. రైతుల నుంచి అభ్యంతరాలు, తప్పుల సవరణకు, వినతులకు అవకాశం కల్పించారు. తర్వాత నష్టపోయిన రైతులు మళ్ళీ పంటలు వేసుకునేందుకు వీలుగా 80 శాతం సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేసింది. ఇప్పుడు రబీ పెట్టుబడి అవసరాలు తీర్చేందుకు ఈ పెట్టుబడి రాయితీ సొమ్మును నేరుగా రైతు ఖాతాల్లోనే జమ చేస్తోంది.

---

# దేవనూరు డీలక్స్ మిర్చి @ రూ. 20,000



దేవనూరు డీలక్స్ మిర్చి రకం మిర్చి ధర రూ. 20,000 మైలురాయి అందుకుంది. దీంతో పాటు 341 రకం మిర్చి రకానికి రూ19,500 వరకు ధర లభించింది. ఈ రెండు రకాల సరకు నాణ్యతగా ఉండటంతో మంచి ధర పలుకుతుందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. తేజ, బాడిగ రకాల మిర్చి కంటే కూడా 341, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి ధర అధికంగా ఉంది. 341 రకం మిర్చి ధర రూ.7,000 నుంచి రూ.19,500 ఉ ండగా, దేవనూరు డీలక్స్ రకాల మిర్చిని వినియోగిస్తుంటారు. మిర్చిని కారంగా తయారుచేసి ఎగుమతి చేసే సమయం కావడంతో ఈ రెండు రకాల మిర్చికి ధర పెరుగుతుందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. దేవనూరు డీలక్స్ రకం మిర్చిని కర్నూలు జిల్లా రైతులు ఎక్కువగా పండిస్తుంటారు. అక్కడి నుంచే ప్రస్తుతం యార్డుకు సరుకు ఎక్కువగా వస్తుంది. పలువురు రైతులు తీసుకువచ్చిన 1000 బస్తాలు నాణ్యతగా ఉండటంతో రూ.20,000 ధర లభించిందని యార్డు కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మిర్చిని బాగా ఆరబెట్టి తీసుకువస్తే ఇంకా మంచి ధర రైతులు పొందవచ్చని ఆయన వివరించారు. మార్చియార్డుకు ఫిబ్రవరి మొదటి వారంలో ఒక్క రోజే 87,867 మిర్చి బస్తాలు, వచ్చాయి. ఈ-నామ్ ద్వారా 86,466 బస్తాలు విక్రయాలు జరిగాయి. అమ్మకాలం ముగిసే సమయానికి యార్డులో 48,898 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఏసీ కామన్ వెరైటీ 334, నెంబర్ 5, 273, 4884 రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.18,000 ఉండగా, స్పెషల్ వెరైటీ తేజ రకానికి రూ.7,000 నుంచి రూ17,800, బాడిగ రూ.7,000 ఉంచి రూ.19,000, తాలు మిర్చికి రూ4,000 నుంచి రూ.9,500 ధర లభించింది. ఏసీ కామన్ వెరైటీ 334, 273, నెంబర్ 5, 341 రకాలు సగటు ధర రూ.7,000 మంచి రూ.18,500 ఉండగా, స్పెషల్ వెరైటీ తేజ రకానికి రూ.7,000 నుంచి రూ16,000, బాడిగ రూ.14,000 నుంచి రూ.17,700, తాలు మిర్చికి రూ.5,500 నుంచి రూ.9,500 ధర లభించింది.

**"చీడపీడలపై మీ సందేహాలను 8331056149 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."**

# ఆర్.బి.కె.లు నమ్మకానికి చిరునామాగా నిలవాలి

## సిబ్బందికి చీఫ్ కమీషనర్ శ్రీమతి పూనం మాలకొండయ్య దిశానిర్దేశం




రాష్ట్రంలో 10,778 రైతు భరోసా కేంద్రాల ద్వారా 15 వేల మందికి పైగా సిబ్బంది రైతులకు నేరుగా సేవలందిస్తున్నందుకు నా అభినందనలు. రైతు కోరినది ఏదైనా 48 గంటల్లోగా అందించగలిగే ఈ కేంద్రాలు రైతులకు దేవాలయాల్లాంటివి. వాటిపై వారి నమ్మకాన్ని మరింతగా పెంచండి. పెట్టుబడి ఖర్చులు తగ్గి, మేలైన దిగుబడులు పొంది రైతుకు ఆదాయం రెట్టింపు కావాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గారి లక్ష్యం. ఆ లక్ష్యానికి అనుగుణంగా మనమందరం పనిచేయాలి. నాలుగు ముఖ్యమైన సేవలు అందించేందుకు ఉద్దేశించిన డా. వై.ఎస్.ఆర్. రైతు భరోసా కేంద్రాలు. అందులో మొదటిది. నాణ్యమైన, ధృవీకరించిన విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయడం. రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీల ఎరువులు మాత్రమే పంపిణీ చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేని ఉపకరణాలు విక్రయించడానికి వీల్లేదు. పదిహేనురోజుల ముందుగా ఎరువులకు ఇండెంట్ పెట్టాలి. ఏ.పీ. ఆగ్రోస్ అనుమతించిన పురుగు మందులు మాత్రమే నిర్ణీత ధరలకు రైతులకు విక్రయించాలి. యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులు, జిప్సం, జింకు లాంటి వన్నీ రైతులకు అందుబాటులో ఉంచాలి. మీకు కియోస్క్‌లో కనిపించిన విత్తనాలనే ఆర్డరు ఇవ్వాలి. వాటి ధరలు కూడా అందులో కనిపిస్తాయి. అన్నిటికి సకాలంలో ఇండెంట్ ఇవ్వడం వల్ల అన్ని వెంటనే అందుబాటులోకి వస్తాయి. ఎం.ఏ.ఓ. ఈ ఇండెంట్‌ను పరిశీలించి పంపాలి. నెలకోసారయినా ఎం.ఏ.ఓ. ఆర్బీకేను సందర్శించాలి. ఏడీఏలు, జేడీఏలు, ఆకస్మిక తనిఖీలు చేయాలి. దీనివల్ల పారదర్శక సేవలకు అవకాశం కలుగుతుంది. మన ఆర్బీకేలు నాణ్యతకు చిరునామాగా నిలవాలి.

**రెండో ముఖ్య విషయం :** పొలం దుక్కుల నుంచి దిగుబడి వచ్చే వరకూ మనం రైతులకు వెన్నుదన్నుగా నిలవాలి. ఇందుకు విస్తరణ సేవలు, ఇందులో ముఖ్యమైనది పొలంబడి కార్యక్రమం. వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన అంశాలనే శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు బోధించాలి. పురుగు మందులు, ఎరువుల వాడకం గురించి అవగాహన కల్పించాలి. పంటలు, వాతావరణ పరిస్థితులు, నేలలు వారీగా ఆయా సాంకేతిక అంశాల విశ్లేషణ జరగాలి. ఏడీఏలు, ఎంఏఓలతో కలిసి దీనిమీద విస్తృత ప్రణాళిక రూపొందించాలి. రైతులకు ఏది అవసరమో అది వీఏఏలు గుర్తించాలి. వారు దాని గురించి ముందు పూర్తిగా తెలుసుకోవాలి. అందువల్ల శాస్త్రవేత్తల సలహాల మేరకు ఒక శిక్షణ ప్రణాళికను రూపొందించాలి. అప్పుడే మనం రైతుల అవసరాలు తీర్చగలుగుతాం. వ్యవసాయ పరిశోధనా స్థానాలతో ఆర్బీకేలు అనుసంధానం కావాలి. వ్యవసాయ కమీషనర్, జేడీఏలు ఈ అంశం మీద చొరవ చూపాలి. దీనివల్ల వీఏఏలు సాంకేతికంగా పూర్తి సుశిక్షితులవుతారు. విజ్ఞాన మార్పిడి తేలికవుతుంది. అన్నిటి లక్ష్యం ఒక్కటే పెట్టుబడి వ్యయం గణనీయంగా తగ్గాలి. నీటి యాజమాన్యం, వనరుల సద్వినియోగంతోనే నాణ్యమైన దిగుబడి సాధ్యమవుతుంది.

మనం విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలి. వాతావరణ మార్పులకనుగుణంగా వస్తున్న తెగుళ్ళు, పురుగుమందులు గురించి తెలుసుకోవాలి. వీఏఏలు తమ అనుభవాలను ఎప్పటికప్పుడు పంచుకోవడం వల్ల కొత్త విషయాలు తెలుస్తాయి. ల్యాబ్ టు ల్యాండ్ అనేది అప్పుడే నిజమవుతుంది. ఆదర్శ అనుభవజ్ఞులైన రైతుల అభిప్రాయాలు తెలుసుకుని, గుర్తించి వారందర్ని ఒక బృందంగా ఏర్పరచడం వల్ల వారందరి అనుభవాలు రాష్ట్రంలో అందరికీ ఉపయోగపడతాయి.

**మూడోది అతి ముఖ్యమైనది మార్కెటింగ్ :** పంట దిగుబడి అమ్ముకోవడం కూడా రైతుకు అంతే అవసరం. అదీ మద్దతు ధర లభించాలి. ధాన్యం సేకరణ ఇప్పటికే మనం చేశాం. ఇందులో ముఖ్యమైనది ఈ-క్రాప్. రైతు పండించిన పంటనే ఈ-క్రాప్ నమోదు చేయాలి. స్థానికంగా ఎదురయ్యే ఎటువంటి ఒత్తిళ్ళకు తలొగ్గకూడదు. ఒత్తిళ్ళకు లోనయి తప్పులు చేయవద్దు. దీనికి మీరే బాధ్యులవుతారు. ఇబ్బందులను మా దృష్టికి తీసుకురండి.

కాల్ సెంటర్ అనేది అత్యంత కీలకం. రైతుల అభిప్రాయాలు, మీ ఇబ్బందులు ఇక్కడికి నేరుగా తెలియజేయవచ్చు. కాల్ సెంటర్ గురించి విస్తృత ప్రచారం చేయాలి. వాతావరణ పరిశోధన కేంద్రాలు కూడా అనుసంధానం చేయబోతున్నాం. దీనివల్ల ఎప్పటికప్పుడు రైతులకు తాజా సమాచారం అందించవచ్చు. బ్యాంకింగ్ సేవలు మరింత విస్తృతం కావాలి. ఐ.ఎస్.ఓ.లు పొందిన ఆర్.బి.కె.లకు అభినందనలు.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# అపరాలు, చిరుధాన్యాలు, నూనెగింజల సాగుకు బృహత్ ప్రణాళిక

రాష్ట్రంలో ప్రస్తుత వేసవిలో అసరాలు, చిరుధాన్యాల విస్తృత సాగుకు ప్రభుత్వం బృహత్తర ప్రణాళిక సిద్ధం చేసింది. జాతీయ ఆహార భద్రతా పథకం, నూనె గింజల అభివృద్ధి పథకం కింద అపరాలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించనుంది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో లక్ష హెక్టార్లకు పైబడి అపరాలు, చిరుధాన్యాలు దాదాపు 50 వేల హెక్టార్లలో నూనె గింజల సాగు చేయనున్నారు. 20 హెక్టార్ల వంతున 50 వేల క్లస్టర్లలో అపరాలు, చిరుధాన్యాల ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రైతులకు 50 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయనుంది. అపరాలు, చిరుధాన్యాలు, నూనె గింజల సాగు చేపట్టనున్నారు. దీనిపై రైతులకు రైతు భరోసా కేంద్రాల స్థాయిలో విస్తృత అవగాహన కల్పించనున్నారు. ఆసక్తి గల రైతులతో బృందాలు ఏర్పాటు చేసి ఈ ప్రదర్శనా క్షేత్రాలు ఏర్పాటు చేయడానికి వ్యవసాయ శాఖ ఇప్పటికే ఆయా జిల్లాల సంయుక్త వ్యవసాయ సంచాలకులకు మార్గదర్శకాలు జారీ చేసింది. పెసలు, మినుములు, సజ్జ, రాగి, జొన్న, ఇతర చిరుధాన్యాల, నూనె గింజలు సాగుకు రైతులను సంసిద్ధులను చేయనున్నారు.

### 2022 వేసవిలో జిల్లాల వారీగా అపరాలు, చిరుధాన్యాలు, నూనె గింజల సాగు లక్ష్యం (హెక్టార్లలో)

| వ. నెం. | జిల్లాలు | పెసలు | మినుములు | మొక్కజొన్న | జొన్న | సజ్జ | రాగులు | ఇతర చిరుధాన్యాలు | వేరుశనగ | నువ్వులు | పొద్దు తిరుగుడు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | శ్రీకాకుళం | 18000 | 0 | 4500 | 0 | 0 | 500 | 900 | 7250 | 2252 | 200 |
| 2 | విజయనగరం | 10000 | 454 | 4000 | 0 | 0 | 100 | 800 | 4000 | 5016 | 0 |
| 3 | విశాఖపట్నం | 3900 | 138 | 200 | 0 | 600 | 1050 | 2500 | 3000 | 1274 | 200 |
| 4 | తూర్పు గోదావరి | 26000 | 3025 | 1900 | 100 | 0 | 0 | 200 | 500 | 0 | 0 |
| 5 | పశ్చిమ గోదావరి | 19000 | 905 | 9600 | 0 | 0 | 0 | 300 | 500 | 0 | 0 |
| 6 | కృష్ణా | 6000 | 200 | 4500 | 200 | 0 | 0 | 200 | 500 | 75 | 0 |
| 7 | గుంటూరు | 12000 | 3000 | 8000 | 1500 | 20 | 700 | 600 | 1000 | 165 | 0 |
| 8 | ప్రకాశం | 2000 | 370 | 2400 | 500 | 250 | 500 | 3200 | 1000 | 520 | 0 |
| 9 | నెల్లూరు | 2000 | 300 | 100 | 0 | 60 | 0 | 300 | 2500 | 0 | 0 |
| 10 | చిత్తూరు | 300 | 0 | 200 | 0 | 0 | 100 | 200 | 2500 | 0 | 500 |
| 11 | కడప | 300 | 0 | 500 | 500 | 1500 | 50 | 500 | 3000 | 115 | 800 |
| 12 | అనంతపురం | 100 | 0 | 1500 | 300 | 0 | 0 | 400 | 7250 | 0 | 700 |
| 13 | కర్నూలు | 400 | 0 | 2600 | 2900 | 570 | 0 | 1900 | 3000 | 0 | 600 |
| | మొత్తం | 1,00,000 | 8,392 | 40,000 | 6,000 | 3,000 | 3,000 | 12,000 | 36000 | 9417 | 3000 |





"చీడపీడలపై మీ సందేహాలను 8331056150 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# మరింత సులభంగా ఈ-క్రాప్ నమోదు



రబీ పంట కాలానికి ఈ-క్రాప్ నమోదు సత్వరం పూర్తి కావాలని వ్యవసాయ శాఖ కమీషనర్ హెచ్. అరుణ్‌కుమార్ సూచించారు. రబీ ఈ-క్రాప్ నమోదు అంశంపై ఆర్.బి.కె. ఛానల్ నుంచి ఆయన వి.ఎ.ఎ.లతో మాట్లాడారు. వివరాలు, ఖరీఫ్ పంట కాలంలో ఎదురైన ఇబ్బందులను గుర్తించి సవరించాం. ముఖ్యంగా ధాన్యం కొనుగోలు సమయంలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ధాన్యం కొన్నిచోట్ల గ్రామాలు మ్యాపింగ్ కాలేదని మా దృష్టికి తెచ్చింది. పంట, గ్రామం, రైతు వివరాల నమోదులో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించడానికి ఇటీవల రెవెన్యూ, పౌర సరఫరాల శాఖతో సమావేశమయ్యాం. వివిధ అంశాల మీద చర్చ జరిగిన అనంతరం వెబ్‌ల్యాండ్ వివరాల ఆధారంగా ఈ-క్రాప్ నమోదుకు అవకాశం కల్పించారు. ఖరీఫ్‌తో పోలిస్తే రబీలో సాగు విస్తీర్ణం తక్కువ కాబట్టి వెబ్ ల్యాండ్ వివరాల ఆధారంగా ఈ-క్రాప్ నమోదు చేయడం పెద్ద కష్టం కాబోదు. వి.ఎ.ఎ.లందరికీ వెబ్‌ల్యాండ్ వివరాలు కనిపిస్తాయి. ఆ భూమి సర్వే నెంబరు, ఖాతా నెంబర్ల ఆధారంగా ఈ-క్రాప్ నమోదు చేయడం తేలికవుతుంది. కాబట్టి ఈ పని సత్వరం పూర్తి చేయాలి. అందులో ముఖ్యంగా నెల్లూరు, చిత్తూరు, జిల్లాల్లోని తూర్పు ప్రాంతాల్లో రబీ పంటకాలం ముందుగా పూర్తయింది. అందువల్ల అక్కడ ముందుగా ఈ పని చేపట్టాలి. అది కూడా విత్తిన తేదిని మాత్రమే నమోదు చేయాలి. దీనివల్ల పంట కోతల సమయానికి ఆటంకాలు ఉండవు. మనం ఇప్పుడు ఈ-క్రాప్ చేస్తున్నాం కాబట్టి ఇప్పటి తేదీ నమోదు చేయరాదు. ఆ రెండు జిల్లాల్లో ముందుగా ఈ-క్రాప్ నమోదు పూర్తి కావాలి. ఇందులో ఏ రకం పంట అనే విషయం స్పష్టంగా పేర్కొనాలి. ఖరీఫ్‌లో కొన్ని జిల్లాల్లో ఇలాంటి తప్పులు జరిగాయి. మేం వంగడం రకం తప్పుగా నమోదు చేశాం. ఇప్పుడు మార్చడానికి అవకాశం ఉంటుందా అని అడుగుతున్నారు. ఇది ఎంతమాత్రం సాధ్యంకాదు. అందుకని ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. వెబ్‌ల్యాండ్ వివరాలతో అనుసంధానం అయ్యాం. కాబట్టి ఇక ఇబ్బందులు ఉండవు.

అలాగే మరో ముఖ్య విషయం రాష్ట్రంలో 750 గ్రామాలు ఏ రైతు భరోసా కేంద్రంతోనూ అనుసంధానం కాలేదు. ఆ రెవెన్యూ గ్రామం ఏ ఆర్బీకే, ఏ జిల్లా, ఏ మండలం, అనే వివరాలు సత్వరం పంపాలి. మీరందరూ వివరాలు పంపితే పూర్తి సమాచారం ఆర్బీకేతో అనుసంధానం చేస్తే ఆ వివరాలన్నీ మీకు కనిపిస్తాయి. ఇది తక్షణం జరగాల్సిన పని. జిల్లాల వారీగా రైతులు పండిస్తున్న వంగడాల వివరాలన్నీ మీకు కనిపిస్తాయి. దీంట్లో ఆందోళన చెందాల్సిన పనిలేదు. రబీలో ముందుగా ఈ-క్రాప్ నమోదు చేసిన వారి వివరాలు ప్రత్యేకంగా ఉంచాం.వి.ఎ.ఎ. లాగిన్‌లో ఇవి కనిపిస్తాయి. వీటిని వెబ్‌ల్యాండ్ వివరాలతో సరిపోల్చుకోవాలి. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకూడదు. 130 అర్బన్ ఆర్బీకేలు మ్యాపింగ్ కూడా జరగాలి.

ఉద్యాన పంటల్లో మామిడి, కమల, కోకో, ఆయిల్‌పామ్ వంటి వాటి నమోదు విషయంలో గతంలో విత్తు తేది ఉండేది దాన్ని ఆయా చెట్ల వయస్సుగా మార్చాం. ఆ మార్పును గమనించి ఆ విధంగా నమోదు చేయాలి.

వాస్తవ సాగుదారుల నమోదు అనేది చాలా కీలకం. క్షేత్ర పరిశీలనతోనే ఇది సాధ్యమవుతుంది. వి.ఎ.ఎ.లు తమ పరిధిలో గ్రామాల మీద పూర్తి అవగాహన ఉంటేనే ఇది వీలవుతుంది. గ్రామ పరిధిలో ఉన్న వెయ్యి ఎకరాలను పూర్తిగా క్షేత్ర పరిశీలన చేస్తామనే ఉద్దేశంతోనే మనకు ఈ అవకాశం కల్పించారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. దీనివల్ల మీకే ఎంతో ప్రయోజనం. గ్రామం మీద పూర్తి అవగాహనతో ఉంటే మీకు ఎంతో గౌరవం, గుర్తింపు లభిస్తాయి. పది లక్షల మంది వాస్తవ సాగుదారులుండగా 30 శాతం మాత్రమే నమోదయ్యారు. అసలు సాగుదారులను ఈ-క్రాప్‌లోకి తీసుకురావాలంటే క్షేత్ర పరిశీలనతోనే వీలవుతుంది. కౌలుదారుని గుర్తించడం కూడా తేలికే. అతని గురించి ఇరుగు పొరుగు రైతులతో మాట్లాడితే వాస్తవాలు తెలుస్తాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వాస్తవ సాగుదారులకు దక్కాలంటే రబీలో వాస్తవ సాగుదారుల సంఖ్య పెరగాలి. యజమాని పేరు రాయడానికి ఒత్తిళ్ళు, క్షేత్ర పరిశీలన చేయక పోవడమే కారణం. వీటిని అధిగమించాలి. వాస్తవ సాగుదారుల జాబితాను గ్రామ పెద్దలకు చూపించి, ఆర్బీకేలో ప్రదర్శించాలి. దీనివల్ల ఎటువంటి అభ్యంతరాలు, ఇబ్బందులు ఎదురు కావు.

**పగడ్బందీగా పంటల నమోదు :** సాంకేతిక లోపాలతో కొనుగోలు సందర్భంలో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదన్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చర్యలు చేపట్టింది. ఎలాంటి లోపాలకు ఆస్కారంలేని రీతిలో ఆధునీకరించిన యాప్ ద్వారా పంటల నమోదు పగడ్బందీగా చేపడుతున్నారు.

-కురసాల కన్నబాబు, వ్యవసాయశాఖా మంత్రి

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

# అవగాహనతో ఎరువుల వాడకం.. అప్పుడే పంటకు సత్ఫలితం



ఆధునిక వ్యవసాయ రంగంలో ఆశించిన దిగుబడులు సాధించడానికి ఎరువులు కీలకమైన పాత్రను పోషిస్తున్నాయి. వీటి వినియోగం గురించి సరైన అవగాహన ఉన్నప్పుడే ఎరువుల నుండి పూర్తి ఫలితం పొందగలం. అవసరమైన మేరకే ఎరువులను వేయడం, వేసిన ఎరువులు సమర్థవంతంగా మొక్క తీసుకునేటట్లు చేయడం ద్వారా ఎరువు ఖర్చు తగ్గించుకోవచ్చు. రసాయన ఎరువుల వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. రైతులు నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను అవసరమైన దాని కన్నా రెండు నుండి రెండున్నర రెట్లు అధికంగా వాడుతున్నారు. తద్వారా అవసరం లేని పోషకాన్ని వేసి వృథా చేయడం వలన ఖర్చు పెరగడం పోషకాల సమతుల్యత లోపించడం, దిగుబడి తగ్గడం నేల ఆరోగ్యం క్షీణించడం జరుగుతూనే ఉంటుంది.

ఎరువుల సమర్ధ వినియోగం నేల స్వభావం, వాతావరణం, పంటల సరళి, పంటల రకాలు , పంట కాలం మొదలగు విషయాలు పై ఆధారపడి ఉంటుంది. ఎరువుల వినియోగ సామర్థ్యాన్ని పెంచాలంటే ఎరువులు ఎంత వేయాలన్నది ఎంత ముఖ్యమో అది వేయాల్సిన పద్ధతి కూడా అంతే ముఖ్యం. సరైన పద్ధతిలో ఎరువులు వేసినప్పుడు మొక్కలు పోషకాలను సమర్థవంతంగా ఉపయోగించుకుంటాయి.

**పాటించవలసిన మెళకువలు :**

- యూరియా, అమ్మోనియం సల్ఫేట్, కాల్షియం అమ్మోనియం నైట్రేట్ ఎరువులలో ఉన్న ముఖ్య పోషకం నత్రజని అయినప్పటికీ అది రసాయనికంగా వివిధ రూపాల్లో ఉంటుంది. ఎరువుల లక్షణాలు కూడా వేర్వేరుగా ఉన్నాయి.
- ఇసుక పాలు తక్కువ ఉన్న మాగాణి భూముల్లో తప్ప మిగతా ఉన్న అన్ని నేలలకు పైపాటుగా యూరియా వేసుకోవచ్చు.
- అమ్మోనియం సల్ఫేటును క్షార గుణం నేలలకు, సున్నపు పాలు ఎక్కువగా ఉన్న నేలలకు ఎప్పుడైనా చేసుకోవచ్చు.ఆమ్ల భూములకు సల్ఫైడ్ ఇంజురీ వచ్చే భూములకు చేయరాదు.
- కాల్షియం అమ్మోనియం నైట్రేట్ అన్ని భూములకు ఎప్పుడైనా వేసుకోవచ్చు.
- కానీ వరిలో చిరుపొట్ట దశలో మాత్రమే వేసుకోవాలి. కానీ ఆఖరి దమ్ములో పైరు అడుగులోను, మొదటి సారి పైపాటు సమయాల్లో వేస్తే అందులోని నైట్రేట్ నత్రజని వృథా అవుతుంది,
- సూపర్ ఫాస్ఫేట్ ను సాధారణంగా అన్ని పైర్లకు సామాన్య నేలలకు చేయవచ్చు.ఆమ్ల గుణం గల నేలలకు సల్ఫైడ్ ఇంజురీ వచ్చే నేలలకు వేయరాదు. ఆమ్ల గుణం గల నేలలకు డై కాల్షియం ఫాస్ఫేట్, రాక్ ఫాస్ఫేట్ వంటి పనికి వస్తాయి. అయితే ఇది క్షారగుణం గల నేలలకు, సాధారణ పైర్లకు ఉపయోగపడవు.
- ఫలవృక్షాలు, తోట వృక్షాలు వంటి బహువార్షికాలను వాడవచ్చు. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను పాలచౌడు తప్ప మిగిలిన అన్ని నేలలకు వాడవచ్చు. పొగాకు పైరుకు వేయరాదు. నాణ్యత తగ్గిపోతుంది.సల్ఫేట్ ఆఫ్ పొటాష్ అన్ని నేలలకు అన్ని పైర్లకు వాడవచ్చు.
- ఈ మెళకువలు పాటించి ఎరువులను ఎంపిక చేసుకోవడం వల్ల పేరుకు పోషకాలు సమర్థవంతంగా ఉపయోగపడతాయి.
- ఎరువులను ఎప్పుడు ఎన్ని సార్లు విభజించి చేయాలి : మొక్కలకు వేసిన పోషకాలు ఉపయోగపడే సామర్థ్యం పెంచడంలో సరైన సమయం, అవసరమైనన్ని సార్లు విభజించి వేయడం అత్యంత ప్రభావాన్ని చూపుతాయి.
- ప్రాంతాన్ని బట్టి ఎరువును బాగా వినియోగించుకునే రకాలను, హైబ్రీడ్లను ఎంచుకోవాలి.
- సరైన సమయంలో విత్తాలి, మొక్కల సాంద్రత తగ్గకుండా చూడాలి.
- సేంద్రియ, జీవన ఎరువులను విరివిగా వాడి తర్వాత పంట పెరుగుదలకు కావాల్సిన పోషకాలతో పాటు నేల స్థితి ఏర్పరచాలి.
- పప్పుజాతి పైర్లను పంటల సరళిలో చేర్చడం మొక్క కీలక దశల్లో తప్పనిసరిగా నీటి తడులు ఇవ్వడం

**యూరియా ఎక్కువ వాడితే ధాన్యపు పైరుల్లో తాలు గింజలు ఎక్కువగా వస్తాయి.**

"చీడపీడలపై మీ సందేహాలను 8331056152 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

- భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వేసుకున్నట్లయితే పోషకాల లోపాలు లేదా అధిక పోషకాల వినియోగాన్ని తగ్గించవచ్చు.
- నీటి ఎద్దడి ఉన్న సమయంలో పైపాటుగా 2 శాతం యూరియా గ్రామాలకాన్ని పిచికారీ చేయాలి. సూక్ష్మ పోషకాల లోపాలు నివారించాలి. సమస్యాత్మక నేలను బాగు చేసే కారకాలు ఉపయోగించాలి.

**నత్రజని వినియోగ సామర్థ్యం పెంచాలంటే?**

- పలు దఫాలుగా విభజించి వేయాలి.
- మెల్లగా లభ్యస్థితిలోకి వచ్చే నత్రజని ఎరువులైన వేపపూత లేదా గంధకం పూత పూయబడిన యూరియా వాడాలి.
- సేంద్రియ, రసాయన ఎరువులను మిళితం చేసి వాడాలి.

**భాస్వరం:**

- నేలలో స్థిరీకరించబడే భాస్వరం ఎరువును తగ్గించడంతో పాటు సమతుల్యత పాటించాలి.
- సేంద్రియ ఎరువుల వాడకం, మొక్క దగ్గర ఎరువు చేయడం
- భాస్వరాన్ని కరగదీసే బ్యాక్టీ , ఫాస్ఫోబ్యాక్టీరియా లాంటివి విత్తనానికి పట్టించి వేయాలి.
- భాస్వరాన్ని గ్రహించి విఎఎం లాంటివి వాడటం

**పొటాషియం:**

- తేలిక నేలల్లో పలు దఫాలుగా విభజించి వేయాలి.
- సేంద్రియ ఎరువులు వాడాలి.
- ఎరువులు, పోషకాల సమతుల్యత పాటించాలి.

**జింకు:**

- జింకును భాస్వరం ఎరువులతో కలిపి వేయరాదు.

ఎరువులు అధికముగా వాడటం వలన ఎరువులు ఖర్చులు పెరిగి దిగుబడులు తగ్గుతాయి. కాబట్టి భూసార పరీక్ష ననుసరించి సమతుల్య ఎరువులు వాడకం తో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చు. సమతుల్య ఎరువులు వాడకం వలన చీడ పీడలు కూడా తగ్గి గింజ నాణ్యత పెరిగి రైతుకు మంచి ఆదాయం వస్తుంది. రసాయన ఎరువులు తో పాటు పచ్చిరొట్ట పైరులు వంటి జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పంటలు పండించి భూమిలో కలియదున్నితే భూసారం పెరగడమే కాకుండా రసాయన ఎరువులు వాడకం తగ్గి నేల ఆరోగ్యంగా ఉండి రైతుకు నాణ్యమైన పంట చేతికి వస్తుంది. వీటితో పాటు పశువుల పెంట, జీవన ఎరువులు కూడా వాడి సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటిస్తే నేల ఆరోగ్యం పెరగటమే కాకుండా మనుష్యులు మరియు జంతువులూ ఆరోగ్యం కూడా బాగుండటమే కాకుండా వాతావరణ కాలుష్యం కూడా తగ్గుతుంది. దీనివలన తక్కువ పెట్టుబడితో రైతులు మంచి ఆదాయం పొందవచ్చు.

## యూరియా పరిమిత వాడకం పైరుకు లాభదాయకం

వ్యవసాయ సాంద్రత ఎక్కువగా ఉన్న తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో ఎరువుల మోతాదు సిఫారసుకు మించి వాడుతున్నారు. ముఖ్యముగా యూరియా ఎక్కువగా వాడడము జరుగుతుంది. దీనికి కారణం ఎక్కువ మంది కౌలు రైతులు కావడం మరియు కొందరికి ఎక్కువగా యూరియా వాడితే భూమి చెడిపోతుంది అనే అవగాహన లేకపోవడం యూరియా దర మిగిలిన డిఎపి, కాంప్లెక్స్ ఎరువుల కన్న తక్కువగా ఉండడము వలన అవసరానికి మించి కొని, దాచుకొని వాడుకుంటున్నారు. ఈ యూరియా అధికంగా వాడడము వలన మొక్కలు మెతకబారి చీడపీడల బారిన పడతాయి. ధాన్యంలో నత్రజని అవశేషాలు చేరి, తిన్న వారికి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఒక పోషకము గల ఎరువు అత్యధిక మోతాదులో అవసరానికి మించి వాడినప్పుడు, భూమిలో వివిధ పోషకాల రసాయన సమతాస్థితిని కోల్పోయి, మిగిలిన అత్యంత అవసరమైన పోషకాల లభ్యత పంట కోల్పోతుంది.

ఈ జిల్లాల్లో తక్కువ కాలపరిమితి గల సన్న వరి రకాలను పండిస్తున్నారు. వరిలో అవసరానికి మించి, యూరియా తక్కువ ధర కావడం వలన వాడుతున్నారు. ఈ విధంగా వరిలోనే గాక మొక్కజొన్నలో మరియు వాణిజ్య పంట అయిన పొగాకులో అవసరానికి మించి 2 నుండి 3 రెట్లు వాడడం జరుగుతుంది.

ఈ విధంగా అవసరానికి మించి, అధిక ఎరువును వాడడం అరికట్టడానికి వ్యశాయ శాఖ సరైన సమయంలో అప్రమత్తమై ఆర్.బి.కె.ల ద్వారా వ్యవసాయ శాఖ సిబ్బందిచే రైతులకు ఎక్కువ ఎరువులు అవసానికి మించి వాడడంలోని అనర్థాలపై అవగాహన కల్పిస్తుంది. అనగా సాగు ఖర్చు పెరగడం, భూభౌతిక రసాయన స్థితిలో మార్పు చెందడం, నత్రజని అవశేషాలు పండించే పంటలలో ఉండిపోయి, అవి తిన్న మానవాళికి ఆరోగ్య సమస్యలు తలెత్తడం, భూగర్భజలాలు, పర్యావరణాలు కలుషితం కాడం, విత్త పురుగలకు కలిగే హాని తెలుసుకోవాలి.

కనుక రైతు సోదరులు ముఖ్యంగా అవసరానికి మించి ఎక్కువ ఎరువులు వాడకూడదు. ఒక ఎరువు పోషకం కలిగిన మిగతా పోషకాలు కలిగిన ఎరువులతో పోలిస్తే ధర తక్కువగా ఉందని వాడకూడదు. మొక్కకు కావలసిన అన్ని పోషకాలు, సమతుల్య స్థితిలో భూమిలో ఉన్నప్పుడు మాత్రమే పంట మొక్కలు దృఢంగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయి.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

సాంకేతిక సమాచారం

# ఆంధ్రప్రదేశ్‌లో ఆయిల్ పామ్ సాగు ఆర్థికంగా బాగు






ఆయిల్‌పామ్ అత్యధికంగా వంటనూనెను అందించే వృక్షజాతి పంట. ఇది నాటిన మూడవ సంవత్సరం నుండి దిగుబడిని ప్రారంభిస్తుంది. అందుకే మొదటి మూడు సంవత్సరాలలో రైతులు ఆదాయ ఉత్పత్తి కోసం అంతర పంటలను పెంచుతారు. 2019-20 వ సంవత్సరంలో, భారతదేశం 2.55 లక్షల టన్నుల ముడి పామాయిల్ ఉత్పత్తి చేయగా, ఇందులో ఆంధ్రప్రదేశ్ 81.8% (2.08 లక్షల టన్నులు), తెలంగాణ 14.9% (0.38 లక్షల టన్నులు) అందించాయి. 2020-21లో 1.79 లక్షల హెక్టార్ల ఆయిల్‌పామ్ సాగు ఆంధ్రప్రదేశ్‌లోని 8 జిల్లాల పరిధిలో ఉంది. తూర్పుగోదావరి, కృష్ణా, నెల్లూరు, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, పశ్చిమ గోదావరి, అనంతపురం జిల్లాలలో ఆయిల్‌పామ్ ప్రస్తుతం సాగుచేస్తున్నారు.

భారతదేశంలో వంటనూనెల తలసరి వినియోగం 2015-16 లో సంవత్సరానికి 10 కిలోల నుండి 2019-20 లో 19 కిలోలకు పెరిగింది. ఈ నేపథ్యంలో, భారతదేశం దిగుమతులపై ఎక్కువగా ఆధారపడుతోంది మరియు వంటనూనె అవసరాలను తీర్చడానికి ఆయిల్‌పామ్ గణనీయమైన పాత్ర పోషిస్తుంది (13.34 మిలియన్ టన్నుల వంట నూనె దిగుమతిలో, 55.42% పామాయిల్ ద్వారా అందించబడుతుంది). 2019-20 సంవత్సరానికి, పామ్‌ఆయిల్ వినియోగం భారతదేశంలో మొత్తం వంట నూనె వినియోగంలో 33% వాటాగా ఉంది. అమెరికా మరియు పాశ్చాత్య దేశాలలో వినియోగానికి పత్తి మరియు సోయా నూనెలు విస్తృతంగా ఉపయోగించ బడుతున్నప్పటికీ, ఆసియా ఉప ఖండంలో వాటి వినియోగం తులనాత్మకంగా తక్కువగా ఉంది. ప్రస్తుతం, పత్తి మరియు సోయా నూనెలు జన్యువరంగా నవరించిన విత్తనం నుండి వెలికితీయబడుతున్నాయి. ఆరోగ్యంపై ఈనూనెలప్రతికూల ప్రభావాలు శాస్త్రీయంగా రుజువు కానప్పటికీ వినియోగదారులు వీటి కొనుగోలుపై ఆసక్తి కనుబరుచుటలేదు. కావున భారత దేశంలోఉత్పత్తిఅవుతున్నపత్తి, సోయానూనెలను, కాస్మెటిక్ తయారీ వంటి రంగాలకు మార్చవచ్చు మరియు దీనిద్వారా ఏర్పడిన అంతరాన్ని పామాయిల్ ఉత్పత్తితో పూరించవచ్చు. వంట నూనెల దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించడానికి ప్రభుత్వం కొన్నిచర్యలు తీసుకుంది. 1999-2000 లో ఆయిల్‌పామ్ డెవలప్‌మెంట్ గ్రామ్ (OPDP), 2004-05లో ఆయిల్ సీడ్స్, పప్పులు, ఆయిల్‌పామ్ మరియు మొక్కజొన్న ఇంటిగ్రేటెడ్ స్కీమ్ (ISOPOM), తర్వాత 2014-15 లో, నేషనల్ మిషన్ ఆన్ ఆయిల్ సీడ్ అండ్ ఆయిల్‌పామ్ (NMOOP) క్రింద మినీమిషన్- II ప్రకటించబడ్డాయి. ఏప్రిల్ 2021 లో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం AP ఆయిల్ ఫెడరేషన్‌తో కలిసి ఆయిల్‌పామ్ టన్నుకు రూ. 16,500 ధరగా ప్రకటించారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణంలో 2025-26 నాటికి 10 లక్షల హెక్టార్ల క్రింద 11 లక్షల టన్నుల ఉత్పత్తి చేయాలని మరియు 2029-30 నాటికి 28 లక్షల టన్నుల వరకు సాధించాలనే లక్ష్యంతో, ముఖ్యంగా ఉత్తర ప్రాంతం మరియు అండమాన్ మరియు నికోబార్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలనే ఆలోచనతో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్‌పామ్ (NMEO-OP)ను ప్రతిష్టాత్మకంగా ప్రకటించింది.

కోవిడ్ -19 ప్రభావంతో సరఫరా అంతరాయాల కారణంగా

"చీడపీడలపై మీ సందేహాలను 8331056153 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

దిగుమతులను తగ్గించడంతో పాటుగా వంటనూనెకు డిమాండ్ ఏర్పడటం వలన వంటనూనెల మార్కెట్ ధరలు భారీగా పెరిగాయి. పామాయిల్ ధర 2019 జనవరిలో కిలోకు రూ.70 నుండి జూన్‌లో రూ.131 మరియు జులై రూ.125 కు పెరిగింది. వంట నూనెల ధరలను తగ్గించడానికి, ముడిపామ్‌ఆయిల్ (CPO) పై సుంకం 30 జూన్ 2021న మునుపటి 35.75 శాతంనుండి 30.25 శాతానికి మరియు శుద్ధిచేసిన పామాయిల్ 49.5 శాతం నుండి 41.25 శాతానికి తగ్గించబడింది. తరువాత 12 సెప్టెంబర్ 2021న, కేంద్ర ప్రభుత్వం 30 సెప్టెంబర్ 2021 వరకు ముడి మరియు శుద్ధిచేసిన నూనెలపై 5.5 శాతం దిగుమతి సుంకాన్ని తగ్గించింది. మరల, శుద్ధిచేసిన తినదగిన నూనెలపై దిగుమతి సుంకం 41.25 శాతం నుండి 35.75 శాతానికి తగ్గించబడింది.

పైన తెలిపిన అంశాల దృష్ట్యా, ఆంధ్రప్రదేశ్‌లో ఆయిల్‌పామ్ సాగుకు సంబంధిత ఆర్థిక సాధ్యాసాధ్యాలను పరిశీలించే లక్ష్యంతో ప్రస్తుత అధ్యయనం చేపట్టబడింది. ఆంధ్రప్రదేశ్‌లో 15 సంవత్సరాలకన్నా ఎక్కువ కాలంగా సాగుచేపట్టిన 60 మంది రైతుల నుండి సేకరించిన ప్రాథమిక సమాచారాన్ని, వ్యవసాయ ఖర్చులు మరియు ధరల కమిషన్ (CACP) ఇచ్చిన వ్యయ సూత్రాలు ఉపయోగించి ఖర్చులు, రాబడి మరియు ఆర్థిక సాధ్యాసాధ్యాలను విశ్లేషించటం జరిగింది. విశ్లేషణ ఫలితాలు 15 సంవత్సరాల కాలానికి హెక్టారుకు చర వ్యయాలు మరియు స్థిర వ్యయాలు రూ. 8,36,760 మరియు రూ. 6,71,247గా ఉన్నాయి. మొత్తం వ్యయంలో సింహభాగం కౌలు ఖర్చు వాటా 43.8% (రూ.6,60,725), సేంద్రియ ఎరువుల వాటా 17.38%



(రూ. 2,62,151) మరియు కూలీల ఖర్చు 12.69% (రూ. 1,91,448)గా గుర్తించబడింది. చర వ్యయాలపై రాబడిని తెలిపే స్థూల మార్జిన్ యజమాని రైతులకు వర్తిస్తుంది మరియు మొత్తం ఖర్చులపై రాబడిని తెలిపే నికరరాబడి కౌలుదారు రైతులకు వర్తిస్తుంది. ఆయిల్‌పామ్ పంట యొక్క స్థూల మార్జిన్ హెక్టారుకు రూ. 17,61,280గాను మరియు నికర రాబడి హెక్టారుకు రూ. 9,42,092గా ఉన్నది. ఒకటన్ను ఆయిల్‌పామ్‌కి ఉత్పత్తి వ్యయం రూ.6,265గా మరియు రాబడి రూ.9,808 గా ఉన్నది. కౌలుదారు రైతులకు వర్తించే మొత్తంఖర్చు–రాబడి నిష్పత్తి 1.49 గా మరియు యజమాని రైతులకు వర్తించే చరవ్యయం – రాబడి నిష్పత్తి 2.98 గా ఉన్నది. అలాగే, ఆయిల్‌పామ్ పెరుగుదల మరియు దిగుబడికి తగిన సేంద్రియ ఎరువులు సరఫరా తప్పనిసరిగా అవసరం. కానీ రవాణాఖర్చులు పెరగడం మరియు సేంద్రియ ఎరువులు అందుబాటులో లేకపోవడం వలన, 63.33% రైతులు సేంద్రియ ఎరువులను రసాయన ఎరువులతో భర్తీచేస్తున్నారు. 15 సంవత్సరాల సమాచారం ఉపయోగించడం వలన ఆయిల్‌పామ్ టన్నుకు ఒక్కింటికి ఉత్పత్తి వ్యయం రూ.9,808 గా పరిగణించటం జరిగింది. తరువాతి కాలంలో రాబడులు మరింత పెరిగే అవకాశంవుంది. ఎందుకనగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 80 కోట్ల ప్రణాళికా వ్యయంతో ఆయిల్‌పామ్ సాగును అభివృద్ధిపరిచే దిశగా టన్ను ధర రూ.16,400 గా ప్రకటించారు.

**పట్టిక 4: ఆంధ్రప్రదేశ్ లోఆయిల్ పామ్ సాగు యొక్క ఆర్థిక సాధ్యత (హెక్టారుకు)**

| S.No | వివరాలు | పెట్టుబడి ఖర్చు (7%) |
|---|---|---|
| 1 | నికర ప్రస్తుత విలువ (రూ./హెక్టారు) (Net Present Value/Worth) | 4,95,134.79 |
| 2 | వేరియబుల్ ఖర్చులపై బిసిఆర్ నిష్పత్తి (BC Ratio) | 2.98 |
| 3 | మొత్తం ఖర్చులపై బిసిఆర్ నిష్పత్తి (BC Ratio) | 1.49 |
| 4 | ఐఆర్ ఆర్ (%) (Internal Rate of Reurns) | 26.01% |

బిసిఆర్: ప్రయోజన వ్యయ నిష్పత్తి

నికర ప్రస్తుత విలువ (NPV) పెట్టుబడి అవకాశాల మొత్తం



విలువను సంగ్రహించే ఒక ఆర్థిక విశ్లేషణ పద్ధతి. ఈ శాస్త్రీయ పరిశీలన అనుసరించి, ఆయిల్‌పామ్ నికర ప్రస్తుత సాగు విలువ రూ. 4,95,134 గా 7 శాతం డిస్కౌంట్ రేటు వద్ద అత్యంత సానుకూలంగా ఉంది. చరవ్యయాలు మరియు మొత్తం వ్యయాలపై ప్రయోజన వ్యయ నిష్పత్తి (BCR) 7 శాతం డిస్కౌంట్ రేటు వద్ద 2.98 మరియు 1.497 గా వున్నది. అనగా, 15 సంవత్సరాల వివరాల ప్రకారం ఒక రూపాయి పెట్టుబడికి చర (variable) వ్యయాలతో పోల్చినపుడు రూ. 1.98 పైసలు లాభం చేకూరింది. ఇది ఆయిల్‌పామ్ సాగు ఆర్థికంగా ఆచరణీయమైనదని తెలుపుతుంది మరియు లాభాలు ఆర్జించడానికి 5 సంవత్సరాల వరకు వేచిఉండే సొంత భూములు ఉన్న రైతులకు ఉత్తమంగా సరిపోతుందని నిర్ధారిస్తుంది. ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్ (IRR) పెట్టుబడుల లాభదాయకతను అంచనా వేయడానికి ఆర్థిక విశ్లేషణలో ఉపయోగించే సాధనం. దీని విలువ ఆయిల్‌పామ్ సాగుకు 7 శాతం డిస్కౌంట్ రేటు వద్ద 26.01 శాతంగా ఉంది. అనగా డిస్కౌంట్ రేట్‌తో పోలిస్తే 3 రేట్లు ఎక్కువగా వున్నందువలన ఆయిల్‌పామ్ భవిష్యత్తు సాగు లాభదాయకమని తెలుపుతుంది.

## భవిష్యత్ మార్గం:

1. రైతులు సేంద్రియ ఎరువులను రసాయన ఎరువులతో భర్తీచేస్తున్నందున, రాష్ట్ర ప్రభుత్వం వేప చెక్క మరియు ఇతర సేంద్రియ ఎరువులను RBK కియోస్కుల్లో చేర్చి సరఫరా చేయుట ఉపయుక్తం.

2. ఆయిల్‌పామ్ ఉత్పత్తులు తప్పనిసరిగా కోసిన వెంటనే ప్రాథమిక ప్రాసెసింగ్ కోసం రవాణా చేయబడాలి, ప్రస్తుతమున్న 60% సామర్థ్య వినియోగాన్ని పెంచడం ద్వారా మరియు ఫార్మ్‌గేట్‌కి దగ్గరగా కొత్త ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడం ద్వారా దేశీయ ఆయిల్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కాంట్రాక్టు వ్యవసాయం ద్వారా బలోపేతం అయ్యి, ప్రాసెసింగ్‌ను సులభతరం చేయగలదు.

3. ప్రభుత్వ సహాయంతో కంపెనీలు ఆయిల్‌పామ్ గుత్తుల రవాణా ఖర్చులను భరించడానికి సరైన చర్యలు తీసుకోవలసిన అవసరంఉంది.

4. రైతువారీగా ఎక్కువ విస్తీర్ణంలో ఆయిల్‌పామ్‌ను సాగు చేయగలిగే సామర్థ్యం ధనిక మరియు పరిశ్రమలతో అనుబంధం ఉన్న పెద్ద రైతులకు మాత్రమే ఉందన్న విషయం విదితమే. ఆయిల్‌పామ్ సాగులో చిన్న సన్నకారు రైతులను ప్రోత్సహిస్తూనే, ఇతరదేశాలలో గిరాకీ ఉన్న మన సాంప్రదాయ వంటనూనె గింజల (వేరుశెనగ, ఆవాలు, నువ్వులు, పొద్దుతిరుగుడు, కుసుమ) సాగును చేజార్చుకోకుండా సమగ్రంగా అన్ని వర్గాల రైతులను ప్రోత్సాహిస్తూ దేశీయ వంటనూనెల అవసరాలను తీరుస్తూ ఎగుమతుల వైపు పయనించవలసిన ఆవశ్యకతను గుర్తెరగాలి.

5. కేంద్రప్రభుత్వం చొరవ ప్రకారం ఆయిల్‌పామ్ సాగును 2025-26 నాటికి 10 లక్షలహెక్టార్ల విస్తీర్ణంలో మరియు 11.20 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో క్షేత్ర స్థాయిలో అమలును దృడంగా చేపట్టినట్లయితే, దేశ దిగుమతులపై ప్రభుత్వ భారాన్ని తగ్గించగలం.

6. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రయోజనాల దృష్ట్యా, ఆంధ్రప్రదేశ్ రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో, రైతులకు కావలిసిన మొక్కలను సరఫరా చేసి, ప్రాసెసింగ్ పరిశ్రమని ప్రోత్సహించడంవల్ల అనుకున్న లక్ష్యాలను సాధించగలం.

---

**ఎ విష్ణు వర్ధన్ రెడ్డి, ఉపకులపతి, జి. రఘునాథ రెడ్డి,**
ప్రధానశాస్త్రవేత్త, వ్యవసాయ ఆర్థికశాస్త్రం, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లామ్, గుంటూరు

**"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."**

# వేసవిలో కొర్రసాగుకు సూచనలు



కొర్ర స్వల్పకాలిక పంట కావున ప్రత్యామ్నాయ పంటగా బాగా ఉపయోగపడుతుంది. కొర్ర బెట్ట పరిస్థితులను తట్టుకొని కొంతమేర దిగుబడిని ఇవ్వగల్గిన పంట మరియు పంటల సరళిలో బాగా ఉపయోగ పడుతుంది. కొర్ర పంటను ఎక్కువగా కర్నూలు, అనంతపురం, ప్రకాశం, విజయనగరం మరియు విశాఖపట్టణం జిల్లాలో సాగు చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఆరోగ్యరీత్యా కొర్రలలో ఉన్న పోషక విలువలు మరియు ఔషధగుణాల పరంగా కొర్ర ప్రాముఖ్యత బాగా పెరిగినది. ఈ పంటసాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించితే అధిక దిగుబడులు సాధించవచ్చును.

**విత్తు సమయం:** వేసవిలో జనవరి మాసంలో విత్తుకోవాలి.

**రకాల ఎంపిక:** కొర్ర పంటలో అధిక దిగుబడినిచ్చు రకాల వివరాలు ఈ క్రింది పట్టికలో తెలుపబడినవి.

**విత్తనం మరియు విత్తడం:** ఎకరాకు 3 కిలోల విత్తనం సరిపోతుంది. ఒక కిలో విత్తనానికి 2 గ్రా॥ కార్బండిజమ్ చొప్పున విత్తన శుద్ధిచేసి సాళ్ళ మధ్య 22 సెం.మీ దూరం, సాళ్లలో మొక్కల మధ్య 7.5 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి. విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలను తీసివేయాలి. విత్తిన 30 రోజుల వరకు పంట పొలంలో కలుపు మొక్కలు లేకుండా చూడాలి.

విత్తిన మొలకశాతం పెంచడానికి విత్తనాన్ని 6-8 గంటలు నానబెట్టి (మొలకరాక ముందే) తరువాత నీటిని తీసివేసి విత్తనాన్ని పలుచటి గుడ్డ మీద పోసి విత్తనానికి ఇసుక కలిపి (1 కిలో విత్తనానికి 1 కిలో ఇసుక కలిపి) పొలంలో చల్లడం ద్వారా తక్కువ తేమతో మొలక శాతం పెరిగి మొక్కల సాంద్రత బాగుండి దిగుబడులు పెరగడానికి అవకాశం ఉంటుంది.

**కలుపు నివారణ మరియు అంతరకృషి:** విత్తిన 20 రోజుల తర్వాత సాళ్ళలో గొర్రుతో ఎదసేద్యం చేయడం వలన కలుపు మొక్కలు రాకుండా నివారించవచ్చును. చిరుధాన్యాలు గడ్డిజాతికి చెందిన పంటలు కావున పంటలలో గడ్డిజాతి కలుపు మొక్కలను నివారించడానికి వాడే కలుపు మందులను వాడలేము, కావున కలుపును నివారించడానికి ముందుగా లోతుదుక్కిలు చేయాలి. విత్తనాన్ని సాళ్ళలో విత్తుకుంటే అంతరసేద్యం చేయడానికి వీలుంటుంది. కూలీల సమస్య ఎక్కువగా ఉంది కావున వెడల్పాకు కలుపు మొక్కల నివారణకు పంట విత్తిన 25-30 రోజులకు 2,4-డి సోడియం సాల్టును 2గ్రా/లీటరు నీటికి కలిపి కలుపు మొక్కలపై

**నత్రజని పైరు శాఖీయ ఉత్పత్తికి మాత్రమే ఎక్కువగా ఉపయోగపడుతుంది.**

| రకం | పంటకాలం (రోజులు) | దిగుబడి (క్వి/ఎ) | గుణగణాలు |
|---|---|---|---|
| ఎస్.ఐ.ఎ - 3085 | 76-80 | 10-12 | బెట్టను తట్టుకొంటుంది. అగ్గితెగులును మరియు వెర్రికంకి తెగులును తట్టుకొంటుంది. గింజలు పసుపు రంగులో వుండి నాణ్యత కల్గి ఉంటాయి. |
| సూర్యనంది (ఎస్.ఐ.ఎ. 3088) | 70-76 | 10-12 | గింజ పసుపు రంగులో ఉండి నాణ్యత కల్గి ఉంటుంది. అగ్గితెగులును మరియు వెర్రికంకి తెగులును తట్టుకొంటుంది. |
| ఎస్.ఐ.ఎ. 3156 | 85 | 11-13 | వెర్రికంకి తెగులును తట్టుకొంటుంది. అధిక గింజ దిగుబడి ఇవ్వగల రకం. |
| గరుడ (ఎస్.ఐ.ఎ. 3222) | 60-62 | 8-10 | అతి స్వల్పకాలిక రకం, చిరుసంచుల దశలో ఉన్న రకం. అగ్గితెగులును మరియు వెర్రికంకి తెగులును తట్టుకొంటుంది. అంతర పంటగా/ పంటల సరళిలో ఉపయోగపడుతుంది. |
| రేనాడు (ఎస్.ఐ.ఎ. 3223) | 80-85 | 12-14 | పైరు ఏపుగా పెరిగి పిలకలు బాగా వస్తాయి. అగ్గి తెగులును మరియు వెర్రికంకి తెగులును తట్టుకొంటుంది. గింజ నాణ్యత బాగుంటుంది. |

**"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"**

పిచికారీ చేస్తే కలుపు మొక్కలు ఎండి చనిపోతాయి. కూలీలు సమస్య లేనప్పుడు ఒక్కసారి తొలికెలతో కలుపు మొక్కలను తీసివేస్తే మొక్క వేర్ల వ్యవస్థ కదిలి మట్టి తిరగబడి మొక్కకు పోషకాలు బాగా అందడం వలన మొక్క ఏపుగా పెరిగి పిలకలు బాగా వస్తాయి. దంతితో ఎడసేద్యం చేసిన మట్టి గుల్లబారి వేర్లకు గాలి బాగా అందుతుంది. వర్షం పడినప్పుడు నీరు బాగా ఇంకుతుంది.

**ఎరువుల యాజమాన్యం:** ఆఖరి దుక్కిలో 4 టన్నుల పశువుల ఎరువును ఒక ఎకరా పొలంలో వేసి బాగా కలియదున్నాలి. ఒక ఎకరా పొలానికి 9 కిలోల యూరియా, 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ విత్తేటపుడువేసుకోవాలి. మరో 9 కిలోల యూరియాను విత్తిన 30 రోజులకు పైపాటుగా వేయాలి.

**నీటి యాజమాన్యం:** పంటను బెట్టకు గురికాకుండా చూసుకోవాలి. సున్నిత దశలైన విత్తేటప్పుడు, పిలకల దశ, పూత దశ మరియు గింజకట్టే దశలలో నీటి తడులు ఇవ్వాలి. స్వల్పకాలిక పంట కావున నాలుగు లేదా ఐదు నీటి తడులతో పంటను సాగుచేసుకోవచ్చును.

## సస్యరక్షణ



### పురుగులు

**గులాబి రంగు పురుగు:** లార్వాలు మొవ్వను తొలిచి తినడం వలన మొవ్వ చనిపోతుంది. పూత దశలో ఆశించినట్లయితే వెన్నులు తెల్లకంకులుగా మారుతాయి. దీని నివారణకు వేప గింజల కషాయం 5% (5 మి.లీ లీటరు నీటికి) లేదా థైయోడికార్బ్ 1 గ్రా॥ లీటరు నీటికి లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 18.5% యస్.సి. 0.3 మి.లీ లీటరు నీటికి వంతున కలిపి పిచికారీ చేయాలి.

**కాండం తొలుచు పురుగు:** ఈ పురుగు కాండాన్ని తొలచటం వలన మొక్కలు సరిగా ఎదగక చనిపోతాయి, దీని నివారణకు వేప గింజల కషాయం 5% (5 మి.లీ లీటరు నీటికి) లేదా థైయోడికార్బ్ 1 గ్రా॥ లీటరు నీటికి లేదా క్లోరాంత్రనిలిప్రోల్18.5% యస్.సి. 0.3 మి.లీ లీటరు నీటికి వంతున కలిపి పిచికారీ చేయాలి.

**ఆర్మీ వార్మ్:** దీని లద్దె పురుగులు మొక్కలు పెరిగే దశలో ఆకులను వెన్నులను కొరికి తినివేస్తాయి. దీని నివారణకు క్లోరోపైరిఫాస్ 2 మి.లీ లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 18.5% యస్.సి. 0.3 మి.లీ లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా॥ లీటరు నీటికి వంతున కలిపి పిచికారీ చేయాలి.

### తెగుళ్ళు



**తుప్పు తెగులు :** ఈ తెగులు శిలీంధ్రం వలన కలుగుతుంది. ఆకుల మీద రెండువైపులా గోధుమ రంగు కలిగిన చిన్న చిన్న ఉబ్బెత్తు మచ్చలు ఏర్పడుతాయి. ఈ మచ్చలు ఆకు తొడిమ మరియు కాండం మీద కూడాఏర్పడతాయి. ఈ మచ్చలు ఎక్కువ అయిన ఎడల ఆకులు ఎండిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి 2.5గ్రా॥ల మాంకోజెబ్ కలిపి పైరుపై పిచికారీ చేయాలి.

**అగ్గి తెగులు:** ఎదిగిన మొక్కల ఆకులపై నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడతాయి. ఇవి ఆకులు అంతటా వ్యాపించడం వలన ఆకులు ఎండి రాలిపోతాయి. కంకికాడపై మచ్చలు ఏర్పడినప్పుడు కాండం విరిగి, కంకిలోతాలు గింజలు ఏర్పడతాయి. దీని నివారణకు కాప్టాన్ లేదా థైరమ్ 3 గ్రా/కిలో విత్తనాలకు కలిపి విత్తన శుద్ధిచేయాలి. లీటరు నీటికి కార్బండిజమ్ 1 గ్రా॥ లేదా మాంకోజెబ్ 2.5 గ్రా॥ లేదా ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా॥ కలిపి వారం రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.

**వెర్రికంకి తెగులు:** తేమతో కూడిన వాతావరణంలో ఆకుల అడుగువైపున బూజులాంటి శిలీంధ్రం పెరుగుదలకనిపిస్తుంది. అలాంటి ఆకులు ఎండి పీలికలుగా కనిపిస్తాయి. మొవ్వులోని ఆకులు సరిగా విచ్చుకోవు. మొక్క నుండి బయటకు వచ్చిన కంకులలో గింజల ప్రదేశంలో ఆకువచ్చని ఆకులు మాదిరిగా మారి కనిపిస్తాయి. దీని నివారణకు 1 గ్రా॥ థైరమ్ లేక కాప్టాన్ లేక మెటలాక్సిల్ కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేయాలి. లేదా లీటరు నీటికి మెటలాక్సిల్ 1 గ్రా॥ లేదా మాంకోజెబ్ 2.5 గ్రా॥ కలిపి పంటపై పిచికారీ చేయాలి.

**పంటకోత:** మొక్కలు పసుపు రంగులోకి మారి కంకిలోని గింజలు గట్టిగా ఉన్నప్పుడు పంటను కోయాలి. కంకులను ఎండబెట్టి నూర్పిడి చేసి గింజలను వేరుచేయాలి. గింజలు బాగా ఎండబెట్టి నిల్వచేసుకోవాలి.



డా॥ యల్. మాధవీలత, సీనియర్ శాస్త్రవేత్త, (ప్లాంట్ బ్రీడింగ్),
డా॥ యం. శాంతి ప్రియ, ప్రధాన శాస్త్రవేత్త, (ప్లాంట్ బ్రీడింగ్),
డా॥ యమ్. హేమంత్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చిరుధాన్యాలు),
వ్యవసాయ పరిశోధనా స్థానము, పెరుమాళ్ళపల్లె.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056028 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# చౌడు నేలల్లో రేగు సాగు... ఆదాయం మెరుగు



రేగు పంట మన రాష్ట్రంలో ముఖ్యంగా వివిధ వ్యవసాయ పరిస్థితులలో పండిస్తున్నారు. మన రాష్ట్రంలో 1503 హెక్టార్లలో సాగు చేయబడుతూ, సాలీనా 32,963 టన్నుల దిగుబడిని ఇస్తుంది. రేగు పంట ఏ రకమైన ఏ నేలలోనైనా పండించడానికి అనువుగా ఉంటుంది. ముఖ్యంగా వ్యవసాయానికి పనికిరాని చౌడు నేలల్లో ఎక్కువగా సాగుకు అనుకూలంగా ఉంటుంది.

**నేలలు మరియు వాతావరణం :** లోతు తక్కువగా ఉన్న ఇసుక నుంచి గరప నేలల వరకూ లోతైన ఆమ్ల, క్షార నేలల్లో కూడా రేగు పంటను విరివిగా సాగుచేసుకోవచ్చు. నేల ఉదజని సూచిక 6-8 వరకూ ఉన్న నేలలు సాగుకు బాగా అనుకూలంగా ఉంటాయి. రేగు తీవ్రమైన చలిని తట్టుకునే పంట. సముద్ర మట్టము నుండి 1000 మీటర్ల ఎత్తు వరకూ గల భూముల్లో సాగు చేసుకోవచ్చు. వేసవిలో ఆకు రాల్చి నిద్రావస్థలో ఉండి వర్షాకాలంలో చిగురు వేస్తుంది. గాలిలో తేమ అధికంగా ఉండని అన్ని ప్రాంతాలలో సాగు చేసుకోవచ్చు.

**రకాలు :** మార్కెట్ అనుగుణంగా రేగు రకాల ఎంపిక ముఖ్యమైనది. ఇటీవలి కాలంలో పెద్ద రేగు మరియు ఆపిల్ రేగు సాగు ఎక్కువగా ప్రోత్సహించబడుతుంది. రేగులో ముఖ్యంగా ఈ క్రింది రకాలు ఎక్కువగా సాగులో ఉన్నాయి. అవి..

**గోల :** పండ్లు గుండ్రంగా, పసుపు రంగుతో కూడిన మృదువైన తోలు కలిగి ఉంటాయి. లాభదాయకమైన దిగుండి 5-6 సంవత్సరాల వయస్సులో మొదలౌతుంది. వర్షాధారంగా 45-50 కిలోలు మరియు నీటి వసతి క్రింద 80-100 కిలోల దిగుబడిని ఒక చెట్టు ఇస్తుంది.



**ఉమ్రాన్ :** పండ్లు కోలగా పెద్దవిగా ఉండి, పైన చిన్న చిన్న బుడిపెలు ఉంటాయి. పండు బరువు సుమారు 26-32 గ్రా. ఉండి 40 కిలోల దిగుబడి ఒక చెట్టు నుండి తీసుకోవచ్చు.

**కైథిలి :** పండ్లు అండాకారంలో లేదా కోలగా ఉండి మృదువైన తోలు కలిగి ఉంటాయి. కోత దశలో నారింజ రంగుకు మారి రుచిగా ఉంటాయి. 6-10 సంవత్సరాల వయస్సు గల చెట్టు 45-50 కిలోల దిగుబడినిస్తుంది.

**సెబ్ :** పండ్లు ఆపిల్ ఆకారం కలిగి, చెట్టు నిటారుగా పెరుగుతుంది. పండు బరువు 30 గ్రా. ఉండి 45-50 కిలోల దిగుబడి నిస్తుంది.

**ముండియా :** పండ్లు కోలగా, చిన్నవిగా ఉండి, చెట్టుకి 30-35 కిలోల దిగుబడినిస్తుంది.

**టికడి :** పండు ఈగను సమర్థవంతంగా తట్టుకునే రకం

**గంగ రేగు :** ఇది తీపి తక్కువగా ఉండి, కండకన్నా విత్తనం శాతం అధికంగా కలిగిన రకం

రేగులో పైన తెలిపిన రకాలే కాకుండా గోమాకీర్తి, బనారసీ కర్కి, పొంద, చమేలి, కేటకి మరియు ఆపిల్ రేగు రకాలు కూడా సాగుకు అనుకూలంగా ఉన్నాయి. మొగ్గ అంట్లు ద్వారా వ్యాప్తి చేసిన పై రకాలన్నీ మూడవ సంవత్సరం నుండి కాపునిస్తాయి.

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

లాభదాయకమైన దిగుబడి 5-6 సంవత్సరాల నుండి ఇస్తాయి. నాల్గవ సంవత్సరం నుండి మొక్కలను కాపునకు వదలడం మంచిది. అంతకు మూడు సంవత్సరాలలో చెట్టు పూతకు వచ్చినా తీసివేయడం మంచిది. ఒకే పొలంలో 2,3 రకాలను సాగుచేస్తే పరపరాగ సంపర్కం జరిగి మంచి దిగుబడులు రావటానికి అవకాశం ఉంది.

**నాటటం :** వరసకు వరసకు మరియు మొక్కకు మొక్కకు మధ్య 6 × 6 సెం.మీ. గోతులను మే-జూన్ నెలల్లో తీసి, నెల రోజులు ఎండనివ్వాలి. గోతులందు 15 కిలోల ముక్కిన పశువుల ఎరువును, 1 కిలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 100 గ్రా. ఫ్యూరడాన్ గుళికలను పై మెత్తటి మట్టితో కలిపి గోతులను పూడ్చాలి. తర్వాత మొగ్గంట్లను గుంట మధ్యలో అంటు భాగం భూమి పైకి ఉండేట్లుగా నాటుకోవాలి. జూలై నుండి అక్టోబర్ వరకూ నాటటానికి అనుకూలం. అవసరానికి అనుకూలంగా నీటిని అందిస్తూ ఉండాలి. వీలైతే డ్రిప్ పద్ధతిలో ఎరువులను, నీటిని ఇవ్వటం ద్వారా, నీరు మరియు ఎరువుల వినియోగం తక్కువగా ఉంటుంది. పూత దశలో నీరు ఎక్కువగా పెట్టరాదు. కాయ పెరిగే దశలో నీటి వసతిని కల్పించాలి. వేరుశనగ పొట్టు లేదా వరి పొట్టు 8 సెం.మీ. మందంతో మల్చింగ్ చేసుకోవాలి. వేరు మూలంపై వచ్చే చిగుర్లను ఎప్పటికప్పుడు తీసేస్తూ ఉండాలి. ప్రతి సంవత్సరం మార్చి, ఏప్రిల్ మాసాలలో కత్తిరింపులు చేసుకోవాలి. మొగ్గ అంట్ల కోసం ప్రతి కొమ్మ 15-20 కనుపుల నుండి కత్తిరించాలి. కత్తిరింపులకు ముందు 10 గ్రా. పొటాషియం నైట్రేట్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయటం ద్వారా మొగ్గ అంట్లు త్వరగా చిగురిస్తాయి.



కత్తిరింపు అయిన తరువాత కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటిలో కలిపి కత్తిరించిన కొమ్మల చివర్లపై పిచికారీ చేయాలి.

**అంతర పంటలు :** మొదటి మూడు సంవత్సరాలు వేరుశనగ, పెసర, అలసంద, ఉలవ మొదలైన పంటలను అంతర పంటలుగా వర్షాధారంతో పండించుకోవచ్చు.

**ఎరువులు :** ప్రతి సంవత్సరం పశువుల ఎరువుతోబాటు నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను వాడాలి. నత్రజనిలో సగం, మొత్తం భాస్వరం, మొత్తం పొటాష్ కత్తిరించిన వెంటనే పాదుల్లో వేసి, మట్టిని తిరగకొట్టాలి. మిగిలిన సగం నత్రజని కత్తిరింపు అయిన మూడు నెలల తర్వాత వేయాలి.

సమగ్ర ఎరువుల యాజమాన్యంలో భాగంగా సిఫార్సు చేసిన ఎరువులలో 50 శాతం సేంద్రీయ ఎరువుల రూపంలో వేస్తూ మిగతా 50 శాతం వేప చెక్క, పశువుల ఎరువు, జీవన ఎరువులైన అజటోబాక్టర్ (50-250 గ్రా.) ఫాస్ఫోబ్యాక్టీరియా 100 గ్రా. చెట్టుకి వేయటం ద్వారా మంచి దిగుబడి వస్తుంది.

| చెట్టు వయస్సు | పశువుల ఎరువు (కి.) | నత్రజని (గ్రా.) | భాస్వరం (గ్రా.) | పొటాష్ (గ్రా.) |
|---|---|---|---|---|
| మొదటి సంవత్సరం | 10 | 100 | 50 | 50 |
| రెండవ సంవత్సరం | 20 | 200 | 100 | 100 |
| మూడవ సంవత్సరం | 30 | 100 | 150 | 150 |
| నాల్గవ సంవత్సరం | 40 | 400 | 200 | 200 |
| ఐదవ సంవత్సరం | 50 | 500 | 250 | 250 |
| ఆ పైన | 60 | 750 | 300 | 300 |

ఫర్టిగేషన్ విధానంలో ఎరువులు ఇచ్చేటప్పుడు నీటిలో కరిగే ఎరువులను వాడాలి మరియు ఇచ్చే ఎరువులను పంటకాలంలో విభజించుకుని వారానికి లేదా 10-15 రోజుల కొకసారి అవసరాన్ని బట్టి నీటి ద్వారా ఇవ్వాలి. దీని కొరకు మొదటగా ఒక గంట డ్రిప్ ద్వారా నీటిని పారించి తర్వాత ఎరువులను డ్రిప్ ద్వారా పంపించాలి. తర్వాత మరలా ఒక అరగంట నీటిని డ్రిప్ ద్వారా వదలాలి.

**సస్యరక్షణ :** పైరుపై వచ్చే వివిధ రకాల పీడలను సకాలంలో గుర్తించి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పండు ఈగ ఆశించి రాలిపోయిన పండ్లను ఏరి నాశనం చేయాలి. సమగ్ర సస్యరక్షణ విధానాలను అవలంబించాలి.

**డా. పి. వెంకటసుబ్బయ్య, శాస్త్రవేత్త,**
**డా. అన్నె మృదుల, సీనియర్ శాస్త్రవేత్త,**
**ఉప్పునీటి పరిశోధనా కేంద్రం, బాపట్ల**

**"చీడపీడలపై మీ సందేహాలను 8331056149 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."**

## ఘనంగా గణతంత్ర సంబరం






**గణతంత్ర సంబరం :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా వ్యవసాయ శాఖ ప్రగతి శకటాలు, స్టాల్సు ద్వారా ప్రజలకు తెలియజేశారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర వేడుకలలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రదర్శించిన శకటానికి ప్రశంసలు దక్కాయి. అలాగే వివిధ జిల్లాలలో ప్రదర్శించిన శకటాలివి.



విశాఖపట్నం




విజయనగరం జిల్లా




కృష్ణా జిల్లా




నెల్లూరు జిల్లా

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"






**ప్రశంస :** తెలంగాణా వ్యవసాయ శాఖ కమీషనర్ ఎమ్. రఘునందన్‌రావు గన్నవరంలోని సమీకృత రైతు సమాచార కేంద్రాన్ని సందర్శించారు. కృష్ణా జిల్లాలోని రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకొని ప్రశంసించారు.





**సందర్శన :** రాష్ట్ర వ్యవసాయ శాఖ కమీషనర్ హెచ్. అరుణ్‌కుమార్, నెల్లూరు, పశ్చిమ గోదావరి జిల్లాలలో విస్తృతంగా పర్యటించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో రైతు భరోసా కేంద్ర సిబ్బందితో మాట్లాడారు. నెల్లూరు జిల్లాలో రైతు యంత్ర సేవా కేంద్రాలు, జాతీయ ఆహార భద్రతా పథకం తదితర అంశాలపై అధికారులతో సమీక్షించి రైతులతో మాట్లాడారు.





**అవగాహన :** రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాలలో బ్యాంకింగ్ సేవలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు

**"చీడపీడలపై మీ సందేహాలను 8331056150 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."**

# ప్రొద్దు తిరుగుడులో అధిక దిగుబడులకు సూచనలు



ప్రొద్దు తిరుగుడు ఆరోగ్యమైన వంటనూనె ఇచ్చే పంట, వేరుశెనగ, నువ్వుల నూనెల కంటే కూడ ప్రొద్దుతిరుగుడు పువ్వు నూనె శ్రేష్ఠమైనది. ముఖ్యముగా హృద్రోగముతో బాధపడు వారికి ఈ నూనె వరప్రదాయ మనే చెప్పాలి. వార్నిష్, సబ్బులు, కలప పరిశ్రమలలో కూడా ఈ నూనెను విస్తారముగా ఉపయోగిస్తున్నారు. నూనె తీసిన తర్వాత వచ్చు పిండి దాణాగా ఉపయోగపడుతుంది. రబీ మరియు వేసవిలో విత్తిన పంట ఖరీఫ్ కంటే అధిక దిగుబడినిస్తుంది.

నాణ్యమైన విత్తనాన్ని సాగు చేయాలి. ప్రభుత్వ రంగ సంస్థల నుండి విడుదల చేయబడిన ఎన్.డి.ఎస్.హెచ్-1012 మరియు డి.ఆర్.ఎస్.హెచ్-1 అను సంకరాలు అధిక దిగుబడి మరియు నూనె శాతం కలవి.

నీటి ఆధారంగా రబీలో నవంబర్ నెలలో మరియు వేసవిలో జనవరి నెల రెండవ పక్షం నుండి ఫిబ్రవరి మొదటి వారంలో సాగుచేసి అధిక దిగుబడి పొందవచ్చు.

నెక్రోసిస్ తెగులు నివారణకు రక్షక పంటలుగా జొన్న లేదా మొక్క జొన్న పంటలను ప్రొద్దుతిరుగుడు పైరు చుట్టు 4 వరుసలు సాగుచేయాలి. అంతేకాక, ఇమిడాక్లోరోప్రిడ్ 600 ఎఫ్.ఎస్. మందును 5 మి.లీ. లేదా థయోమిథక్సామ్ 4 మి.లీ. కిలో విత్తనానికి పట్టించి విత్తన శుద్ధి చేయాలి.

బోదెల పద్ధతిలో నల్లరేగడి భూముల్లో 60 సె.మి. × 30 సెం.మి. ఎర్ర నేలల్లో 45 సెం.మీ × 20 సెం.మీ. ఎడంలో విత్తుకోవాలి.

కలుపు నివారణకు, పైరు విత్తిన వెంటనే పెండిమిథాలిన్ 30% ఈసి కలుపు మందును 5 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. తరువాత 30-35 రోజులకు గొర్రుతో అంతరకృషి చేయాలి. తరచూ వర్షాలతో అంతరాయం ఉంటే పైరు 25 రోజుల వయసులో ఫినాక్సిఫాప్ ఇథైల్/క్విజలోఫాప్ ఇథైల్ 1.25 ml లీటరు నీటిలో కలిపి గడ్డి జాతి కలుపును తొలగించవచ్చు.

విత్తనం మొలకెత్తిన 10-15 రోజుల తరువాత కుదురుకు ఆరోగ్యవంతమైన ఒక మొక్కను వుంచి మిగిలిన మొక్కలను తీసివేయాలి.

నీటిపారుదల పంటకు 30 కిలోల నత్రజని, 36 కిలోల భాస్వరం 12 కిలోల పొటాష్ నిచ్చు ఎరువులను వాడాలి. నత్రజని నిచ్చే ఎరువులను మూడు దఫాలుగా (50 శాతం దుక్కిలో, విత్తిన 30 రోజులకు 25 శాతం, 50 రోజులకు 25 శాతం) వేయాలి.

పైరు పూతదశలో (ఆకర్షక పత్రాలు వికసించే దశలో) బోరాక్స్ లీటరు నీటిలో 2 గ్రాములు కలిపి ఎకరానికి 200 లీటర్ల ద్రావణం పిచికారి చేయాలి.

పైరు సున్నిత దశలైన మొగ్గ తొడిగే దశ (30-5 రోజులు) పూల్ దశలో (50-55 రోజులు మరియు గింజ కట్టే దశ (70-80 రోజులలో నీటి యాజమాన్యం తప్పక చేపట్టాలి.

పువ్వు వెనక భాగం నిమ్మ పచ్చ రంగుకి మారిన తరువాత పువ్వులను కోసి వాటిని 2-3 వారాలు ఆరనివ్వాలి.

**సస్యరక్షణ :** రసం పీల్చు పురుగులు : పచ్చ దీపపు పురుగులు, తెల్లదోమ, తామర పురుగులు మరియు పిండినల్లి, దీపపు పురుగులు ఆశించిన ఆకుల చివర్లు పసుపు పచ్చగా మారి క్రమేపి ఆకు అంతా ఎర్రబడి చివరగా ఆకులు ముడుచుకొని దోనెలాగా కనిపిస్తాయి. వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి ఆకుల అడుగు భాగం బాగా తడిసేలా పిచికారీ చేయాలి. తెల్లదోమ ఆకుల అడుగు భాగం నుండి రసాన్ని పీల్చడం వలన ఆకులు పసుపు రంగుకు మారి మొక్కలు కూడా గిడసబారి ఎండి పోతాయి. వీటి నివారణకు ట్రైజోఫాస్ 20 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. తామర పురుగులు ఈ పంట మొదటి దశ నుంచి ఆశిస్తాయి వాతావరణం ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నపడు మరియు పైరు బెట్టకు గురైనప్పుడు వీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. పిల్ల, పెద్ద పురుగులు ఆకులను, పువ్వులను గోకి రసాన్ని పీలుస్తాయి. ముఖ్యం ఈ పురుగులు లేత భాగాన్ని ఆశ్రయించి పెరగడం వలన ఆకులు పెళుసుగా మారి మొక్క గిడసబారి పోతుంది. ఇవి ఆశించిన ఆకులపై పొడవాటి మచ్చలు

**యూరియా సిఫార్సు మేరకు మాత్రమే తగిన మోతాదులో వేసుకోవడం శ్రేయస్కరం**

**"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"**



ఏర్పడి ఆకులు పాలిపోయి ముడుచుకొని పోతాయి. పరోక్షంగా ఇవి నెక్రోసిస్ వైరస్ తెలుళ్ళలును వ్యాప్తిచేసి తీరని నష్టాన్ని కలిగిస్తాయి. తామర పురుగుల నివారణకు ఇమిడాక్లోరోప్రిడ్ 17.8 SL @ 0.4 మి.లీ. (లేదా) థయోమిథాక్సికామ్ 0.2 గ్రా. మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఆకుల్ని తినే పురుగులు :** పొగాకు లద్దె పురుగు, బొహరి గొంగళి పురుగు మరియు శనగపచ్చ పురుగు ఆకులపై పత్రహరితాన్ని గీకి తింటాయి. గింజల మధ్య చేరి వాటిని తింటూ అధిక నష్టాన్ని కలుగజేస్తాయి. ఉధృతి ఎక్కువగా వున్నయెడల క్వినాల్ఫాస్ 2.0 లేదా క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా నొవల్యురాన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తెగుళ్ళు : ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు :** తెగులు లక్షణాలు ఆకులపై, కాండము, పువ్వు అడుగున వున్న పచ్చని భాగాలు మరియు పూరేకులపై కన్పిస్తాయి. ఆకులపై సన్నని ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. మచ్చలు క్రమేపి ఒకదానితో ఒకటి కలిసిపోతూ ఆకులు ఎండిపోతాయి. తెగులు కలుగచేసే శిలీంధ్ర బీజాలు పంట అవశేషాలలో, కలుపు మొక్కలపైన జీవిస్తాయి. నివారణ కోసం పంట అవశేషాలు మరియు ఆశ్రయించే ఇతర కలుపు మొక్కల నిర్మూలన చేయాలి. మాంకోజెబ్ మందు 2 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయలి.

**నెక్రోసిస్ వైరస్ తెగులు :** ఈ వైరస్ తెగులు (తామర పురుగులు) ఆకుముడత పురుగుల ద్వారా ఒక మొక్క నుండి వేరొక మొక్కకు వ్యాపిస్తుంది. మొలక దశ నుండి పంట కోసే చివరి దశ వరకు ఎప్పుడైనా ఈ తెగులు సోకుతుంది. రబీలో వేసిన ప్రొద్దుతిరుగుడు పంటపై ఈ తెగులు ఎక్కువ తీవ్రతతో సోకుతుంది.

తెగులు సోకిన మొక్కలలో మధ్య ఈనెలకు దగ్గర వుండే ఆకు భాగం ఎండిపోయి వంకరలు తిరుగుతుంది. ఈ నెక్రోసిస్ తెగులు (నల్లటి చారలు) పత్రదళము నందు ఒక ప్రక్క నుండి ప్రారంబమై ఆకులో వ్యాపించి రెమ్మ మరియు కాండము దాకా ప్రాకి ఆగిపోతుంది. తెలుగు సోకిన మొక్కల మీద పూలు ఉత్పత్తి కాపు, క్రమేణ మొక్కలు చనిపోతాయి. పూత దశలో తెగులు సోకిన ఎడల పువ్వు కొంత మేర సుడి తిరిగి ముడత పడడం జరుగుతుంది. పువ్వు వెనుక భాగాన మరియు రక్షక దళాల మీద నెక్రోసిస్ తెగులు సాధారణంగా వచ్చే అవకాశముంది. తెగులు సోకినపుడు మొగ్గ విచ్చుకోవడం, పువ్వు పెరుగుదల మరియు గింజ కట్టుట దెబ్బతింటాయి.

**ఈ తెగులు యాజమాన్యము :** ప్రొద్దుతిరుగుడు పంట చుట్టూ 3-4 సాళ్ళు జొన్న పంటను విత్తుకోవాలి. ఎక్కడైనా తెగులు సోకిన మొక్కలు కనిపించిన, తీసినాశనం చేయాలి. పొలము లోను మరియు గట్ల మీద కలుపు మొక్కలు తీసివేయాలి. ఈ రోగాన్ని వ్యాప్తి చేసే కీటకాలను అరికట్టేందుకు 5.75 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందును 15 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**ఇ. సరళ,** వ్యవసాయాధికారి,
రైతు శితు శిక్షణా కేంద్రము, చిత్తూరు



"చీడపీడలపై మీ సందేహాలను 8331056152 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# మేలైన సస్యరక్షణతో పుచ్చ, ఖర్బూజ సేద్యం



మన రాష్ట్రంలో పుచ్చను 11,016 హెక్టార్లు మరియు ఖర్బూజాను 9,897 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. మన రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు ఈ పంట సాగుకు అనుకూలం. ఈ కాయలు సాధారణంగా తక్కువ కేలరీలు కలిగి ఉంటాయి. అంతేకాకుండా, అధిక మోతాదులో విటమిన్ 'ఎ' మరియు 'సి' కలిగి ఉండడం వలన దాహాన్ని తీర్చే గుణాన్ని కూడా కలిగి ఉంటాయి. ఈ పంటను తొలిదశ నుండి కోతకు వచ్చే వరకు వివిధ రకాల పురుగులు, తెగుళ్ళు ఆశించి నష్టపరుస్తాయి. దీనివలన దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. కావున, రైతులు సకాలంలో ఈ పంటలను ఆశించే చీడపీడలను గుర్తించి ఈ క్రింద సూచించిన సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి సాధించవచ్చును.

**పురుగులు : పెంకు పురుగులు :** ఇవి ఆకులను, పూలను కొరికి తినడం వలన తీవ్ర నష్టాన్ని కలుగ చేస్తాయి. వీటి నివారణకు 2 మి.లీ. ప్రొపెనోఫాస్ లేదా 2 మి.లీ. మిలాథియాన్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**ఆకుపురుగులు :** ఈ గొంగళి పురుగులు పంట యొక్క వివిధ దశలలో ఆశించి ఆకులను తింటాయి. వీటి నివారణకు 2 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా 1 గ్రా. థయోడికార్బ్‌ను లీటరు నీటికి కలిపి పూతకు ముందు పిచికారి చేయాలి.

పండు ఈగ : తల్లి ఈగలు పూత దశలో పువ్వులపై గుడ్లు పెడతాయి. వాటి నుండి వచ్చిన పిల్ల పురుగులు పూత మరియు పిందెలలోనికి చేరి కాయలను తిని నష్టపరుస్తాయి. వీటి నివారణకు పూత మరియు పిందె దశలో 2 మి.లీ. మలాథియాన్‌ను లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో పిచికారి చేసుకోవాలి. అదేవిధంగా పురుగు యొక్క ఉనికిని తెలుసుకోవడానికి ఎకరానికి 2 చొప్పున పండు ఈగ లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలి. ఈ పండు ఈగ నివారణకు విషపు ఎరను తయారు చేసుకోవాలి. ఈ విషపు ఎర తయారీకి 100 లీ. చక్కెర లేదాబెల్లంను ఒక లీటరు నీటికి కలపాలి. ఆ మిశ్రమానికి 100 మి.లీ. మలాథియాన్‌ను కలపాలి. 10-20 మి.లీ. విషపు ఎరను మట్టి ప్రమిదలలో పోసి ఎకరం పొలంలో 6-10 విషపు ఎర ప్రమిదలను అక్కడక్కడా పెట్టుకోవాలి.

**నులిపురుగులు :** ఈ పురుగుల బెడద ఎక్కువగా ఉన్నపుడు 3 గ్రా. కార్బోసల్ఫాన్ కిలో విత్తనానికి పట్టించి విత్తన శుద్ధి చేయాలి. మొక్క/పాదు మొదలు దగ్గర వేప పిండిని వేసుకోవాలి.

**తెగుళ్ళు : బూజుతెగులు :** ఈ తెగులు ఆశించినపుడు మొదట్లో ఆకుల మీద లేత ఆకుపచ్చ మరియు ముదురు కలిపి మొజాయిక్ వలె కనిపిస్తుంది. తరువాత ఆకులపై భాగాన పసుపు రంగు మచ్చలు అడుగు భాగాన ఊదా రందులో బూజు పదార్థం ఏర్పడుతుంది. ఆకులు పండిపోయి ఎండిపోతాయి. వర్షంతో కూడిన చల్లని వాతావరణం ఈ తెగులు వ్యాప్తికి అనుకూలం. దీని నివారణకు 2.0 గ్రా



"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

మెటలాక్సిల్ ఎమ్.జెడ్. లేదా 2.5 గ్రా. మాంకోజెబ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**బూడిద తెగులు :** ఆకుల పై భాగాన ముందుగా తెలుపు లేదా బూడిద రంగులో చిన్న మచ్చలు ఏర్పడి తరువాత తెల్లని పొడి / బూడిద వంటి పదార్థం ఏర్పడుతుంది. ఆకులు



పండిపోయి ఎండిపోతాయి. లేత ఆకులు కన్నా 20 రోజుల వయసున్న ఆకులను ఈ తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. దీని నివారణకు 1 మి.లీ. ట్రైడిమార్ఫ్ లేదా 1 మి.లీ. డైనోకాప్‌ను



లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ఫ్యూజేరియం వేరుకుళ్ళు / ఎండు తెగులు :** తెగులు సోకిన తీగలు వడలిపోతాయి. అకస్మాత్తుగా ఎండిపోతాయి. ఆకులు కూడా ఎండిపోయి రాలిపోతాయి. ఈ శిలీంద్రం భూమిలో ఉండి వ్యాపిస్తూ ఉంటుంది. కావున, దీని నివారణకు 1 శాతం బోర్డో మిశ్రమము లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను లీటరు నీటికి కలిపి మొక్క చుట్టూ నేల అంతా తడిచేలా పది రోజుల వ్యవధిలో 2-3 సార్లు పోయాలి. ట్రైకోడెర్మా విరిడి కల్చర్‌ను పశువుల ఎరువులో వృద్ధి చేసి పాదుల మొదలు దగ్గర భూమిలో వేయాలి.

**వెర్రి తెగులు :** ఆకుల ఈనెల మద్య మందంగా చారలు ఏర్పడి, పెళుసుగా మారి గిడసబారిపోతాయి. పూత, పిందె ఏర్పడడం ఆగిపోతుంది. దీని నివారణకు తెగులు సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి ఈ తెగులును వ్యాప్తి చేసి పేనుబంక నివారణకు 2 మి.లీ. డైమిథోయేట్ లేదా మిథైల్ డెమిటాన్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పక్షి కన్ను తెగులు :** ఆకులు మరియు కాయల మీద పక్షి కన్ను వంటి గుండ్రటి మచ్చలు ఏర్పడడం వలన అవి ఎండిపోయి రాలిపోతాయి. దీని నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 గ్రా. కార్బండిజమ్ లేదా 2 గ్రా. కార్బండిజమ్ + మాంకోజెబ్ కలిపిన మిశ్రమమును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**గమనిక :** ఈ పంటలకు గంధకం సంబంధిత పురుగు / తెగుళ్ళ మందులను వాడరాదు. వాటివలన ఆకులు మాడిపోతాయి.




డా. ఎమ్. స్వాతి, శాస్త్రవేత్త (సస్యరక్షణ),
డా. కె. తేజేశ్వరరావు, సీనియర్ శాస్త్రవేత్త (సస్యరక్షణ),
డా. కె. లక్ష్మణ, సమన్వయకర్త,
ఏరువాక కేంద్రం, విజయనగరం


"చీడపీడలపై మీ సందేహాలను 8331056153 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# బత్తాయి,నిమ్మ పంటల్లో చీడ పీడల నివారణ చర్యలు

మన రాష్ట్రంలో ముఖ్యంగా బత్తాయి, నిమ్మ సాగు కడప, అనంతపూరం, ప్రకాశం జిల్లాల్లో విస్తారంగా సాగు చేస్తున్నారు. అయితే ఈ మధ్య కాలంలో చీడ పీడలు కారణంగా మరియు యాజమాన్య లోపాల వల్ల బత్తాయి, నిమ్మ తోటలు విపరీతంగా క్షీణిస్తున్నాయి. అంతేకాకుండా కాయల్లో నాణ్యత లేక మార్కెట్లో గిట్టుబాట్టు ధర లేక నష్టపోవడం జరుగుతూ ఉంది. కావున ఈ చీడ పిడలను సరైన సమయంలో గుర్తించి సరైన యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే అధిక దిగుబడులు పొందవచ్చు.

**ఆకు ముడుత :** తల్లి పురుగు చిన్న రెక్కలు కలిగి తెల్లగా ఉండి లేత ఆకుల పై గ్రుడ్డు పెడుతుంది. గ్రుడ్డు నుండి అతిచిన్న పురుగులు వెలువడి నర్సరీ దశ నుండి పెద్ద చెట్ల దశ వరకు, వర్షాకాలం మరియు శీతాకాలంలో లేత చిగుర్లపై ఎక్కువగా ఆశిస్తుంది. ఆశించిన ఆకు పై తెల్లటి పొరలు వంకర టింకరగా ఏర్పడి, ఆకు ముడుతలు పడి, గజ్జి తెగులు ఎక్కువగా వచ్చి ఆకులు రాలిపోతాయి. డిసెంబరు, జనవరి, జూన్, జూలై, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో బత్తాయి, నిమ్మ చెట్లలో లేత చిగురు వచ్చే సమయంలో అకు ముడత ఎక్కువగా ఆశించి నష్టం కలుగజేస్తుంది.

**నివారణ :** ఈ పురుగు గమనించిన వెంటనే వేపనూనె 10,000 పి.పి.యం. 5 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి కొనసాగినపుడు ప్రొఫెనోఫాస్ 50 ఇ.సి 2 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 17.8 ఎస్.ఎల్. 0.5 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 25 డబ్ల్యు.జి. 0.3 గ్రా ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పైన చెప్పిన పురుగు మందులలో ఏదో ఒక దానిని వేపనూనె పిచికారీ చేసిన 7 రోజుల తరువాత పిచికారీ చేసినట్లయితే పురుగు ఉధృతి తగ్గుతుంది. సమర్ధవంతమైన పురుగు నివారణ కోసం కొత్త చిగురు వచ్చినపుడు పురుగు మందులను పిచికారీ చేయాలి.

**ఆకు తినే గొంగళి పురుగు (సీతాకోక చిలుక) :** గొంగళి పురుగులు గ్రుడ్డు నుండి వెలువడిన వెంటనే లేత చిగుర్లపై ఆశించి నష్టం కలిగిస్తాయి. ప్రారంభ దశలో నల్లగా ఉండి, తెల్లని చారలు కలిగి ఉండి, పక్షుల రెట్ట మాదిరిగా కనిపిస్తాయి. లేత ఆకులను బాగా తింటూ గొంగళి పురుగులు ముదురు ఆకుపచ్చ రంగుకు మారి ఆ తరువాత నిద్రావస్థకు చేరి, కొన్ని రోజులకు వీటి నుండి సీతాకోక చిలుకలు వెలువడుతాయి. లేత ఆకుల పై చిన్న చిన్న రంధ్రాలు ఉన్నప్పుడు ఈ గొంగళి పురుగులు ఆశించినవని తెలుసుకోవచ్చు. జూలై నుండి ఫిబ్రవరి వరకు ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది.

**నివారణ :** పురుగులను ఏరివేసి నాశనం చేయాలి. తోటలో పురుగులను గమనించినట్లయితే బాసిల్లస్ తురెంజెనిసిస్ అనే ఎంటమోపాథోజన్ బాక్టీరియాను ఉపయోగించి వాటి ఉధృతిని తగ్గించాలి. ఈ బాక్టీరియా మందును ఒక లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ఈ బాక్టీరియా హాల్ట్ లేదా డైపెల్



లేదా డెల్ ఫిన్ అనే పేరుతో మార్కెట్ లో లభిస్తుంది. ఈ బాక్టీరియా పురుగు మందును 1 మి.లీ. లేదా 1 గ్రా. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఈ పురుగు ఉధృతి కొనసాగినట్లయితే ప్రోఫెనోఫాస్ 50 ఇ.సి. ఏ 2 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**నల్లి పురుగులు :** చీని, నిమ్మలకు రెండు రకాల నల్లులు ఆశించి నష్టాన్ని కలిగిస్తాయి. ఇవి ఆకుపచ్చ నల్లి, మంగు నల్లి మొక్క ఆకుల నుండి, కాయలనుండి రసాన్ని పీల్చడం వల్ల తెల్లని చిన్న చిన్న మచ్చులు ఏర్పడి, కాయ పరిమాణం తగ్గిపోతుంది. మంగు నల్లి కాయల పై మాత్రమే ఆశించి రసం పీల్చడం వల్ల ముదురు గోధుమ రంగు మచ్చులు ఏర్పడి తోలు గట్టిగాను, పెళుసుగాను ఉండి మంగు కాయలుగా తయారవుతాయి. ఇలాంటి కాయలకు మార్కెట్లో ధర బాగా తగ్గిపోతుంది.

**నివారణ:** ఆకుపచ్చనల్లి నివారణకు 3గ్రా. నీటిలో కరిగే గంధకం లేక 1 మి.లీ. లేదా ప్రోపార్ గైట్ లేదా ఇథియాన్ 1 మి.లీ. లేదా ఫెన్జాక్విన్ 1 మి.లీ. లేదా స్పైరోమెసిఫిన్ 0.8 మి.లీ. లీటరు నీటికి కలిపి 10 రోజులు వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. మంగు నల్లి నివారణకు పైన తెలిపిన మందులను కాయ బాఠాణి గింజ పరిమాణంలో ఉన్నప్పుడు ఒక్కసారి, గోళికాయ దశలో ఉన్నప్పుడు రెండోసారి, ఆ తరువాత నెల రోజుల వ్యవధిలో మూడవ సారి మందులను మార్చి, మార్చి పిచికారీ చేసి సమర్ధవంతంగా నివారించుకోవచ్చు.

**యూరియా సిఫారసుకు మించి వాడితే కలిగే నష్టాలపై రైతులు అవగాహన పెంచుకోవాలి.**

**“సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి”**

**పేను, ఎగిరే పేను :** లేత ఆకులు, పూతపై ఆశించి రసాన్ని పీల్చడం జరుగుతుంది. పేనుబంక "ట్రిస్టిజా" అనే వెర్రి తెగులును, ఎగిరే పేను (సిల్లిడ్స్) "శంకుతెగులు"ను వ్యాప్తిజేస్తాయి.

**నివారణ :** డైమిథోయేట్ 30 ఇ.సి. 2 మి.లీ లేదా ఇమిడాక్లోరోప్రిడ్ 17.85 ఎస్.ఎల్. 0.4 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 25 డబ్ల్యు.జి 0.3 గ్రా లేదా అసిటామిప్రిడ్ 20 ఎస్.పి 0.2 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**గమనిక :** మొదటి పిచికారీలో తప్పకుండా వేపకు సంబంధించిన మందులను వాడాలి. రెండవ పిచికారీ వేపనూనె పిచికారీ చేసిన 7 రోజుల తరువాత పైన చెప్పిన పురుగు మందులలో ఎదో ఒకటి పిచికారీ చేసినట్లయితే ఈ పురుగుని సమర్ధవంతంగా నివారించుకోవచ్చు.



**బంక తెగులు :** ఫైటోఫ్తోరా బంక తెగులు వల్ల ధారాళంగా బంక కారడం, బెరడు కుళ్ళడం జరిగి, ఈ తెగులు చెట్టు వేర్లకు, మొదలు క్రింద భాగానికి పరిమితమై ఉంటుంది. డిప్లోడియా బంక తెగులు వల్ల చెట్టు మొదలు పైభాగాన, ముఖ్యంగా కొమ్మల పంగల్లో బంక కారడం, బెరడు కుళ్ళడం జరుగుతుంది. నీరు త్వరగా ఇంకని భూముల్లోను, చెట్టు మొదళ్ళకు నీరు పదే పదే తగలటం వల్ల, బంక తెగులు చెట్ల కాండం పై ఆశిస్తుంది. తెగులు ఆశించినపుడు చెట్టు మొద్దలు పై బెరడు కుళ్ళి బంక కారుతుంది. బంక తెగులు వల్ల కొమ్మలు ఎండటం, చెట్టు క్షీణించటం జరుగుతుంది.

**నివారణ :** బంక తెగులు నివారణకు నీరు త్వరగా ఇంకిపోగల పొలాల్లో మొక్కలు నాటాలి. చెట్టు చుట్టూ పిల్ల పాదుకట్టి, నీరు మొదలుకు తగలకుండా చూడాలి. పిల్ల పాదు, చెట్టు మొదలు నుండి, 1.5 అడుగుల దూరంలో ఉండాలి. బంకకారి కుళ్ళిన బెరడును పూర్తిగా గోకి బోర్డోపేస్టు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ పేస్టు లేదా మాంకోజెబ్ పేస్టు పూయాలి. క్రమం తప్పక, ముందు జాగ్రత్తగా, బోర్డోపేస్టు మొదళ్ళకు పట్టించాలి. కొమ్మలపై వచ్చే బంక తెగులు నివారణకు లీటరు నీటికి కార్బెండిజిమ్ 1 గ్రా. కలిపి చెట్టుపై 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. మాంకోజెబ్ 3గ్రా. లీటరు నీటికి కలిపిన మందు ద్రావణం చెట్టు పాదులో పోయాలి

**వేరు కుళ్ళు తెగులు :** ఈ తెగులు వల్ల వేర్లు కుళ్ళి, పోషక పదార్థాలు, నీరు చెట్టుకు అందకుండా చెట్టు ఎండిపోతాయి. వేర్లు పరీక్షిస్తే కుళ్ళిన వాసన గమనించవచ్చు. తెగులు సోకిన చెట్టు విపరీతంగా పూత పట్టి, కాయలు ముదిరేలోగా చెట్టు వాడి ఎండిపోతాయి.

**నివారణ:** రంగపూర్ నిమ్మ మీద అంటుకట్టిన మొక్కలను నాటటం శ్రేయస్కరం. తెగులు సోకిన చెట్లుకు, నీరు పెట్టిన మరుసటి రోజే 1% బోర్డోమిశ్రమం లేదా 0.2 % కార్బెండిజిమ్ 2 గ్రా/ లీ నీటికి మందు ద్రావణం 20లీ. పాది అంతా పోయాలి. వేరు కుళ్ళు తొలి లక్షణాలు సాధారణంగా ఎండాకాలంలో కనిపిస్తాయి. తెగులు సోకిన చెట్ల పాదుల్లో ఏదో ఒక వ్యవసాయ వ్యర్థపదార్థాలు (వరి పొట్టు, వేరుశనగ పొట్టు, ఎండిరాలిన ఆకులు, మినుము/పెసర పొట్టు, రంపపు పొట్టు) భూకవచంలా 2-3 అంగుళముల మందంగా వేయాలి. వర్షాలు మొదలైన తరువాత (ఆగష్టు - సెప్టెంబరు), పచ్చి ఆకు ఎరువులు - వేపాకు, జనుము, పిల్లి పెసర, గంజాకు, నల్లేరు, తంగేడు, పాదులోని మట్టితీసి, ఆకులను పరచి, వాటిపై సింగల్ సూపర్ ఫాస్ఫేట్ చెట్టుకి ఒక కిలో చొప్పున పచ్చి ఆకుపై చల్లి, తీసిన మట్టిని మరలా కప్పాలి. పచ్చిరొట్ట వలన భూమిలోని సూక్ష్మజీవులు ముఖ్యంగా ట్రైకోడెర్మా సంఖ్య పెరిగి జీవనియంత్రణ పద్ధతుల ద్వారా తెగులు అరికట్టబడుతుంది.



ట్రైకోడెర్మా పొడి మందు 1 కిలో, 90 కిలోల బాగా చివికిన పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి 15 రోజులు మగ్గబెట్టి, చెట్టుకి 10 కిలోల పాదిలో వేసి కలియబెట్టాలి. మరలా 6 నెలల తరువాత ఇదే విధంగా చేయాలి. ఆరోగ్యంగా ఉన్న చెట్లకు ఈ మిశ్రమాన్ని ప్రతి సంవత్సరం 5 కిలోల చొప్పున వేస్తే తెగులు రాకుండా ఉంటుంది. తెగులు సోకిన చెట్లకు నీరు పెట్టిన మరుసటి రోజే మా%శీ%కోజెబ్ 2గ్రా. లీటరు నీటికి కలిపి 25 లీటర్ల మందు ద్రావణం పాదుల్లో పోయాలి. 25 రోజులు తరువాత ట్రైకోడెర్మా రెస్సి100 గ్రా. సుడోమోనాస్ ఫ్లోరిసెన్స్ 100గ్రా. 2 కిలోల వేపపిండి, 25 కిలోల పశువుల ఎరువుతో కలిపి పాదుల్లో జూన్-జూలై మరియు డిసెంబరు - జనవరి నెలల్లో వేయాలి.

**గజ్జి తెగులు :** నిమ్మ పై ఎక్కువగా గమనించవచ్చు. లేత ఆకుల పై, చిన్న కొమ్మల పై, కాయలమీద, ముళ్ళమీద, పెద్ద కొమ్మలమీద, కాండం మీద చివరకు ఒక్కొక్కసారి వేరు పై ఈ మచ్చలు సోకి నష్టం కలిగిస్తాయి. తెగులు ముదిరిన దశలో చెట్టు ఎండిపోతాయి. తెగులు సోకిన చెట్లపై ఎండు పుల్ల ఎక్కువగా కనిపిస్తుంది.

**నివారణ:** ఈ తెగులు నివారణకు గజ్జిని తట్టుకొనే "బాలాజి" నిమ్మ రకం నాటుకోవాలి. తెగులు సోకిన కొమ్మలు కత్తిరించి స్ట్రెప్టోసైక్లిన్ 1 గ్రా. మరియు బ్లైటాక్స్ 30 గ్రా. 10 లీటర్ల నీరు వంతున కలిపి 20 రోజుల వ్యవధిలో, వర్షాకాలంలో 2-3 సార్లు పిచికారీ చేయాలి. చెట్ల మొదళ్ళ పైన, పెద్దకొమ్మల పైనా గజ్జి తెగులు ఉంటే, తెగులు ఉన్న బెరడును కత్తితో గోకి బోర్డోపేస్టు పూయాలి.

---

**కె. నీలిమ,** యువ నిపుణులు (బయోటెక్ కిసాన్ హబ్ ), **టి.స్వామి చైతన్య,** శాస్త్రవేత్త (వాతావరణవిభాగం), **పి. నాగిరెడ్డి,** శాస్త్రవేత్త (ఉద్యానవిభాగం), **డా. ఎ. వీరయ్య,** ప్రోగ్రాం కో ఆర్డినేటర్, కే.వి.కే ఊటుకూరు, కడప

"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

# తక్కువ పెట్టుబడి.. సపోటా సాగుతో రాబడి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సపోట సుమారుగా 25,125 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయబడుతూ 1,31,464 టన్నుల ఉత్పత్తి నిస్తున్నది. ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, గుంటూరు, తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాల్లో అధికంగా సాగు చేయబడుతున్నది. ఈ పంటను ఆశించే తెగుళ్ళు, చీడలు తక్కువ కాబట్టి తోటలను తక్కువ పెట్టుబడితో పెంచి ఎక్కువ లాభాలను గడించవచ్చు. నీటి ఎద్దడిని తట్టుకొంటుంది. కాబట్టి వర్షాధార పంటగా అనువైనది. గాలిలో తేమ ఎక్కువగా ఉండే సముద్ర తీర ప్రాంతాల్లో దిగుబడి ఎక్కువగా ఉంటుంది. తేలిక నేలల్లో త్వరగా ఎదిగి మంచి ఫలసాయాన్ని ఇస్తుంది. కనుక భూములు, అధిక చౌడు ఉన్న నేలలు, ఉప్పు నేలలు కూడా నాటడానికి పనికి వస్తాయి. ఉదజని సూచిక మామూలు కన్నా ఎక్కువ (8.5 - 9.0) ఉన్న భూములు కూడా అనుకూలం. నీటి ఎద్దడిని తట్టుకునే స్వభావం ఉండటం వలన కొంద ప్రాంతాలు, లోతు తక్కువ నేలల్లో కూడా సాగు చేయవచ్చు.

**సపోటాలో వివిధ రకాలు :** ముఖ్యంగా పాల, క్రికెట్ బాల్, ద్వారపూడి, కీర్తిబర్తి, కాలిపత్త, ఓ.కె.యం-1, ఓ.కె.యం.-3, డిహెచ్‌యస్-1 వంటి రకాలు అధిక దిగుబడి నిస్తాయి. సింగపూర్, విరుధీనగర్, తగరంపూడి, గుత్తి, గవరయ్య వంటి రకాలు కూడా సాగుకు అనుకూలం. సపోటాను నాటిన తరువాత 50-60 సం.ల వరకు పంటనిస్తుంది. కాబట్టి సరైన రకాన్ని ఎంపిక చేసుకొని తరువాత కాలంలో అధిక దిగుబడులు పొందాలి.

**వ్యాప్తి :** కొమ్మంటు పద్ధతి ద్వారా ప్రవర్ధనం చేయబడిన అంటు మొక్కలను ఎంపిక చేసుకోవాలి. ఏడాది నుండి రెండు సంవత్సరముల వయస్సు ఉండే అంట్లను ఎంపిక చేసుకోవాలి. ఎక్కువ వయస్సు గల అంటు మొక్కలను సాధ్యమైనంత వరకు నాటరాదు. వీటి వేరు వ్యవస్థ గుండ్రంగా చుట్టుకొనిపోయి పొలంలో నిలదొక్కుకొనుటకు ఎక్కువ సమయం తీసుకొంటాయి.

**నాటటం :** జూలై నుండి ఫిబ్రవరి వరకు నాటుటకు అనుకూలం. ఎంపిక చేసిన రకాన్ని 10.0 × 10.0 మీటర్ల దూరంలో ఎకరానికి 40 మొక్కల చొ॥న నాటుకోవాలి. అధిక సాంద్ర పద్ధతిలో 5 × 5 మీటర్ల దూరంలో ఎకరాకు 160 మొక్కల చొప్పున నాటినట్లయితే 15 సంవత్సరముల వరకు అధిక దిగుబడిని తీసుకొని తరువాత ప్రతి రెండవ మొక్కను తీసివేసి ఎకరాకు 40 మొక్కలను ఉంచుకోవాలి. నాటడానికి 1×1×1 మీ. గుంతలను తీసి, తవ్విన మట్టిన 30 కిలోల బాగా చివికిన పశువుల ఎరువు, 2 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 200 గ్రా. 2 శాతం మిథైల్ పెరాథియాన్ (ఫాలిడాల్) పొడి మందు కలిపి గుంతలను నింపాలి. గుంతలను నింపేటపుడు ఒక అడుగు లోతున 10-15 కిలోల కొబ్బరి పొట్టు పోయాలి. కొబ్బరి పొట్టు వేసవిలో ఎక్కువ నీరు నిల్వ చేసుకొని, మొక్కలకు నీటి ఎద్దడి రానివ్వదు మరియు కుళ్ళిన తర్వాత మంచి సేంద్రీయ ఎరువుగా మారి చెట్టుకు ఉపకరిస్తుంది. అంట్లను గుంత మధ్యలో ఉంచి, అంటు భాగం భూమిపైకి ఉండే విధంగా నాటుకోవాలి. నాటిన మొక్కలకు పాదులు చేసి, నీరుపోసి మొక్కలు గాలికి ఒరిగిపోకుండా కర్రపాతి ఊతం ఇవ్వాలి. వేరు మూలం నుండి పెరిగే పక్క కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించాలి.

**ఎరువులు :** తొలకరిలో తోటలను ఇరువైపులా దుక్కి దున్ని, చెట్లకు పాదులు చేసి ఎరువులను వేయాలి. ప్రతి చెట్టుకు సూచించబడిన మోతాదులో ఎరువులను చెట్టు చుట్టూ 1.5 మీ. దూరంలో పాదంతా సమంగా వేసి, మట్టిలో కలిపి, ఎరువులు కరుగుటకు సరిపడేంత తేలికపాటి తడి మాత్రమే ఇవ్వాలి. ప్రతి

**వరి పంటకు నత్రజని మూడు దశలలో నాట్లు వేసేటపుడు పిలకలు వేసే దశలో చిరు పొట్ట దశలో**

చెట్టుకు మొదటి సంవత్సరములో నత్రజనిని యూరియా రూపములో 110 గ్రాములు, భాస్వరమును సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపములో మరియు పొటాష్‌ను మ్యురేట్ ఆఫ్ పోటాష్ రూపములలో ప్రతి చెట్టుకు 125 గ్రాములు వేయాలి. ఈ ఎరువుల మోతాదును చెట్టు 10 సంవత్సరముల వయస్సు వచ్చే వరకు ప్రతి 3 సంవత్సరములకు రెట్టింపు చేయాలి. చివికిన పశువుల ఎరువును కూడా మొదటి సంవత్సరములో చెట్టుకు 25 కిలోల చొప్పున వేయాలి. మూడు సంవత్సరముల తరువాత ఈ మోతాదు రెట్టింపు చేయాలి. సూక్ష్మజీవుల లోపములను నివారించుటకు

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

ఇనుప ధాతు లోపం ఉన్న చెట్లకు 2 గ్రా. ఫెర్రస్ సల్ఫేట్ మరియు 1 గ్రా. నిమ్మ ఉప్పు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**నీటి యాజమాన్యం :** సపోట చెట్లు నీటి ఎద్దడిని ఎక్కువగా తట్టుకుంటాయి. మొక్కలు నాటిన రెండు సంవత్సరాల వరకు వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ప్రతి 15 రోజులకొకసారి తడి ఇవ్వాలి. ఎదిగిన చెట్లకు, వేసవిలో 30 రోజుల కొకసారి తడి ఇవ్వాలి. డ్రిప్ పద్ధతిలో నీరు ఇచ్చినట్లయితే ప్రతి చెట్టుకు వాతావరణాన్ని బట్టి 60-100 లీ. నీటిని ప్రతి రోజు ఇవ్వాలి.

**కలుపు యాజమాన్యము :** తొలకరిలో నేలను దున్ని పాదుల్లో, ఖాళీగా ఉన్న భూమిలో పచ్చిరొట్ట పైర్లు వేసి 45 రోజుల తరువాత భూమిలో కలియదున్నటం వలన కలుపు నిర్మూలన, భూమి సారవంతమవడమే కాకుండా నీటి నిల్వ సామర్థ్యం కూడా పెరుగుతుంది. తరువాత అవసరమైతే 1 లేక 2 సార్లు నేలను దున్నటం ద్వారా కలుపును నిర్మూలించవచ్చు. లేత తోటల్లో, కాపునకు వచ్చిన తోటల్లో వేరుశనగ, అపరాలు, కాయగూరలు సాగు చేసి ఆదాయాన్ని పెంచుకోవచ్చు. గడ్డి జాతి కలుపు మొక్కల నివారణకు గ్లైఫోసేట్ కలుపు మందును లీటరు నీటికి 5 నుండి 8 మి.లీ. చొప్పున పిచికారి చేయాలి.

**కొమ్మల కత్తిరింపు :** సపోటాలో ప్రత్యేకంగా కొమ్మల కత్తిరింపులు అవసరం లేదు. ఎదిగే మొక్కలకు 3 అడుగుల లోపు ప్రధాన కాండం మీద ఉన్న కొమ్మలను తొలగించి ఆ తరువాత 4-5 కొమ్మలను ఉంచితే చాలు. ప్రతి సంవత్సరం ఎండిన కొమ్మలను, లోపలి భాగంలో గుబురుగా పెరిగిన కొమ్మలను, నేలను తాకే క్రింది కొమ్మలను తొలగించాలి.

**పంట కోత, దిగుబడి :** నాలుగేళ్ళ వరకు పూతను తొలగించి 5 లేక 6వ ఏట నుండి కాయలను కోయవచ్చు. ముదరని కాయలను కోయడం వలన సరిగా పండవు. అందువలన పక్వానికి వచ్చిన కాయలనే కోయాలి. కాయలను ఒకసారి కోంవరి **పంటకు నత్రజని మూడు దశలలో నాట్లు వేసేటపుడు పిలకలు వేసే దశలో చిరు పొట్ట దశలో**కుండా 3-4 కోతల్లో కాయలు కోడంమంచిది. పక్వానికి వచ్చిన కాయలపై ఉన్న పొట్టు వంటి పదార్థం రాలిపోయి కాయలు బంగాళాదుంపల వలె కనపడతాయి. అటువంటి కాయల చర్మాన్ని గోకినపుడు కంద పైభాగం ఆకుపచ్చగా కాకుండా పసుపు పచ్చ రంగులో ఉంటుంది. పక్వానికి వచ్చిన కాయల చివర నున్న సన్నటి ముల్లు చేతితో తాకగానే ఊడిపోతుంది. ఈ కాయలను కోసినపుడు తక్కువ పాలు కారతాయి. ఈ విధంగా పక్వత దశను సరిచూసుకొని కాయలను కోసుకోవాలి. కాయలను తొడిమతో సహా కోయాలి. కోసిన కాయలను నీడలో ఉంచాలి. కోత అనంతరం సరియైన జాగ్రత్త పాటించనట్లయితే కాయలు నిలువ వుంచినపుడు కుళ్ళిపోయే ప్రమాదం ఉంది. పండిన సపోటాలను రవాణా చేయడం కష్టం కనుక పక్వానికి వచ్చిన కాయలను కోసి,



రవాణా చేయడానికి ముందు 1000 పి.పి.యం ఎథ్రెల్ (1 మి.లీ./ లీటరు నీటికి) ద్రావణంలో ముంచడం గాని, కాయలపై పిచికారి చేయడం గాని చేయాలి. ఈ విధంగా చేయడం వలన కాయలు 4 రోజులలో పండుతాయి.

**గింజను తొలిచే పురుగు :** ఈ పురుగు కంద ద్వారా సొరంగం మాదిరిగా చేసి గింజను తినడం వలన కంద సరిగా పండక మార్కెట్టుకు పనికిరాదు. గొంగళి పురుగు కాయలో చేసిన రంధ్రం ద్వారా శిలీంద్రము, బాక్టీరియా ఆశించే అవకాశం ఉంటుంది. కాయ గోళీకాయ పరిమాణం నుండి నిమ్మకాయ పరిమాణం ఉన్నప్పుడు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. నివారణకు కోత అనంతరం మిగిలిపోయిన కాయలను ఏరి నాశనం చేయాలి. పంట కాలంలో దీపపు ఎరలను ఏర్పాటు చేసి రెక్కల పురుగులను నాశనం చేయాలి. కాయ చిన్న సైజులో ఉన్నపుడు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా బి.టి. మందు 2 గ్రా. లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

**తెగుళ్ళు :**

**ఆకుమచ్చ :** ఈ తెగులు అక్టోబరు నుండి డిసెంబరు మాసం వరకు తేమ అధికంగా ఉండే సందర్భాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. చిన్న, చిన్న వలయాకారపు మచ్చలు తెల్లని మధ్యభాగం, గులాబి రంగు లేదా ఎరుపు గోధుమ రంగు అంచులతో ఏర్పడతాయి. మచ్చలు ఆకులకు రెండు వైపులా ఏర్పడతాయి. మచ్చలు ఎక్కువగా ఏర్పడినపుడు ఆకులు రాలి దిగుబడి తగ్గుతుంది. దీని నివారణకు 3.0 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**చెక్క తెగులు లేదా ఫ్లాట్ లింబ్ :** తెగులు సోకిన కొమ్మలు వెడల్పుగా మారి వంకరలు తిరిగి సర్పాకృతిలో ఉంటాయి. ఆకులు సన్నగా, పసుపు రంగులో గుబురుగా కనిపిస్తాయి. కాయలు చిన్నవిగా ఉండగానే ఎండిపోతాయి. తెగులు తీవ్ర దశలో ఆకులు రాలి కొమ్మలు ఎండిన చెక్కలాగా కనబడతాయి. తెగులు సోకిన కొమ్మలను కత్తిరించి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2.5 గ్రా. మాంకోజెబ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.


**డా. పి. సుధా జాకబ్,** సీనియర్ శాస్త్రవేత్త,
**డా. కె. ఝాన్సీ,** ప్రోగ్రాం కోఆర్డినేటర్,
కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటశాల




**"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."**

# పంట ఉత్పత్తులలో అఫ్లటాక్సిన్లు తెలుసుకోవడం ఇలా..!




రాపిడ్ టెస్టింగ్ కిట్స్ అనే పదం ఈ మధ్య బాగా సుపరిచితం అయ్యిందే. అదే... కరోనా వచ్చాక ఈ కిట్స్ వ్యాధి నిర్ధారణకు చాలా ఉపయోగకరంగా అయ్యాయి. వీటి ప్రత్యేకత ఏంటంటే కేవలం పది నుంచి ఇరవై నిముషాలలోనే పరీక్ష ఫలితం తెలిసిపోవడం. వాస్తవానికి ఈ టెక్నాలజీ కొత్తదేమీ కాదు. గర్భధారణ పరీక్ష నుంచి హెచ్.ఐ.వి. పరీక్ష వరకు అన్నిటికీ వాడుతూ ఉన్నదే.. మరి కొత్తదనం ఏంటంటే.. ఇదే టెక్నాలజీని కొంత అభివృద్ధి పరచి కరోనా ఉందో లేదో నిముషాల వ్యవధిలో తెలుసుకోవచ్చు. వీటిలో ఉండే సదుపాయం పి.సి.ఆర్. లాంటి పరీక్షలతో పోలిస్తే ఖర్చు చాలా వరకు తగ్గడమే కాక, ఎవరికి వారే పరీక్ష చేసుకోగలిగేంత సులభంగా ఏ ప్రదేశంలో ఐనా సరే ఆపరేట్ చేసుకోవచ్చు. అందుకే అన్ని చోట్ల వీటిని బాగా వాడేస్తున్నారు.

వ్యవసాయానికి సమాచార మాసపత్రికలో ఈ కరోనా గురించి ఏంటబ్బా అనుకుంటున్నారా..? ఇక్కడే ఉంది విషయం. మన వ్యవసాయ ఉత్పత్తుల్లో గానీ, ఆహార పదార్థాలలో కానీ అఫ్లటాక్సిన్ల ఉనికి అనేది ఒక పెద్ద సమస్య. ఇవి ఉన్నటువంటి ఆహారాన్ని తీసుకుంటే కొన్ని ఆరోగ్య సమస్యలు, మరికొన్ని సార్లు క్యాన్సర్‌కు దారితీయటం వంటి విపరీత పరిణామాలు సంభవిస్తాయి. ఏ పంట ఉత్పత్తి ఐనా సరే వేరే దేశాలకు ఎగుమతి చేయాలంటఇాగే మాత్రం ఈ అఫ్లటాక్సిన్ల టెస్ట్ చేయనిదే పంపే అవకాశం లేదు. ఎగుమతి సంగతి సరే, మనం తినే శుద్ధి చేసిన ఆహార పదార్థాలలో ఇవి ఉన్నాయా అని టెస్ట్ చేయాలన్నా ఇంచుమించుగా కరోనా పరీక్ష లాంటి కష్టాలే. పరీక్ష ఎక్కడ పడితే అక్కడ చేయరు. ఎన్.ఎ.బి.ఎల్. గుర్తింపు పొందిన ప్రయోగ శాలలో కొన్ని చోట్లే చేస్తారు. ఒక్కో శాంపిల్‌కి సుమారుగా రూ.2500 నుంచి 3000 వరకు తీసుకుంటఇాగారు. పరీక్ష ఫలితం రావడానికి మూడు రోజుల వరకుఎదురు చూడాల్సిన రావడం.

ఇలాంటి సమస్యలన్నిటినీ అధిగమించి కేవలం 20 నిముషాలలో అఫ్లటాక్సిన్ల ఉనికిని గుర్తించే ఒక లాటరల్ ఫ్లో డివైస్‌ని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ కేంద్రం శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. ఇది నానో టెక్నాలజీ మరియు బయో టెక్నాలజీలతో రూపొందించబడిన ఒక అధునాతన పరికరం దీని ధర కూడా చాలా తక్కువ. ఇది పూర్తిగా మన దేశంలోనే తయారుచేయబడిన, మరియు అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు చక్కగా పనిచేసే మొట్టమొదటి ఆవిష్కరణ. దీనిలో అఫ్లటాక్సిన్లను గుర్తించడానికి పట్టే సమయం 20 నిముషాలు. దీనిలో 10 పి.పి.బి. లిమిట్ మించి అఫ్లటాక్సిన్ ఉందో లేదో దానిపై వచ్చే రంగు గీతాలను చూసి చెప్పవచ్చును. ముందుగా ఈ అఫ్లటాక్సిన్ల గురించి, వాటి వల్ల కలిగే నష్టాల గురించి తెలుసుకుందాం.

## అఫ్లటాక్సిన్లంటే ఏంటి :

వివిధ రకాలైన పంట ఉత్పత్తులు ముఖ్యంగా కోత అనంతరం వాటిని ఆరబెట్టే క్రమంలోగానీ, నిల్వ చేసేటప్పుడుగానీ సరియైన పరిస్థితులు లేనప్పుడు అస్పర్జిల్లస్ ఫ్లేవస్, అస్పర్జిల్లస్ పారిసిటికస్ వంటి శిలీంధ్రాలు వీటిపై చేరి, అభివృద్ధి చెందినప్పుడు కొన్ని సెకండరీ మెటబొలైట్స్‌ని వదలిపెడతాయి. అవే ఈ అఫ్లటాక్సిన్స్. వాటికి ఈ పేరు అస్పర్జిల్లస్ ఫ్లేవస్‌లోని రెండు పదాలలోని మొదటి పేర్లని కలపడం వల్ల అలా పిలుస్తారు. వీటిలో చాలా రకాలున్నాయి. అయితే AFB1, B2, G1, G2 మరియు AFM1, M2 అనేవి ముఖ్యమైనవి. వీటిలో AFB1 అనేది అధికంగా అంటే 75 శాతం వరకు ఉంటుంది. M1,M2 అనేవి B1,B2 లు రూపాంతరం చెందినప్పుడు ఏర్పడతాయి.

దాదాపుగా అన్ని రకాల పంటల ఉత్పత్తుల్లోనూ ఇవి చేరే అవకాశం ఉన్నప్పటికీ ముఖ్యంగా మొక్కజొన్న, మిరప, పసుపు, వేరువనగ, సన్‌ఫ్లవర్ మొదలగు వాటిలో వీటి వల్ల కలిగిన నష్టం బాగా ఎక్కువ. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రతి సంవత్సరం 25 శాతం ఆహార ధాన్యాలు అఫ్లటాక్సిన్స్ వలన తిరస్కరించబడుతున్నాయని తెలియచేసారు. వీటివలన కేవలం పంట దిగుబడే కాదు, నాణ్యత కూడా దెబ్బతింటుంది.

ఇక ఇవి తీసుకుంటే, కలిగే నష్టాలేమిటంటే దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడతారు. ముఖ్యంగా లివర్ మరియు కిడ్నీకి సంబంధించిన క్యాన్సర్‌ని కలిగిస్తాయి. ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్

"చీడపీడలపై మీ సందేహాలను 8331056028 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

కండక్టింగ్ రీసెర్చి ఆన్ కేన్సర్ (IARC) వారు 1960 సంవత్సరంలో అఫ్లటాక్సిన్‌లని గ్రూప్ 1 మ్యూటాజెన్‌గా, క్యాన్సర్ కలిగించే కారకంగా పేర్కొన్నారు.

మనం తీసుకునే ఆహారంలో కొంత పరిమితి వరకు ఈ అఫ్లటాక్సిన్స్ ఉన్నా ఇబ్బంది ఉండదు. ఇది ఎంత అంటే ఆహార ధాన్యాలలో 1ppb/kg వరకు, అలానే పాలు, పాల పదార్థాలలో

**యూరియాను సిఫారసుకు మించి అధికంగా వాడకూడదు**

0.5ppb/kg వరకు. కానీ మన దేశంలో తీసుకోబడే కొన్ని ఆహార పదార్థాలలో ఇవి 70-100ppb వరకు ఉంటున్నట్టుగా కొన్ని గణాంకాలు తెలియజేస్తున్నాయి. పాలలో వీటి పరిమాణం 20ppb మించినప్పుడు ఇవి ప్రాణాంతకంగా మారతాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు చాలా ఇబ్బందులకు గురి అవుతారు. వీరిలో సరియైన ఎదుగుదల లేకపోవడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గి పోవడం వంటి సమస్యలకు గురి అవుతారు. ఈ అఫ్లటాక్సిన్ల వల్ల జంతువులు కూడా అనారోగ్యానికి గురి అవుతాయి. కోళ్ళలో, గొర్రెలలో, మిగిలిన జంతువులలో పరిమితికి మించిన అఫ్లటిక్సిన్ ఉన్న ఆహారాన్ని తీసుకున్నట్లయితే వాటి గుడ్లు పెట్టే సామర్థ్యం తగ్గిపోతుంది. అలాగే బరువు పెరగవు, వ్యాధి నిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది.

ఆహార పదార్థాలను ఎగుమతి చేసేటప్పుడు అఫ్లటాక్సిన్స్‌లను పరీక్షించడం తప్పనిసరి. జపాన్, కొరియా దేశాలకు 10ppb వరకు పరిమితి ఉన్న ఆహార ధాన్యాలను అనుమతిస్తున్నారు. యూరోపియన్ దేశాలకు 20ppb వరకు పరిమితి అనుమతించబడినది. యూరోపియన్ దేశాలు కానటువంటి వాటన్నింటికి ఈ పరిమితి 15ppb గా ఉంది. ఈ అఫ్లటాక్సిన్స్ ఒక ఆమార పదార్థంలో ఉన్నవా లేదా అనేది కేవలం అధునాతనమైన లేబరేటరీలో పరీక్షించడం ద్వారా మాత్రమే తెలుసుకోగలుగుతాము. ఇవి అసాధారణమైన వేడిని తట్టుకుని ఉండే స్వభావం వల్ల ఆహారాన్ని వండుకోవడం లేదా శుభ్రపరచుకోవడం వలన సాధారణంగా తొలగిపోవు. ప్రస్తుతం GCMS-MS, HPCL వంటి అత్యంత సున్నితమయిన, ఖరీదైన పరికరాల సహాయంతో NABL గుర్తింపు గలిగిన పెద్ద ల్యాబరేటరీలలో మాత్రమే వీటి నిర్ధారణ చేయడంజరుగుతుంది.

## అఫ్లటాక్సిన్స్ చేరకుండా నివారించే ముందు జాగ్రత్త చర్యలు :

- పంటల కోత అనంతరం, వాటి ఉత్పత్తులని సరియైన తేమ శాతానికి వచ్చే వరకు ఆరబెట్టిన, ఎండబెట్టిన తరువాత మాత్రమే నిల్వ చేయాలి.
- పంట ఉత్పత్తుల్లో కనిపించిన తాలుకాయలు లేదా శిలీంధ్రాలు చేరినట్టుగా కనిపించిన వాటిని వెంటనే వేరు చేయడం. దీనివలన మిగిలినవి అఫ్లటాక్సిన్‌ల బారిన పడకుండా అరికట్టవచ్చు.
- కోత అనంతర నిర్వహణలో అశాస్త్రీయమైన పద్ధతులని వదిలిపెట్టి అందుబాటులో ఉన్న యంత్ర పరికరాల ద్వారా శుద్ధీకరణ మరియు నిల్వ చేయడం.
- కోత అనంతరం, పంట ఉత్పత్తులకు నేల కానీ, నీరు గానీ, మంచు గానీ దరి చేరకుండా జాగ్రత్త వహించడం.
- ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను కూడా వాటిపై ముద్రించిన గడువు తీరేలోపే వాడుకోవడం.
- కోల్డ్ స్టోరేజిలలో భద్రపరచిన ఆహార ధాన్యాలు అఫ్లటాక్సిన్‌ల బారిన పడకుండా ఉండాలంటే వాటిలో నిర్దేశించిన ఉష్ణోగ్రత ఎప్పుడూ ఉండేలా చూసుకోవడం.

**పరీక్ష ఫలితం :** ప్రతికూలం : C మరియు T స్థానంలో కలర్ బ్యాండ్ : అఫ్లాటాక్సిన్ నమూనాలో లేదు.

సానుకూలం : C స్థానంలో కలర్ బ్యాండ్ : అఫ్లాటాక్సిన్ నమూనాలో ఉంటుంది (≥10ppb)

చెల్లదు : C వద్ద కలర్ బ్యాండ్ కనిపించదు

చివరిగా చెప్పేదేమంటే ఈ అఫ్లటాక్సిన్ గురించి కొంత అవగాహనతో మెలగుదాం. తినేది, కొనేది, పండించిన ప్రతిదీ ఈ టాక్సిన్స్‌ను కలిగి ఉండవచ్చనే ఒక ఆలోచనతో జాగ్రత్త వహిద్దాం. దీర్ఘకాలిక వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకుందాం.

అందుబాటులో ఉన్న అదునాతన పరికరాలైన ఇలాంటి కిట్స్‌ని వాడుకుని పంట ఉత్పత్తుల ఎగుమతులను సులభతరం చేసుకోవచ్చును.



డి. సందీప్‌రాజా, ఎస్.వి.ఎస్. గోపాలస్వామి, వి. వాసుదేవరావు, బి.వి.ఎస్. ప్రసాద్, బాపట్ల వ్యవసాయ కళాశాల

**"చీడపీడలపై మీ సందేహాలను 8331056149 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."**

# అల్ల నేరేడుతో అధిక లాభాలు



నేరేడు పండు పోషకాల నెలవుగా అనేకమైన ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉంది.

రేడియోప్రొటెక్టివ్ గుణం, విత్తనాలలో ఉండడం వల్ల వారసత్వంగా మరియు రొమ్ము క్యాన్సర్ ప్రమాదం బారినపడకుండా నిరోధిస్తుంది. నేరేడు పండ్లు తినడం వలన, అధిక దాహం మరియు తరచూ మూత్ర విసర్జన వంటి మధుమేహ లక్షణాల నుండి ఉపశమనం పొందవచ్చును.

**రకాలు :** విడుదల కాబడిన అన్ని రకాల విత్తనపు మొక్కల నుండి ఎంపిక చేయబడినవి కావడం గమనార్హం.

**కొంకణ్ బహాడోలి :** కాయలు గుత్తులు గుత్తులుగా కాస్తూ కాయ బరువు 1-16 గ్రా. తీపి శాతం 16.0 బ్రిక్‌గా ఉంది. ఈ రకం మహారాష్ట్రలోని కె.వి.కె., దాపోలి నుండి విడుదల చేసారు.

**CISH-37 :** చెట్టు 12-15 మీ. ఎత్తు పెరుగుతుంది. కాయ కోలగా ఉండి, బరువు 24.05 గ్రా. ఉంది. 200-350 కిలోల/చెట్టుకి దిగుబడి వస్తుంది (45 సంవత్సరాలకి). తీపిశాతం 16.40 బ్రిక్‌గా ఉంది. జూన్ రెండవ వారంలో కోతకి వస్తుంది (మధ్యస్థ రకం). CISH, LUCKNOW నుండి విడుదల చేయడం జరిగింది.

**CISH-42 సీడ్ లెస్ రకము :** చెట్టు 10-11.5 మీ. ఎత్తు పెరుగుతుంది. కాయ గుండ్రంగా ఉండి, బరువు 6.82 గ్రా. ఉంది. 180-250 కిలోల/చెట్టుకి దిగుబడి వస్తుంది (65 సంవత్సరాలకి). తీపిశాతం 14.7 బ్రిక్‌గా ఉంది. జూన్ రెండవ వారంలో కోతకి వస్తుంది (మధ్యస్థ రకం). CISH, LUCKNOW నుండి విడుదల చేయడం జరిగింది.

**గోమా ప్రియాంక :** చెట్టు కొంచెం ఎత్తు తక్కువగా ఉండి, కాయ బరువు సుమారు 19.80, తీపిశాతం 16.86 బ్రిక్‌గా ఉంది. 44 కిలోల / చెట్టుకి దిగుబడి వస్తుంది (8 సంవత్సరాలకి). మే చివరికల్లా కాయ కోతకి వస్తుంది. (ఎర్లీరకం) CHES, GODHRA గుజరాత్ నుండి విడుదల చేయడం జరిగింది.

**AJG-85 :** కాయ బరువు 12-15 గ్రా. కర్ణాటకలోని అరబావి నుండి విడుదల చేయడం జరిగింది.

**వాతావరణం :** ఇండియాలో అల్లనేరేడు ఉష్ణ మండల మరియు ఉప ఉష్ణమండల ప్రాంతాల్లో పెరుగుతుంది. 300-500 మి.మీ. వర్షపాతం మరియు నీటి వసతి కలిగిన ప్రాంతాలు, ఈదురు గాలులు కలిగిన ప్రాంతాలు అనుకూలం. నీటి ఎద్దడిని కూడా తట్టుకుంటుంది. కాబట్టి వర్షాధార పంటగా అనుకూలమైనది. హిమాలయాలలో సముద్ర మట్టం నుంచి 1300 మీ. ఎత్తు వరకు, కుమావుయన్ కొండలలో 1600 మీ. ఎత్తు వరకు పెరుగుతాయి.

**నేలలు :** అన్ని రకాల నేలలు అనుకూలం, ఎర్రగరప, తేలికపాటి, మరియు నల్ల నేలలు, బరువైన నల్లరేగడి నేలల్లో కూడా సాగు చేయవచ్చు. నేల ఉదజని సూచిక 10.5 $p^H$ వరకు ఉన్న నేలల్లో కూడా సాగు చేయవచ్చు. క్షీణించిన భూములు, ఉప్పు, చౌడు భూములు మరియు 4-7 రోజులు నీరు నిల్వ ఉన్న నేలలు కూడా సాగుకు అనుకూలం.

**అంతర పంటలు :** చెట్లు నాటిన తర్వాత 3-4 సంవత్సరాల కాలం మొక్కల మధ్య ఖాళీ ప్రదేశంలో అంతర పంటలు వేయవచ్చు. ఈ ఖాళీ భాగంలో జనుము, పిల్లిపెసర చల్లి 45 రోజులు (పూత వచ్చే ముందు) రొటవెటర్‌తో దున్ని వేయడం వల్ల భూమిసారం పెరుగుతుంది. వేరుశనగ, అలసందలు, పెసలు, అండుకొర్రలు లాభసాటిగా వర్షాకాలంలో వేసుకోవచ్చు. నీటి వసతి ఉన్నవారు లోకల్ మార్కెట్ డిమాండ్‌ని బట్టి పంటలను వేసుకోవచ్చు. అంతర పంటలను కోసి, నేలను దున్నేటప్పుడు ట్రాక్టర్ వలన గాని నాగలి వలన గాని వేరుకు దెబ్బలు తగలకుండా చూడాలి. గడ్డి జాతి కలుపు నివారణకి గ్లైపోసేట్ కలుపు మందును లీటరు నీటికి 5 నుండి 8 మి.లీ. చొప్పున పిచికారి చెయ్యాలి.

**యూరియా ఎక్కువ వాడితే ధాన్యపు పైరుల్లో తాలు గింజలు ఎక్కువగా వస్తాయి.**

**నీటి యాజమాన్యం :** నీటి ఎద్దడిని తట్టుకొనే గుణం ఉంటుంది. కాబట్టి నీటి వసతి లేని ప్రాంతాలలో పెరుగుతుంది. లేత తోటలు, కొత్తగా నాటిన మొక్కలు ఎదగడానికి నీరు ఇవ్వాలి. లేత తోటలకి తక్కువలో తక్కువ 8-10 నీటి తడులు, ముదురు తోటలకి 4-5 నీటి తడులు ఇవ్వాలి. వర్షపు నీటిని వడిసి పట్టడానికి ఇంకుడు

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"



గుంతలు తీయాలి. డ్రిప్ పద్ధతిలో నీరు ఇవ్వడం వలన నీటిని ఆదా చేసుకోవచ్చు. నీరు ఇవ్వకుండా మొక్కలను సెప్టెంబర్-డిసెంబర్ వరకు బెట్టకు గురి చెయ్యడం ద్వారా ఫిబ్రవరిలో పూత వస్తుంది. పిందె ఏర్పడి పెరిగే దశలో నీటిని ఇవ్వడం ద్వారా పింగె రాలడాన్ని తగ్గించుకోవచ్చు. పాలిథిన్ షీట్, వరిపొట్టు, వేరుశనగ పొట్టు వేసుకోవడం వల్ల కలుపు నివారించడమే కాకుండా నేలలో తేమ ఆవిరి కాకుండా ఉపయోగపడుతుంది.

**పూత మరియు పిందె యాజమాన్యం :** అల్ల నేరేడులో కొత్త చిగురు రెండు దఫాలుగా వస్తుంది. 5 నుండి 10 నెలలు ముదిరిన కొమ్మల మీద మాత్రమే ఎక్కువ పూత ఫిబ్రవరిలో వస్తుంది, అక్టోబర్‌లో కూడా కొన్ని మొక్కల్లో తక్కువ పూత రావడం గమనించడం జరిగింది. ఫలదీకరణం ఉదయం 10.00 నుండి మధ్యాహ్నం 12.00 గంటల మధ్యలో జరుగుతుంది. తేనెటీగలు, ఈగలు, మరియు గాలి ద్వారా పరపరాగసంపర్కం జరిగి ఫలదీకరణం జరుగుతుంది. హెక్టారుకు 10-12 తేనెటీగల పెట్టెలని ఉంచడం వల్ల ఫలదీకరణం బాగా జరిగి ఎక్కువ దిగుబడి సాధించవచ్చు. 20 శాతం చక్కెర ద్రావణం పిచికారి చేయడం వలన పుప్పొడి రేణువులు ఎక్కువగా ఫలదీకరణం జరగడానికి దోహదం చేస్తుంది. పూత విచ్చుకున్న 24 గంటలలో ఎక్కువ ఫలదీకరణం జరిగి, ఆ తరువాత తగ్గిపోతుంది. ఎక్కువ శాతం పూత మరియు పిందె మార్చ్ నెలలో గమనించవచ్చు. జిబ్బరిల్లిక్ ఆమ్లం 60 పిపియం పూత దశలో ఒకసారి మరియు పిందె ఏర్పడిన దశలో మరోసారి 15 రోజుల వ్యవధిలో రెండు మార్లు పిచికారి చేయడం వలన పూత, పిందె రాలడాన్ని అరికట్టవచ్చు.

**కాయ ఎదుగుదల :** అల్లనేరేడు కాయ ఎదుగుదల మూడు దశలలో ఉంటుంది. మొదటి దశ ఫలదీకరణ జరిగిన 15-52 రోజులు మధ్య, రెండవ దశ ఫలదీకరణ జరిగిన 52-58 రోజుల మధ్య మరియు మూడవ దశ ఫలదీకరణ జరిగిన 58-60 రోజుల మధ్య ఉంటుంది. మొదటి దశలో కాయ ఎదుగుదల తక్కువగా, రెండవ దశలో కాయ ఎదుగుదల చాలా ఎక్కువగా మరియు మూడవ దశలో కూడా కొంచెం తక్కువగా కనిపించినా కాయ బరువు, పరిమాణం, నీటిశాతం పెరగడం గమనించవచ్చు. కాయ ముదురు ఊదా రంగులోకి వచ్చిన తర్వాత కోత ప్రారంభించాలి. పూత కొమ్మలో ఉన్న అన్ని కాయలు ఒకేసారి కోతకి రావు.

**కాయ కోత మరియు దిగుబడి :** అల్లనేరేడు విత్తనపు మొక్కలు 8-10 సంవత్సరాల తరువాత, అంటు మొక్కలు 4-5 సంవత్సరాల తరువాత కాపుకి వస్తాయి. జూన్-జూలై నెలలలో కాయలు పండి, కోతకి సిద్ధంగా ఉంటాయి. అల్లనేరేడు పండ్లు పండిన వెంటనే కోయాలి. ఎందుకంటే అవి పండిన తరువాత చెట్టు మీద ఉండకుండా రాలిపోతాయి. పండ్లు కింద పడితే మార్కెట్‌కి తీసుకెళ్ళి అమ్మడానికి రావు. అందుకని పండ్లని చేతితో మాత్రమే కోయాలి. అలాంటి పండ్లు మాత్రమే పాడవకుండా ఉంటాయి. అల్లనేరేడు పండ్లని ప్రతిరోజు కోసి, వెదురు బుట్టలలో ఉంచి మార్కెట్‌కి పంపుతారు. ఒక సంవత్సరంలో ఏపుగా పెరిగిన విత్తనపు మొక్క నుండి 80-100 కిలోలు, అదేవిధంగా అంటు మొక్క నుండి 60-70 కిలోల పండ్ల దిగుబడి వస్తుంది.

**నిల్వ :** అల్లనేరేడు పండ్లు తొందరగా పాడవుతాయి. కాబట్టి ముందుగా పండ్లన్ని గ్రేడ్ చేసుకొని పెట్టుకోవాలి. గ్రేడ్ చేసుకొని పెట్టుకున్న పండ్లు సాధారణ వాతావరణ పరిస్థితుల్లో 2-3 రోజులు ఉంటాయి. రంధ్రాలు కలిగిన పాలిథిన్ బ్యాగుల్లో, 8-10$^{0}$C ఉష్ణోగ్రత మరియు 85-90 శాతం ఆర్ధత దగ్గర 3 వారాల వరకు నిల్వ చేసుకోవచ్చు.

శ్రీమతి బి. విమల, శ్రీమతి పద్మావతి
శాస్త్రవేత్తలు, ఉద్యాన పరిశోధనా స్థానం,
అనంతపురం

**"చీడపీడలపై మీ సందేహాలను 8331056150 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."**

# రైతు బిడ్డను వరించిన పద్మభూషణ్



ఒక సామాన్య భారతీయ రైతు కుటుంబంలో పుట్టి, ప్రపంచం గర్వించదగ్గ వ్యవసాయ శాస్త్రవేత్తగా ఎదిగిన డా. సంజయ్ రాజారామ్‌కు కేంద్ర ప్రభుత్వం ఇటీవల పద్మభూషణ్ అవార్డు ప్రకటించింది. హరిత విప్లవ పితామహుడు నోబెల్ బహుమతి గ్రహీత డా. నార్మన్ బోర్లాగ్ వారసుడిగా ఆయన వినుతికెక్కారు. ఆధునిక వ్యవసాయ విజ్ఞానంలో డా. సంజయ్ ప్రపంచ వ్యాప్త కీర్తి గడించారు. గోధుమ పంటలో ఆయన చేసిన విశేష పరిశోధనల ఫలితంగా నేడు ప్రపంచ వ్యాప్తంగా 51 దేశాల్లో 480 రకాల గోధుమ రకాలు పండిస్తూ 200 మిలియన్ టన్నుల దిగుబడులు సాధిస్తున్నారు. గత ఏడాది ఫిబ్రవరి 17న ఆయన మెక్సికోలో తుది శ్వాస విడిచారు. భారత ప్రభుత్వం దేశ అత్యున్నత మూడో పౌర పురస్కారాన్ని మరణానంతరం ప్రకటించింది.

వారణాసి సమీపంలోని రామ్‌పూర్‌లో 1943లో సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన రాజారామ్ తండ్రి 10 ఎకరాల్లో గోధుమ, మొక్కజొన్న, వరి పండించేవారు. ఐదు మైళ్లు నడిచి వెళ్ళి హైస్కూలు చదువు పూర్తి చేసిన తర్వాత ఉపకార వేతనంతో గోరఖ్‌పూర్ విశ్వవిద్యాలయం నుంచి వ్యవసాయ విద్యలో బిఎస్సీ పూర్తి చేశారు. అనంతరం న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందారు. భారతీయ హరిత విప్లవ పితామహుడు డాక్టర్ స్వామినాథన్ శిష్యరికంలో జెనెటిక్స్, ప్లాంట్ బ్రీడింగ్‌లో పరిశోధనలు చేశారు. ఆస్ట్రేలియాలో పీహెచ్.డి. చేసిన అనంతరం మిన్నెసోటా విశ్వవిద్యాలయంలో డాక్టర్ నార్మన్ బోర్లాగ్ వద్ద పరిశోధకుడిగా చేరారు.

అక్కడి నుంచి ఆయనతోనే మెక్సికోలోని సీఐఎం.ఎం.వైటిలో చేరి గోధుమ పంటలో విస్తృత పరిశోదనలు చేశారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన నేపథ్యం ఇందుకు ఎంతగానో దోహదపడింది. 1969 నుంచి నార్మన్ బోర్లాగ్ మార్గదర్శకత్వంలో మొక్కజొన్న, గోధుమ పంటల్లో విస్తృత పరిశోధనలు చేశారు. తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడులను ఇచ్చే గోధుమ సంకర వంగడాల సృష్టిలో కీలకపాత్ర పోషించారు. గోధుమను ఎక్కువగా ఆశించే తుప్పు తెగులును తుట్టుకునే వంగడాలు రూపొందించే చైనా, పాకిస్తాన్, భారత్ వంటి దేశాల్లో అధిక దిగుబడులు సాధించారు. ఈ కృషికి గాను ఆయనకు 2014లో 'వరల్డ్ ఫుడ్ ప్రైజ్' కూడా వచ్చింది. మెక్సికోలో స్థిరపడినా భారతీయ వ్యవసాయ రంగ అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారు.

## 6.97 లక్షల మెట్రిక్ టన్నులు ఎరువులు సిద్ధం

రాష్ట్రంలో రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు సరఫరా చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమీషనర్ హెచ్. అరుణ్‌కుమార్ తెలిపారు. 2021–22 రబీ సీజన్‌కు అవసరమయ్యే 23.4 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. వ్యవసాయ అధికారుల సూచన మేరకు యూరియా వినియోగించాలని ఆయన సూచించారు. గత ఏడాది అక్టోబర్ నాటికి రాష్ట్రంలో ఉన్న యూరియాతో కలిపి 6.97 లక్షల మెట్రిక్ టన్నులు ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆర్.బి.కే. లు అందిస్తున్న సేవలు ఇతర వ్యవసాయ సమస్యలకు టోల్ ఫ్రీ నెం. 155251 లో సంప్రదించాలని కోరారు.

**"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"**



# సమీకృత రైతు సమాచార కేంద్రం టోల్ ఫ్రీ నంబరు 155251 కు రైతుల ప్రశ్నలు - సమాధానాలు

## వ్యవసాయ పంటలు :

1. శ్రీనివాస రెడ్డి, పామర్రు గ్రా., పామర్రు మం., కృష్ణా జిల్లా, ఫోన్ : 8179876245.

**ప్ర. నువ్వుల్లో వేరుకుళ్లు, కాండం కుళ్ళు ఎలా నివారించాలి?**

జ. తెగుళ్ళను తట్టుకొనే రకాలైన రాజేశ్వరి, శ్వేతాతిల్‌లను సాగు చేయాలి. కిలో విత్తనానికి 3 గ్రా. థైరామ్ కలిపి విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలి.కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మాంకోజెబ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

2. జి.అయ్యస్వామి, కోడుమూరు గ్రా., కొత్తపల్లి మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 7601064453.

**ప్ర. మాకు కొద్దిపాటి నీటి సౌకర్యం ఉంది. రబీ కందిలో తప్పని సరిగా నీటి తడులు ఎప్పుడెప్పుడు ఇవ్వాలి?**

జ. రబీ కందిని ఆరుతడి పంటగా సాగుచేస్తే, 4-5 నీటి తడులు అవసరమవుతాయి. పైరు విత్తేటపుడు తగినంత తేమ ఉండేటట్లు చూడాలి. పూత దశలో ఏ మాత్రం బెట్టకు గురైనా, పూత రాలే అవకాశం వుంది. అందువలన పైరు, సున్నిత దశ, పూతదశ, కాయ దశ, గింజ కట్టే దశలో తప్పని సరిగా నీటి తడులివ్వాలి.

3. నాంచారయ్య, గాంధీనగరం గ్రా., మాచవరం మం., గుంటూరు జిల్లా, ఫోన్ : 9966761165.

**ప్ర. రాగి వేసి 25 రోజులైంది. కలుపు ఎక్కువగా వుంది. నిర్మూలన చర్యలు తెలుపగలరు?**

జ. ఎకరాకు 400 గ్రా. 2-4డి సోడియం సాల్ట్ అనే కలుపు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసినట్లయితే కలుపును సమర్థవంతంగా నిర్మూలించవచ్చును.

4. బి. సోమశంకర్, అలసందగుట్ట గ్రా., ఆదోని మం., కర్నూల్ జిల్లా, ఫోన్ : 6303153137.

**ప్ర. జింకును వేయాలనుకుంటున్నాము, దానిని ఇతర ఎరువులతో కలిపి వాడవచ్చునా?**

జ. జింకును భాస్వరము ఎరువులతో కలిపి వేయరాదు. ముందుగా జింక్ వేసుకొని, రెండు రోజుల తరువాత మిగతా ఎరువులు వేసుకోవాలి.

5. రామసుబ్బారెడ్డి, తాడిగోట్ల గ్రా., చింతకుంట మం., వై.యస్.ఆర్. కడప జిల్లా, ఫోన్ : 9908479157.

**ప్ర. కంది పంట వేసి 120 రోజులు అయినది. కాయలలో పురుగు ఆశించినది.నివారణ తెలియజేయగలరు?**

జ. కంది పంటలో కాయ ఈగ ఆశించినది. నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

6. మైసూరారెడ్డి, గాడిపర్తిపాలెం గ్రా., చీమకుర్తి మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 9346434604.

**ప్ర. మొక్కజొన్న సుడులలో పురుగు వుంది. నివారణ చెప్పండి?**

జ. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించినది.నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా.ను లీటరు నీటిలో కలిపి సుడులు బాగా తడిచేటట్లు పిచికారీ చేసుకోవాలి.

7. ప్రశాంత్, సిద్దరామపురం గ్రా., బొమ్మనహాళ్ మం., అనంతపురం జిల్లా, ఫోన్ : 6300327671.

**ప్ర. జొన్న పంట వేసి 90 రోజులు అయినది.కంకులనుండి బంక కారుతుంది.దీనికి నివారణ తెలుపండి?**

జ. నివారణకు ప్రొపికోనజోల్ 0.5 మి.లీ లేదా మాంకోజెబ్ కార్బెండిజమ్ 2.5 గ్రా. ను లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి.

8. వెంకటేశ్వర్లు, కర్వెన గ్రా., బండి ఆత్మకూరు మం., కర్నూల్ జిల్లా, ఫోన్ : 6300950340.

**ప్ర. మినుము పంటలో మొక్కలు ఎండిపోతున్నాయి. నివారణ తెలుపగలరు?**

జ. మినుములో కాండపు ఈగ క్రిమి దశ కాండంలో చేరి తినటం వలన మొక్క ఎండిపోతుంది. నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

9. ఉప్పులూరు సుబ్బారావు, గొట్టుముక్కల గ్రా., కంచికచర్ల మం., కృష్ణా జిల్లా, ఫోన్ : 9704757954.

**ప్ర. శనగ పంటలో పచ్చరబ్బరు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నది. నివారణ తెలుపండి?**

జ. శనగ పంటలో పచ్చరబ్బరు పురుగు నివారణకు క్లోరోపైరిఫాస్ 50 ఈ.సి. 1 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా థయోమిథాక్సమ్ 1.25 గ్రా.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

"చీడపీడలపై మీ సందేహాలను 8331056152 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."

10. ప్రసాద్ రెడ్డి, తెల్లమపురం గ్రా., ప్రొద్దుటూరు మం., కడప జిల్లా, ఫోన్ : 9603127050.

ప్ర. **ప్రస్తుత కాలంలో పెసర పంట వేసుకోవచ్చా? అనువైన రకాలను తెలియచేయగలరు?**

జ. పెసర పంటను ఫిబ్రవరి-మార్చి నెలల్లో విత్తుకోవాలి. ఎల్.జి.జి.-407, ఎల్.జి.జి-460, ఎల్.జి.జి-450, ఎల్.జి.జి-410 వంటివి అనువైన రకాలు.

## ఉద్యాన శాఖ :

1. మోదిశెట్టి నాగబాబు, ఆనూరు గ్రా., తొండంగి మం., తూర్పు గోదావరి జిల్లా, ఫోన్ : 9951502759

ప్ర. **టమాట పంటలో మొక్కలు గిడసబారి, పూత పిందే పట్టక ఎండిపోతున్నాయి. నివారణ చర్యలు తెలుపగలరు?**

జ. టమాట పంటలో తామర పురుగులు ద్వారా స్పాటెడ్ విల్ట్ వైరస్ వ్యాప్తి చెందినది. నివారణకు ఇమిడాక్లోరోప్రిడ్ 0.4 మీ.లి. లేదా డైమిథోయేట్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

2. పేరపు కొండబాబు, తునివలస గ్రా., చీడికాడ మం., విశాఖపట్నం జిల్లా, ఫోన్ : 9491907310

ప్ర. **పనస పంటలో కాయలు పక్వానికి రాకముందే కుళ్ళి పోతున్నాయి. నివారణ చెప్పగలరు?**

జ. పనస పంటలో కాయ కుళ్ళు తెగులు ఆశించినది నివారణకు మాంకోజబ్ 2.5 గ్రా. లేదా కార్బండిజమ్ 1 గ్రా. లీటరు నీటికి చొప్పున పిందె సమయంలో తర్వాత కాయ పెరుగుదల సమయంలో 15 రోజుల అంతరంలో పిచికారి చేయవలెను.

3. కాకుమూరి సుబ్బారెడ్డి, బసవపల్లి గ్రా., కొమరోలు మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 8106442301

ప్ర. **పుచ్చ పంటలో చిన్న పురుగులు ఆకులను, పూలను కొరికి తింటున్నాయి. నివారణ తెలుపండి?**

జ. పుచ్చ పంటలో గుమ్మడి పెంకు పురుగులు ఆశించినవి. నివారణకు థయోడికార్బ్ 1 గ్రా. లేదా ప్రొఫినోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను.

4. ఎల్. సుకుమార రెడ్డి, అల్లిరెడ్డిపల్లి గ్రా., వేంపల్లి మం., కడప జిల్లా, ఫోన్ : 9490132890

ప్ర. **బత్తాయిలో కొమ్మలపై చిన్న పురుగులు ఉన్నాయి. నివారణ తెలుపండి?**

జ. బత్తాయిలో ఎగిరే పేను (సిల్లిడ్స్) ఆశించినది నివారణకు డైమిథోయేట్ 2 మీ.లి లేదా ఇమిడాక్లోరోప్రిడ్ 17.5 ఎస్.ఎల్ 0.25 మీ.లి. లీటరు నీటికి కలిపి చిన్న పురుగులు గమనించిన వెంటనే మందును పిచికారి చేయాలి.

5. జే రామంజి, గోసానపల్లి గ్రా., డోన్ మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 8985282883

ప్ర. **బంతి పైరులో లేత మొక్కలు చనిపోతున్నాయి నివారణ తెలుపగలరు?**

జ. బంతి పైరులో నారు కుళ్ళు తెగులు నివారణకు మళ్ళను పరిశుభ్రంగా ఉంచవలెను. నేలను లీటరు నీటికి కాప్టాన్ 2 గ్రా. లేదా కార్బండిజమ్ 1 గ్రా. కలిపిన మందు ద్రావణంతో తడపాలి.

6. నరేష్, కోగిలేరు గ్రా., పెదపంజిని మం., చిత్తూర్ జిల్లా, ఫోన్ : 9000930669

ప్ర. **2 సంవత్సరాల జామ పంటలో పండ్లపై గోధుమ రంగు మచ్చలు వచ్చి చిన్న చిన్న గుంతలుగా ఏర్పడ్డాయి. నివారణ తెలుపండి?**

జ. జామ పంటలోఆంత్రక్నోస్ కుళ్ళు తెగులు ఆశించినది నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్‌ను 3 గ్రా. లేదా కార్బండిజమ్ 1 గ్రా. లీటరు నీటిలో కలిపి కాయ తయారయ్యే సమయంలో 10-15 రోజుల వ్యవధితో కాయ పూర్తిగా తయారయ్యే వరకు పిచికారి చేయవలెను.

7. కృష్ణ, రుద్రవరం గ్రా., కర్నూలు మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 9704363339

ప్ర. **ఉల్లిలో వేర్లు కుళ్ళిపోయి మొక్కలు చనిపోతున్నాయి. నివారణ చెప్పగలరు?**

జ. ఉల్లిలో వేరుకుళ్ళు తెగులు నివారణకు లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను కలుపుకొని పిచికారి చెయ్యాలి.

8. రామకృష్ణ, కప్పోటి గ్రా., అదోని మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 9133625894

ప్ర. **బీరలో ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి పండుబారి ఎండిపోతున్నాయి. నివారణ తెలపండి?**

జ. బీరలో బూజు తెగులు నివారణకు ప్రోపికొనజోల్ 1 మీ.లీ. లేదా మాంకోజెబ్ మెటలాక్సీల్ 2 గ్రా.ను లీటరు నీటికి కలిపి పిచికారి చెయ్యాలి.

9. నారాయణాద్రి, ఇందుకూరుపేట గ్రా., ఇందుకూరుపేట మం, నెల్లూరు జిల్లా, ఫోన్ : 9885248464.

ప్ర. **వంగలో పూత రాలుటను అరికట్టడం ఎలా?**

జ. వంగ పంటలో పూత, కాత దశలో లీటరు నీటికి 2,4-డి 10 మి.గ్రా. లేదా నాప్తలీన్ అసిటికామ్లం 1 మి.లీ. 4 లీటర్ల నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి. ఎల్లప్పుడూ తగినంత తేమ ఉండేటట్లు చూడాలి.

10. రైతు పేరు: కర్లపూడి తేజ, గ్రామం: కోప్పల్ల, మండలం: తెనాలి, జిల్లా: గుంటూరు, ఫోన్ నెం: 9493924140

ప్ర. **గులాబి మొగ్గలు నల్లబడి సరిగా విచ్చుకోవడం లేదు. ఎలా నివారించాలి?**

జ. పేనుబంక పురుగు ఆశించి, రసం పీల్చడం వల్ల మొగ్గ నల్లగా మారుతుంది. దీని నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"**

# సమీకృత రైతు సమాచార కేంద్ర వాట్సప్ నెంబర్లకు వచ్చిన రైతుల సందేహాలు - సమాధానాలు

83310 56028
83310 56149
83310 56150
83310 56152
83310 56153
83310 56154



1. సహబిష్, కప్పట్రాళ్ల గ్రా., దేవనకొండ మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 970352242

**ప్ర. బత్తాయి మొక్కలు వేసి సంవత్సరం అయినది.ఆకులు పండుబారుతున్నాయి. నివారణ చర్యలు తెలపండి?**

జ. బత్తాయి మొక్కలలో ఎగిరే పేను (సిల్లిడ్స్) ఆశించినవి. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ.ను లీటరు నీటికి చొప్పున కలిపి పురుగు ఉధ్రుతి తగ్గేంతవరకు మందులను మార్చి మార్చి పిచికారీ చేసుకోవాలి.



2. బి. సోమశంకరు, అలసంద గుత్తి గ్రా., ఆదోని మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 6303153137

**ప్ర. తెల్లజొన్న పంటలో మధ్య ఆకులు ఎండిపోయి వాడిపోతున్నాయి. నివారణ చెప్పండి?**

జ. తెల్ల జొన్నలో కాండం తొలిచే పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జి. గుళికలు 4 కిలోలు కాండం సుడులలో పడేటట్లుగా ఒక ఎకరం పంటలో వేసుకోవాలి.



3. ఏ. శ్రీనివాసరావు, కౌతావారి అగ్రహారం గ్రా., జగ్గయ్యపేట మం., కృష్ణా జిల్లా, ఫోన్ : 9849863887

**ప్ర. బీర పంటలో లద్దె పురుగు కనబడుతుంది. నివారణ తెలుపగలరు?**

జ. బీరలో లద్దె పురుగులు నివారణకు లీటరు నీటికి క్లోరోపైరిఫాస్ 2.5 మి.లి. లేదా క్వినాల్ఫాస్ 2 మి.లి. లేదా థయోడికార్బ 1.5 గ్రా.ను పూతకు ముందు దశలో లీటరు నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి.



4. శ్రీనివాస రావు, శివాపురం గ్రా., తల్లూరు మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 9553786200

**ప్ర. కంది కాయల్లో రంధ్రాలు ఉండి పురుగులు ఉన్నది. నివారణకు ఏమి పిచికారి చేయాలి?**

జ. కంది పంటలో మారుకా మచ్చల పురుగు నివారణకు క్లోరంత్రనిలిప్రోల్ 0.3 మి.లి.ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవలెను.



5. బోయ తిక్కయ్య, కరివేముల గ్రా., దేవనకొండ మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 7569537340

**ప్ర. వేరుశనగలో ఆకులపై నల్లని మచ్చలు ఏర్పడ్డాయి. నివారణ చెప్పగలరు?**

జ. వేరుశనగ పైరుపై టిక్కా ఆకుమచ్చ తెగులు నివారణకు క్లోరోథలోనిల్ 2 గ్రా. లేదా హెక్సకొనాజోల్ 2 మి.లీ. లేదా టెబ్యుకోనజోల్ 1 మి.లీ. ను లీటరు నీటికి పిచికారి చేసుకోవాలి.

**"చీడపీడలపై మీ సందేహాలను 8331056153 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."**

6. విప్పర్ల రామయ్య, భూమనపల్లె గ్రా., దొనకొండ మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 8688671014



**ప్ర. బొప్పాయిలో శెనగ పచ్చ పురుగు కాయల్ని తొలిచి తింటోంది. నివారణ తెలియజేయగలరు?**

జ. బొప్పాయి కాయలపై శనగ పచ్చ పురుగు నివారణకు ఫ్లూబెండమైడ్ 0.3 మి.లీ లేదా నోవాల్యూరాన్ 1 మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా.ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవలెను.



7. వేమిరెడ్డి కృష్ణా రెడ్డి, చౌటపల్లి గ్రా., తిరువూరు మం., కృష్ణా జిల్లా, ఫోన్ : 9701697665

**ప్ర. ప్రత్తి పంటలో ఆకులు ఎర్రబారి ఎండి రాలిపోతున్నాయి. నివారణ తెలియజేయగలరు?**

జ. మెగ్నీషియం లోపం సవరణకు మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రా.ను ఒక లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలి.

8. నరేష్, కొగిలేరు గ్రా., పెద్దపంజని మం., చిత్తూరు జిల్లా, ఫోన్ : 9000930669



**ప్ర. జామ లో కాయాలపై నల్లని మచ్చలు ఏర్పడుతున్నాయి. నివారణ తెలుపగలరు?**

జ. జామలో ఆంత్రాక్నోసిస్ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా కార్బెండిజమ్ 2 గ్రా. ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవలెను.



9. దేగ ప్రసాద్, మునగపాక గ్రా., మునగపాక మం., విశాఖపట్నం జిల్లా, ఫోన్ : 8520846904

**ప్ర. కొబ్బరి ఆకులపై తెల్లని వలయాల్లా పురుగు ఉంది. నివారణకు ఏమి చేయాలి?**

జ. కొబ్బరిలో సర్పిలాకార తెల్లదోమ నివారణకు పసుపు రంగు జిగురు అట్టలను చెట్లకి కట్టాలి. అజాడిరక్టిన్ 10000 పి.పి.ఎం 1 మి.లీ. 10 గ్రా. సర్ఫ్ పొడిని 1 లీటరు నీటికి కలిపి ఆకు అడుగు భాగాలు పూర్తిగా తడిచేలా పిచికారి చేయాలి. మసిమంగు నివారణకు గంజిపొడి 10 గ్రా.ను లీటరు నీటికి కలిపి మసి బూజు ఆశించిన భాగాలపై పిచికారి చేయాలి.

10. జి. హరికృష్ణ, జి – కొచ్చేరువు గ్రా., డోన్ మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 6301776072



**ప్ర. చామంతిలో శనగపచ్చ పురుగు పువ్వులను తినివేస్తున్నది. నివారణ తెలుపగలరు?**

జ. చామంతి పూలపై శనగపచ్చ పురుగు నివారణకు నొవాల్యురాన్ 1 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. లింగాకర్షక బుట్టలు ఎకరానికి నాలుగు చొప్పున పెట్టాలి.

**"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"**

# సమీకృత రైతు సమాచార కేంద్రానికి రైతులు తరచూ అడిగే ప్రశ్నలు

1. బి.సోమశేఖర్, అలసందగుట్ట గ్రా., అధోని మం., కర్నూల్ జిల్లా, ఫోన్ : 6303153137.

**ప్ర. తెల్లజొన్నలో మొవ్వు చనిపోయి, తెల్ల కంకి ఏర్పడుతుంది. నివారణ తెలుపగలరు?**

జ. తెల్లజొన్నలో కాండం తొలుచు పురుగు ఆశించినది. నివారణకు క్లోరాంట్రినిలిప్రోల్ 0.3 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారి చెయ్యాలి.

2. ఎస్.మాలకొండయ్య, బింగినిపల్లె గ్రా., సింగరాయకొండ మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 9848390582

**ప్ర. వరిలో ఆకులు తెల్లగా అయి కొనలు తెగిపోతున్నాయి. ఏమి చేయాలి?**

జ. వరిలో ఆకుచుట్టు పురుగు ఆశించినది. నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా క్లోరోపైరిఫోస్ 2.5 మి.లీ.ను లీటరు నీటితో కలిపి పైరు పూర్తిగా తడిసేటట్లుగా పిచికారీ చేసుకోవాలి.

3. జి.వెంకటేశ్వర్లు, బెస్తవారిపేట గ్రా., బెస్తవారిపేట మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 6301981025

**ప్ర. కందిలో పూత పురుగు నివారణ తెలపండి?**

జ. కందిలో పూత పురుగు నివారణకు థయోడికార్బ్ 1 గ్రా. లేదా క్లోరంత్రనిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

4. గోపాల్ రెడ్డి, ఆదిగోపుల గ్రా., దుర్గి మం., గుంటూరు జిల్లా, ఫోన్ : 9701466079

**ప్ర. శనగ పంటలో వేర్లు నల్లగా మారి కుళ్ళిపోతున్నాయి. నివారణ తెలుపగలరు?**

జ. శనగ పంటలో వేరు కుళ్ళు తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్క మొదలు తడిచేలా పిచికారీ చేయండి.

5. హుస్సేన్ భాష, ఉప్పలపాడు గ్రా., అవకు మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 9642821020

**ప్ర. మిరప పూతలో పురుగు ఉంది.నివారణ తెలపండి?**

జ. మిరపలో పూత పురుగు నివారణకు బవేరియా బాసియానా 1 కేజీ ఎకరాకు పిచికారి చేసుకోవాలి. ఇది పిచికారి చేసిన తరువాత ఎటువంటి పురుగు మందులు పిచికారి చేయరాదు.

6. పి. శ్రీనివాసులు, కేశంనేనిపల్లి గ్రా., కలువాయి మం., నెల్లూరు జిల్లా, ఫోన్ : 9848612382

**ప్ర. వంగ పంటలో కొమ్మలు వాలిపోతున్నాయి మరియు కాయలో పురుగు ఉంది. నివారణ తెలుపగలరు?**

జ. వంగలో మొవ్వ మరియు కాయ తొలుచు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయవలెను

7. సుప్రజ, పాములపాడు గ్రా., పొదిలి మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 8184958384.

**ప్ర. చిక్కుడు మొక్కలు పండుబారి, గిడసబారి పోతున్నాయి. నివారణ తెలపండి?**

జ. చిక్కుడులో పెనుబంక ఉంది నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికీ కలిపి పిచికారీ చేసుకోవాలి

8. శ్రీను, టంగుటూరు గ్రా., టంగుటూరు మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 9618086228.

**ప్ర. బొప్పాయిలో రింగ్ స్పాట్ తెగులు సోకిన మొక్కలలో కాయ నాణ్యత పెరగడానికి సలహా ఇవ్వండి?**

జ. బొప్పాయిలో రింగ్ స్పాట్ తెగులు సోకిన మొక్కలలో దిగుబడి మరియు కాయ నాణ్యతను పెంచడానికి యూరియా 10 గ్రా. జింక్ సల్ఫేట్ 1.5 గ్రా. బోరాన్ 1 గ్రా.ను లీటరు నీటికి కలిపి 30 రోజుల వ్యవధిలో 8 నెలల వరకు పిచికారి చేయాలి.

9. ఆదినారాయణ రెడ్డి, వీరబల్లె గ్రా., వీరబల్లె మం., కడప జిల్లా, ఫోన్ : 9490549976

**ప్ర. మామిడిలో పూత నల్లగా మారిపోతున్నది. నివారణ తెలుపగలరు?**

జ. మామిడిలో తేనె మంచు పురుగు ఆశించినది. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లి. లేదా థయోమిథాక్సమ్ 0.3 మి.లి.ను లీటరు నీటికి కలిపి మొక్క ఆకుల పైనే కాకుండా చెట్టు మొదలు, కొమ్మలు పైన పిచికారి చేయాలి.

10. జి. హరికృష్ణ, జి-కొచ్చేరువు గ్రా., డోన్ మం., కర్నూలు జిల్లా, ఫోన్ : 6301776072

**ప్ర. చామంతి మొక్కల వేర్లు కుళ్లిపోతున్నాయి. నివారణ తెలుపగలరు?**

జ. చామంతిలో వేరుకుళ్ళు తెగులు నివారణకు కాప్టాన్ 1.5 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా.ను లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

**"చీడపీడలపై మీ సందేహాలను 8331056154 కు వాట్సప్ ఫోటో పంపండి. వాటిని నివృత్తి చేసుకోండి."**




# రైతుల స్పందన

బెండ పంటలో బూడిద తెగులు నివారణకు సమీకృత రైతు సమాచార కేంద్రం వారికి ఫోన్‌చేసి వారి సూచన మేరకు హెక్సోనజోల్ 2 మి.లి.ను ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేసాను. తెగులు తగ్గింది. వారికి ధన్యవాదాలు

కల్లూరి రమేష్, చాపట్ల గ్రా., ధోన్ మం., అనంతపూర్ జిల్లా. ఫోన్ : 8328066885.

యం. బాల వెంకటేశ్వర్లు, ఇసుకత్రిపురాంతకం గ్రా., పుల్లలచెరువు మం., ప్రకాశం జిల్లా, ఫోన్ : 9618081465.

వరిలో అకుముడత నివారణకు సమీకృత రైతు సమాచార కేంద్రం వారికి ఫోన్‌చేసి వారి సూచన మేరకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 మి.లీ.ను ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేసాను. పురుగు తగ్గింది. ఐ.సి.సి. వారికి నా ధన్యవాదములు

అరటిలో సిగటోక అకుమచ్చ తెగులు నివారణకు ఐ.సి.సి. వారికి ఫోన్ చేసి వారి సలహా మేరకు అజాక్సిస్ట్రోబిన్ 1 మి.లి.ను ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేసాను. తెగులు తగ్గింది. ఐ.సి.సి. వారికి ధన్యవాదములు

టి. నాయుడు, చెర్లోపల్లె గ్రా., పుట్లూరు మం., అనంతపూర్ జిల్లా, ఫోన్ : 9505821593.

వి. రామయ్య, భుమనపల్లె గ్రా., వినుకొండ మం., గుంటూరు జిల్లా, ఫోన్ : 8688671014.

బొప్పాయిలో కాయ కుళ్ళు నివారణకు సమీకృత రైతు సమాచార కేంద్రం వారికి ఫోన్‌చేసి వారి సూచన మేరకు ప్రొపికోనజోల్ 1 మి.లీ.ను ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేసాను. తెగులు తగ్గింది. మంచి సలహా ఇచ్చిన ఐ.సి.సి. వారికి ధన్యవాదములు

మినుములో బూడిద తెగులు నివారణకు సమీకృత రైతు సమాచార కేంద్రం వారికి ఫోన్‌చేసి వారి సలహా మేరకు ప్రొపికోనజోల్ 1 మి.లీ.ను ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేసాను. తెగులు తగ్గింది. వారికి నా ధన్యవాదములు

వెంకట శివ, జూపాడు గ్రా., జూపాడు మం., కర్నూల్ జిల్లా, ఫోన్ : 9989986342.

పి. శ్రీనువాసులు, కేసమినేనిపల్లె గ్రా., కలువాయ్ మం., నెల్లూరు జిల్లా, ఫోన్ : 9848612382.

వంగలో మొవ్వ మరియు కాయ తొలుచు పురుగు నివారణకు ఐ.సి.సి. వారికి ఫోన్ చేసి వారి సలహా మేరకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ.ను ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేసాను. పురుగు తగ్గింది. మంచి సలహా ఇచ్చిన ఐ.సి.సి. వారికి కృతజ్ఞతలు

"సాగులో సందేహమా? 155251 కు ఫోన్ చేయండి. ఒక్క ఫోన్ కాల్‌తో అన్నదాతల సందేహాల నివృత్తి"

## 73వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా వ్యవసాయ శాఖ కమీషనర్ శ్రీ హెచ్. అరుణ్‌కుమార్ నుంచి ఉత్తమ సేవల పురస్కారాలు అందుకున్న వి.ఏ.ఏ.లు



**చింటు అశోక్ కుమార్**
పాగోడు గ్రా., జలుమూరు మం.,
శ్రీకాకుళం జిల్లా



**ఆర్. హేమేశ్వరరావు**
పాలగర గ్రా., బలిజిపేట మం.,
విజయనగరం జిల్లా



**బి. లావణ్య**
తవ్వావానిపాలెం గ్రా.,
సబ్బవరం మం., విశాఖపట్నం జిల్లా



**ఎం.వి.వి. రమణ**
అచ్చెంపేట గ్రా., సామర్లకోట మం.,
తూర్పు గోదావరి జిల్లా



**పాలా రాంబాబు**
ముప్పర్తిపాడు గ్రా., గణపవరం మం.,
పశ్చిమ గోదావరి జిల్లా



**మైనేని యామిని**
వణుకూరు గ్రా., పెనమలూరు మం.,
కృష్ణా జిల్లా



**కూచిక ప్రియాంక**
వీరాపురం గ్రా., పిడుగురాళ్ళ మం.,
గుంటూరు జిల్లా



**చింత వెంకటేశ్వర్లు**
గజ్జలకొండ-2, మార్కాపురం మం.,
ప్రకాశం జిల్లా



**కమ్మ శ్రీకళ**
కాత్రేయపాడు గ్రా.,
దగదర్తి మం., నెల్లూరు జిల్లా



**బి. సురేష్**
గోపాలపురం గ్రా., సి.కె. దిన్నె మం.,
కడప జిల్లా



**యం. నరసింహ**
యు. కొత్తపల్లి గ్రా., డోన్ మం.,
కర్నూలు జిల్లా



**కె. నరేష్ కుమార్**
మర్తాడు-2, గార్లదిన్నె మం.,
అనంతపురం జిల్లా



**పి. గంగా సింధు**
టి. ఒడ్డేరు గ్రా., పలమనేరు మం.,
చిత్తూరు జిల్లా



శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి

## రైతన్నకు అండగా జగనన్న ప్రభుత్వం..

"ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు పూర్తి పరిహారం అందాలి.. అదీ సకాలంలో అందాలి"..

**ఏ సీజన్లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే నష్ట పరిహారం చెల్లిస్తామన్న మాట మరోసారి నిలబెట్టుకుంటూ...**

# రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీ..

2021 నవంబర్ లో కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల పంట నష్టంతో పాటు నేల కోత, ఇసుక మేటల కారణంగా నష్టపోయిన **5,97,311** మంది రైతన్నలకు రూ. **542.06** కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ, **1220** రైతు గ్రూపులకు వైఎస్సార్ యంత్ర సేవా పథకం క్రింద రూ. **29.51** కోట్ల లబ్ధితో కలిపి మొత్తం రూ. **571.57** కోట్లను గౌరవ ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గారు ఫిబ్రవరి 15న రైతుల ఖాతాలకు నేరుగా జమచేశారు.

రబీలో విత్తనాలు వేసుకొని వర్షాల వల్ల మొలక శాతం దెబ్బతిన్న రైతులకు 80 శాతం రాయితీతో మళ్లీ విత్తుకోవడానికి 1.21 లక్షల క్వింటాళ్ల విత్తనాలు ఆరోజే అప్పటికి అప్పుడే సరఫరా చేసిన మనసున్న జగనన్న ప్రభుత్వం...

## నాడు

**గత ప్రభుత్వంలో...**

అశాస్త్రీయంగా పంట నష్టాల అంచనా.. అయినవారికే పరిహారం.. రైతన్నలు క్షేత్రస్థాయి ఉద్యోగుల చుట్టూ తిరిగి ఏళ్ళ తరబడి ఎదురు చూసినా నష్ట పరిహారం అందుతుందో లేదో తెలియని దుస్థితి.. కొన్ని సందర్భాలలో పూర్తిగా ఎగ్గొట్టి మరికొన్ని సందర్భాలలో రెండు, మూడు సీజన్ల తరువాతనే సాయం అందేది. అరకొరగా అందే ఆ పరిహారానికి కూడా మధ్యవర్తులు, దళారులకు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి...

**గతంలో.. అరకొరగా, ఆలస్యంగా, అదీ కొందరికే సాయం..**

- 2014 ఖరీఫ్ లో సంభవించిన కరవుకు నవంబరు 2015 లో, 2015 కరవుకు నవంబరు 2016 లో సాయం అందించారు
- 2015 నవంబరు, డిసెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు జరిగిన రూ. 260.43 కోట్ల పంట నష్టానికి అందించిన సాయం "సున్నా"..
- 2016 కరవుకు జూన్ 2017 లో, 2017 కరవుకు ఆగస్టు 2018 లో 2018 పెథాయి సైక్లోన్ నష్టాలకు ఫిబ్రవరి 2019 లో సాయం అందించారు.
- 2018 లో కరవు వల్ల ఖరీఫ్ లో రూ.1,832.28 కోట్లు, రబీ లో రూ. 356.45 కోట్ల పంట నష్టానికి అందించిన సాయం "సున్నా"..

- కౌలు రైతులకు ఎలాంటి మేలు జరగలేదు.. వాస్తవ సాగుదారులు కాని భూ యజమానులకు మాత్రమే లబ్ధి..

- రైతన్నలకు లబ్ధిదారుల జాబితా చూసుకునే వెసులుబాటు లేని దుస్థితి.. పారదర్శకతకు పాతర..

## నేడు

**మనందరి ప్రభుత్వంలో...**

శాస్త్రీయంగా, అర్హులెవరూ మిగిలిపోకుండా ఈ-క్రాప్ ఆధారంగా పంట నష్టాల అంచనా.. పారదర్శకతకు పెద్దపీటవేస్తూ, గ్రామ సచివాలయాల్లో అర్హుల జాబితాలు ప్రదర్శించి మరీ, ఏ సీజన్ లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే పరిహారాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్న జగనన్న ప్రభుత్వం..

**మరి నేడు.. ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే..**

- 2020 మార్చి వరకు కురిసిన భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన 1.56 లక్షల మంది రైతులకు రూ. 123.70 కోట్ల ఇన్ పుట్ సబ్సిడీ 2020 ఏప్రిల్ లో అందజేత.
- 2020 ఏప్రిల్ నుండి 2020 అక్టోబర్ వరకు కురిసిన భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన 3.71 లక్షల మంది రైతులకు రూ. 278.87 కోట్ల ఇన్ పుట్ సబ్సిడీ 2020 అక్టోబర్‌లో అందజేత..
- 2020 నవంబర్ లో నివర్ సైక్లోన్ వల్ల నష్టపోయిన 8.35 లక్షల మంది రైతులకు రూ. 645.99 కోట్ల ఇన్ పుట్ సబ్సిడీ 2020 డిసెంబర్ లో అందజేత.
- 2021 సెప్టెంబర్ లో గులాబ్ సైక్లోన్ వల్ల నష్టపోయిన 34,556 మంది రైతులకు రూ. 21.96 కోట్ల సాయం 2021 నవంబర్‌లో అందజేత..

- ఈ-క్రాప్ డేటా ఆధారంగా పంట నష్టాలకు ఇన్ పుట్ సబ్సిడీ ఇస్తున్నందున కౌలు రైతులతోపాటు వాస్తవ సాగుదారులందరికీ లబ్ధి..

- లబ్ధిదారుల జాబితాలు సోషల్ ఆడిట్ కొరకు రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నందున గ్రామ స్థాయిలోనే రైతులు తమ వివరాలు చూసుకొని, పేర్లు లేకపోతే ఫిర్యాదు చేసుకొనే వెసులుబాటు..




**జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన 19.93 లక్షల మంది రైతన్నలకు అందించిన ఇన్‌పుట్ సబ్సిడీ అక్షరాల రూ. 1,612.62 కోట్లు..**

శ్రీ కురసాల కన్నబాబు
వ్యవసాయ, సహకార, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ శాఖ మంత్రి

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం